ఆంధ్రప్రదేశ్



స్మితలతాంతలతాంతరదంతురమ్
నవవసంతవనాంతమతంద్రితమ్.

జూన్, 1965
25 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 9

జూన్, 1965

సంచిక : 8

జేష్ఠ-ఆషాఢ 1887 శకం

ప్రధాన సంపాదకుడు

టి. రామచంద్రరావు

సంపాదకుడు :

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ఈ సంచికలో

మొదటి అట్ట :

ఫొటో : శ్రీ యస్. ఆర్. కె. రావు

"స్మితలతాంతలతాంతరదంతురం
నవవసంతవనాంతమతంద్రితం."

వికసించి పూవులుగల తీగలచేత నడుమ నడుమ వ్యాప్తమైన ఉద్యానవనము నవవసంత ఋతువునందు కళకళలాడుచున్నది.

రెండవ అట్ట :

ఫొటో : శ్రీ సుభాషిణి బి. యస్. రావు

కృత్స్నస్య జగతోఽయం ప్రతిబింబ ఇవ స్థితః
ఆకాశ ఇవ దుర్లంఘ్యః దక్షిణః సాగరో మహాన్.

ఆకాశమువలె దాటుటకు అలవికాని యీ సముద్రము సమస్త ప్రపంచముయొక్క ప్రతిబింబమా అన్నట్లు ఉన్నది.

మూడవ అట్ట :

ఫొటో : శ్రీ యస్. ఆర్. కె. రావు

సురభితకకుబంతా నందనోద్యానశోభా
సువికసితలతాంతా భాతి కాశ్మీరశోభా.

బాగుగా వికసించిన పూవులు గల కాశ్మీర శోభ దిగంతములను పరిమళింపజేయుచున్నదై నందనవనశోభతో ప్రకాశించుచున్నది.

నాల్గవ అట్ట :

ఫొటో : శ్రీ టి. రామచంద్రరావు
ప్రధానసంపాదకులు

వైతస్తాంబుప్లవగృహచయైః
భాతికాశ్మీరశోభా.

వితస్తానదీజలములందలి నౌకాగృహముల చేత కాశ్మీరశోభ రమణీయముగా ప్రకాశించుచున్నది.

ముఖ్యమంత్రి లేఖ ... 2

ఆడపడుచులై (సీరియల్) ... 4
— వాసిరెడ్డి సీతాదేవి

కచ్‌లో పాకిస్థాన్ విద్రోహం ... 9

కామనీయక ... 16
— సంపత్కుమార్

ఎఱ్ఱన – పోతన (సామ్యపరిశీలన) ... 17
— ఎస్వీ రామారావు

ఏరిన ముత్యాలు ... 22

బ్రతికిన కాలేజీ (సీరియల్) ... 25
— పాలగుమ్మి పద్మరాజు

పంచతంత్రం (సీరియల్) ... 28

ఐశ్వర్యం (సీరియల్) ... 32
— కొడవటిగంటి కుటుంబరావు

పానుగంటివారి సాక్షి ... 40
— కాముబుషి సత్యనారాయణశర్మ

మిహిరకులుడు (సీరియల్) ... 45
— విశ్వనాథ సత్యనారాయణ

మృగతుని శిఖరారోహణ – తొలి మహిళాబృందం ... 52
— కుమారి రాణీ భగవాన్‌దాస్

ప్రగతి పథంలో ... 55





విజ్ఞప్తి

జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన అమోఘమైన సేవకు జ్ఞాపక చిహ్నంగా ఆయనపట్ల మనకు గల గౌరవాన్ని వ్యక్తం చేయడానికి వీలుగా 'జవహర్‌లాల్ నెహ్రూ స్మారకనిధి'ని ఏర్పాటు చేయాలని 1964 జూన్ 27 వ తేదీన భారత రాష్ట్రపతి చేసిన విజ్ఞప్తిని నేను మీకు జ్ఞాపకం చేయదలచాను. ఈ విజ్ఞప్తిని జారీ చేసిన వెంటనే శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ స్మృతిని శాశ్వతంగా నిలపడానికి వీలుగా, ఆయన అపూర్వంగా భావించిన ఆశయాలను నెరవేర్చే నిమిత్తం నిధిని సేకరించడానికి జవహర్‌లాల్ నెహ్రూ స్మారకనిధి జాతీయమండలి నొకదానిని ఏర్పాటు చేశారు.

మనజాతి జీవితంలో 1964 మే 27 వ తేదీ అత్యంత విచారకరమైన దినం. నెహ్రూ హఠాన్మరణం ప్రకటించబడిన మరుక్షణం లోనే జాతి యావత్తూ దుఃఖంతో స్తంభించిపోయింది. 1964 మే 28 వ తేదీన లక్షలమంది ప్రజల రుద్ధకంఠాలు 'పండిత నెహ్రూ అమర్ రహే' అని ఎలుగెత్తి ఘోషించాయి. ప్రపంచంలోని కోట్లాది ప్రజలు యీ మహానాయకునికి తమ భక్తి శ్రద్ధాంజలులు సమర్పించారు. విముక్తి ప్రదాతగా, జిజ్ఞాసువుగా, ప్రవక్తగా, రచయితగా ఆయనకు గల మహోన్నత గుణగణాలు సర్వజన విదితమే. అలీన విధానాన్ని, శాంతియుత సహజీవనాన్ని ప్రవచించిన ప్రపంచ రాజకీయవేత్తగా అందరికీ ఆయన సుపరిచితుడే. ఆయన విశ్వమానవప్రేమ జాతీయ సరిహద్దులను అధిగమించింది. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక రంగాల పురోభివృద్ధికై ఆయన చేసిన నిరంతరకృషి దేశస్వరూపాన్నే మార్చివేసింది. ఆయనకు ప్రియతమమైనవాటి నన్నిటినీ పరిరక్షించి, పెంపొందింపజేయడమే మన లక్ష్యం కావాలి.

ఆంధ్రరాష్ట్రం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం లోనూ; నాగార్జునసాగర్, శ్రీశైలం, పోచంపాడు ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టి తద్వారా రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేయడం లోనూ అవసరమైన సహాయం అందజేసిన జవహర్‌లాల్‌నెహ్రూకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రత్యేకంగా ఎంతో ఋణపడిఉన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంతాలలో పర్యటించడం పవిత్ర యాత్రాస్థలాలను సందర్శించడంగా ఆయన భావించి, రాష్ట్రప్రజ లందరి సుఖ సంతోషాలకై గట్టి పునాదులను వేశారు. నెహ్రూ స్మారకనిధికి ఉదారంగా యథోచిత విరాళాలు అందజేసి తద్వారా శ్రీ జవహర్‌లాల్ నెహ్రూపై మనకు గల ప్రేమాభిమానాలను వ్యక్తంచేసే అవకాశం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇప్పుడు లభించింది.





జవహర్‌లాల్ నెహ్రూ స్మారక నిధి జాతీయమండలి ఉద్దేశం ప్రకారం విరాళాలు సేకరించడానికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలోకూడ కమిటీలను ఏర్పాటుచేయడం జరుగుతున్నది. (మన రాష్ట్రానికి కోటి 30 లక్షల రూపాయలు లక్ష్యంగా నిర్ణయించారు.) సంఖ్యాక్రమంలో ఉన్న కూపన్లు, పతాకాల అమ్మకం ద్వారా నిధిని సేకరిస్తారు. రూ. 100, రూ. 10, రూ. 1 విలువలతో కూపన్లు ఉంటాయి. 50 పైసలు, 25 పైసల విలువగల పతాకాలు ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక సంస్థల ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు, సైనికసిబ్బంది, వాణిజ్య సంస్థలలోని పనివారలు దయచేసి కనీసం తమ ఒకరోజువేతనాన్ని నిధికి విరాళంగా ఇవ్వాలి. సినిమా థియేటరు యజమానులు కనీసం ఒక ప్రదర్శనరాబడిని విరాళంగా ఇవ్వాలి. హోటళ్ళు, రెస్టారెంట్లు వంటి ఇతర వ్యవస్థలు కూడా ఒకరోజు లాభాన్ని విరాళంగా ఇవ్వాలి. రూ. 500 లు అంతకుమించి విరాళం ఇచ్చేదాతలకు శ్రీ నెహ్రూచిత్రంకల వెండిమెడల్స్ ఇవ్వబడ్తాయి. రూ. 10,000 లు అంతకుమించి విరాళం ఇచ్చిన కళాశాలలు, పాఠశాలలు, ఇతర సంస్థలకు శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రం చెక్కబడిన కాంశ్య ఫలకాలు ఇవ్వబడ్తాయి. జవహర్‌లాల్ నెహ్రూ స్మారకనిధికి ఇచ్చే విరాళాలపై 1961 వ సం. ఆదాయం పన్ను చట్టంలోని 88 వ సెక్షన్ క్రింద ఆదాయం పన్ను రిబేటు ఉంటుంది. ఆదాయం పన్ను రిబేటుకు దరఖాస్తు చేయదలచిన దాతలు, వారిపేరుపై జారీ చేయబడిన కూపన్ నెంబర్లను జవహర్‌లాల్ నెహ్రూ స్మారకనిధి, ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ ఉపసంఘం సంయుక్త కార్యదర్శికి దాఖలు చేసి రసీదులను పొందవచ్చు. విక్రయించబడిన యీ కూపన్లు ఆదాయంపన్ను రిబేటు పొందడానికి, రసీదులుగా చెల్లనేరవు.

జవహర్‌లాల్ నెహ్రూ స్మారకనిధికి ఇతోధికంగా, ఉదారంగా విరాళాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరులందరికీ నేను వినయపూర్వకముగా విజ్ఞప్తి చేస్తున్నాను.

భవదీయుడు

శ్లో॥ సర్వస్మిన్ చతురబ్ధివేష్టి తమహీచక్రే యశః కౌముదీ
సంవ్యాప్తే పరిపూర్ణమండలయుతో యో ఒభాచ్చ రాత్రిందివం
తస్మై జవ్హరయోగినే భరతభూ మంత్రిప్రధానాయ నః
కుర్మో భారతభాగధేయరచనా శ్రద్ధాయ శ్రద్ధాంజలిమ్ ॥

అడవి మల్లె

సీరియల్ : (గతసంచిక తరువాయి)

3

"నేను తియ్యలేదు, నా కేం తెలియదు," అన్నాడు చంద్రం ఉబికివస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ.

చంద్రం చెబుతున్నది నిజమేనేమో ననిపించింది కృష్ణారావుకు ఒకక్షణకాలం.

"అయితే ఇంత పొద్దుటే ఎక్కడికెళ్ళావు?" గద్దించాడు కృష్ణారావు.

చంద్రం మాట్లాడలేదు. తల వంచుకొని నిలబడ్డాడు. చంద్రం మౌనం కృష్ణారావు హృదయంలో మళ్ళీ అనుమానాన్ని రేకెత్తించింది.

"మాట్లాడ వేంరా?" గట్టిగా అరిచాడు.

"హేమావాళ్ళ ఇంటికి..."

మాట పూర్తి కాకుండానే కృష్ణారావు కాలుతాకిడికి చంద్రం అంత దూరంపోయి పడ్డాడు. బోర్లాపడ్డ చంద్రం వీపుమీద కృష్ణారావు చెప్పుకాలు కోపంకొద్దీ నాట్యం చేయసాగింది.

చంద్రం దొంగతనం చేసినందుకు బాధపడుతున్న కృష్ణారావుకు చంద్రం నిజం చెప్పకపోవటం, పైగా అబద్ధాలు చెప్పటం పిచ్చివాణ్ణి చేశాయి. అతనిలో వివేకం నశించింది. ఆవేశం ఆవహించింది.

ప్రసాదరావూ, హేమా చంద్రం పొద్దుటే ఎక్కడికి వెళ్ళివుంటాడా అనీ, యింకా మరెన్నో శంకలతో కృష్ణారావు ఇంటికి వచ్చారు. వాకిట్లో అడుగు పెడ్తూనే అక్కడి దారుణ దృశ్యంచూసి, ఒక్క క్షణకాలం నివ్వెరపోయారు.

హేమ తెప్పరిల్లి వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ, "నాన్నా! చంద్రం!" అంటూ తండ్రిచెయ్యి పట్టుకుని చంద్రాన్ని చూపుతూ గట్టిగా లాగింది.

ప్రసాదరావు గబగబా వెళ్ళి కృష్ణారావును భుజం పట్టుకుని పక్కకు తోసి చంద్రాన్ని లేవనెత్తి తన దగ్గరకు తీసుకున్నాడు. అంత సేపు అణచుకున్న దుఃఖం చంద్రంలో కట్టలు తెంచుకున్నది. బావురుమంటూ అతడు ప్రసాదరావు చేతుల్లో యిమిడిపోయాడు.

"ఏమి టిది కృష్ణారావ్? మీ కేమైనా పిచ్చిగాని ఎత్తలేదుగదా! రత్నంలాంటి బిడ్డ! ఎన్నడూ తప్పుపని చేసినవాడు కాదే! ఇప్పు డేం జరిగిందీ?" అంటూ ప్రసాదరావు చంద్రాన్ని గుండెలకు హత్తుకున్నాడు.

"హుం, రత్నం! అలా అనుకుంటూ వుండబట్టే, ఇప్పుడు కడుపు దహించుకుపోతున్నది. ఇంత నీచానికి పాల్పడతాడని ఏనాడూ అనుకోలేదు. మా వంశంలో తప్పపుట్టాడు," అంటూ కృష్ణారావు రొప్పుతూ నిలబడలేక పక్కనే వున్న వాలుకుర్చీలో కూలబడ్డాడు.

కృష్ణారావులో అంత కోపోద్రేకాలు ఏనాడూ చూసివుండని ప్రసాదరావు, యిప్పటి అతడి తీవ్రప్రవర్తనకు ఏదో పెద్ద కారణమే వుండివుంటుం దనుకున్నాడు. అతడు కృష్ణారావు కేసి ఒకడుగు వేసి, "అసలు యింతకీ చంద్రం ఏం చేశాడు?" అని ప్రశ్నించాడు.

కృష్ణారావు ప్రసాదరావుకు జరిగిన సంగతంతా వివరంగా చెప్పాడు. తండ్రి పక్కనే నిలబడి అంతా శ్రద్ధగా విన్న హేమమనస్సు కలవరపడింది. చంద్రం అలాంటి పని చేసివుండవలసింది కాదని తండ్రి కూతు ళ్ళిద్దరూ భావించారు.

"నిన్న మీముందే వాణ్ణి గురుకుల్‌కు పంపిస్తానని చెప్పాగదా? ఇంతలో దొంగతనం చెయ్యవలసిన అవసరం ఏంవచ్చిందో మీరే ఆలోచించండి," అన్నాడు కృష్ణారావు రెండు చేతులతో తల పట్టుకుని.

"ఏదో చిన్నతనం...తెలియక చేసి వుంటాడు. అయినా, ఆ చేసిన దొంగతనం పరాయియింట్లో కాదుగదా? ఆ డబ్బు ఎక్కడదాచిందీ నేను చెప్పిస్తాను. మీరు కొంచెం శాంతంగా ఉండండి," అంటూ ప్రసాదరావు చంద్రంకేసి చూశాడు. చంద్రం దించినతల ఎత్తకుండా అంత దూరంలో నిలబడివున్నాడు.

"బాబూ, చంద్రం! గురుకుల్ వెళ్ళటానికి అన్నయ్య డబ్బివ్వరేమో అన్న అనుమానం నీ కెందుకు కలిగింది? నీవు వయసులో, విద్యలో చిన్నవాడివైనా, ఆ రెండిటినీ మించిన వివేకం వున్నవాడివి. యిలాంటి తప్పిదం చెయ్యవచ్చునా! బహుశా, చదువుమీద వున్న ప్రేమకొద్దీ అలా చేసివుంటావ్. ఇప్పుడు తప్పొప్పుకుని, ఆ డబ్బు ఎక్కడ దాచిందీ మీ అన్నగారికి చెప్పెయ్యి. ఆయన తప్పక నిన్ను క్షమిస్తారు. ఆయనే

వాసిరెడ్డి సీతాదేవి

స్వయంగా నిన్ను గురుకుల్ పంపుతారు." అన్నాడు ప్రసాదరావు.

చంద్రం జవాబివ్వలేదు, కనీసం తలైనా ఎత్తలేదు. ప్రసాదరావు అతణ్ణి సమీపించి ప్రేమగా గడ్డం పట్టుకుని, తలపైకెత్తి కళ్ళల్లోకి చూశాడు. ఆ కళ్ళు వర్షభారంతోవున్న మేఘాల్లా వున్నాయి. వాటివెనక దాగివున్న చంద్రం మనోభావాలేమిటో అంత అనుభవశాలి అయిన ప్రొఫెసరుకూ అర్థం కాలేదు.

చంద్రంచేత నిజం చెప్పించబోయి ప్రసాదరావుగారే ఏదో తికమకలో పడిపోయాడని అనుకున్న కాంతమ్మ, భర్త చేతిదెబ్బ తిన్న చెంపను వేళ్ళతో రాచుకుంటూ, "కాళ్ళూ చేతులూ విరిచికట్టి గొడ్లచావిట్లో పడేస్తే, క్షణాలమీద వాడే నిజం చెబుతాడు," అన్నది కసిగా.

కృష్ణారావుకు భార్య అన్నమాటలు సబబుగా తోచకపోయినా, ఆ క్షణాన తమ్ముడిమీద వున్న కోపంతో భార్యను సంతృప్తి పరచటానికి, ఆమె చెప్పినట్టు చేయటం బావుంటుందన్న నిర్ణయానికి వచ్చాడు.

కృష్ణారావుభార్య అన్నంతపనీ చేయబోతున్నాడని గ్రహించిన ప్రసాదరావు, చంద్రం తల నిమురుతూ, "బాబూ చంద్రం! ఆడబ్బు ఎక్కడదాచావో నిజం చెప్పెయ్యి," అని అడిగాడు.

ఆ మాటలతో చంద్రం తలఎత్తి ప్రసాదరావు ముఖంలోకి దీనంగా చూశాడు. 'మీరూ నేను దొంగననే నమ్ముతున్నారా?' అని ప్రశ్నిస్తున్నాయి, ఆ పదిహేను సంవత్సరాల కుర్రాడి అమాయకపు నేత్రాలు.

ప్రసాదరావుకు ఏమి చేయటానికి తోచలేదు. చంద్రంచేత నిజం చెప్పించటం తనకు సాధ్యమయేలా లేదు. భార్య ప్రోత్సాహంతో కృష్ణారావు తమ్ముణ్ణి పెడరెక్కలు విరిచి కట్టివేసేందుకు సంసిద్ధమవుతున్నాడు. ఇక అక్కడ వుండి ఏం ప్రయోజనం? ఆయన ఎవరితోనూ ఏమీ అనకుండా గిరుక్కున వెనుదిరిగి బయటికెళ్ళాడు. హేమ తండ్రిని అనుసరించింది.

కృష్ణారావు కుర్చీలోంచి లేచాడు. తను చేయబోతున్నది కిరాతక కృత్యం అన్నభావం అతడి హృదయంలో మెదిలింది. కాని, దాన్ని మించిన క్రోధం అతడి నరనరాన్నీ పట్టి కుదిపింది. తమ్ముడి ముఖంకేసి చూడకుండా, అతడి రెండు చేతులూ వడిసిపట్టుకుని అతణ్ణి గొడ్లచావిడికేసి యీడ్చుకుపోయాడు. చంద్రం ఎలాంటి ప్రతిఘటనా చూపలేదు.

చావడిలోని ఒక గుంజకు చంద్రాన్ని పెద్దతాడుతో బిగించికట్టి, కృష్ణారావు యింట్లోకి వచ్చాడు. అతడికి భార్య ముఖంకేసి చూసే ధైర్యం లేకపోయింది. బహుశా, ఆమె తను చేసిన పనికి మురిసిపోతూ, మందహాసం చేస్తూండవచ్చు. అది తను చూడటం జరిగితే, మరోసారి చెంప ఛెళ్ళు మనిపించవలసివస్తుంది...



"వాడికి...చంద్రానికి రాత్రికి నేను తిరిగివచ్చేవరకూ అన్నం పెట్టవద్దు. విన్నావా?" అంటూ కృష్ణారావు తల వంచుకుని వేగంగా వీధిలోకి వెళ్ళి పోయాడు.

మిట్టమధ్యాహ్నం. రెండుగంటల వేళ. చంద్రం ఆకలితో దహించుకుని పోతున్నాడు. దాహంవల్ల గొంతు పిడచ కట్టుకుపోతున్నది. కళ్ళు అవమానాగ్నితో మండుతున్నాయి. హృదయంలో పేరుకున్న బాధ కన్నీరురూపంలో వెలువడి అతడి చెంపలను తడుపుతున్నది.

తను దొంగతనం చేసినట్టు వదినె అనటమే తడవుగా అన్నయ్య నమ్మేశాడు. అసలు తనకు దొంగతనం చేయాలన్న ఊహే కలిగే అవకాశం లేదని అతనెందుకు గ్రహించలేకపోయాడు? తనకూ ఆస్తిలో సగభాగం వుంది. ఆ కారణంగా అవసరం అనుకున్న డబ్బు తను ధైర్యంగా అడిగి తీసుకోగలడు...కాని, ఇంట్లో దొంగతనం జరిగినమాట నిజం! ఆ దొంగ ఎవరై వుంటారు? కాంతమ్మే! తన వదినె! మొట్టమొదటిసారిగా అతడి హృదయంలో ఆమె అంటే అసహ్యభావం కలిగింది.

తను చేసిన తప్పల్లా పొద్దున్నే ఎవరితోనూ చెప్పకుండా ప్రకాశం ఏమయాడో తెలుసుకునేందుకు వాళ్ళ యింటికి వెళ్ళటమే. ప్రకాశం తన ప్రాణస్నేహితుడు. మెత్తని మనసు కలవాడు. ఒక రకంగా పిరికివాడు. భయస్థుడు. పరీక్ష తప్పితే ఆత్మహత్య చేసుకుంటానని తనతో అన్నాడు. పాపం, పరీక్ష తప్పాడు. అన్నంతపని చేస్తాడేమో అన్న ఆదుర్దాలో తను తెల్లవారుతూనే వాళ్ళింటికి వెళ్ళాడు. అది అన్నయ్య ఆజ్ఞను ధిక్కరించటమే!

తమ కుటుంబానికీ, ప్రకాశంవాళ్ళ కుటుంబానికీ తాతముత్తాతల కాలం నుంచీ బద్ధవిరోధమట. ఆ ఇంటిపై వాలిన కాకి, యీ ఇంటిపైన వాలేందుకు లేదు. ఇంతకూ అంత వైరభావం ఏ కారణంవల్ల వచ్చిందో అన్నయ్య తనతో చెప్పలేదు. 'నీవు చిన్నవాడివి. అలాంటి విషయాలు అర్థం చేసుకోగల జ్ఞానం నీకు లేదు. నా మాట గుర్తుంచుకో. ఎలాంటి పరిస్థితుల్లోనూ, నువ్వాగడప తొక్కకూడదు.' ఇదీ అన్నయ్య యిచ్చిన సుగ్రీవాజ్ఞ. అందువల్లే తను ప్రొద్దున్నే ప్రకాశంవాళ్ళ ఇంటికి వెళ్ళినట్టు అన్నయ్యతో చెప్పలేకపోయాడు. ఆ కారణంగా దొంగతనం తనమీద పడింది. వదినె రేపిన అనుమానం, అన్నయ్యకు తను దొంగ అన్న గట్టినమ్మకం కలిగింది.

అన్నిటికంటె అవమానకరం అయిన విషయం — తనంటే ఎంతో ప్రేమా, వాత్సల్యం గల ప్రసాదరావుగారు కూడా తనను దొంగగా భావించటం. హేమ కూడా అలా అనే నమ్మి వుంటుందా? తను నిర్దోషి నని రుజువు చేసుకోనిదే, వాళ్ళ ముఖం చూడగలగటం అసంభవం...

హేమ తలపుకు రాగానే అంత బాధలోనూ చంద్రం పెదాలమీద చిరునవ్వు తొంగిచూసింది. గాఢాంధకారంలో మెరుపుతీవలా ఆమె ఆకారం అతడి కండ్ల ఎదుట కదిలినట్లయింది. తన నిర్దోషిత్వంలో ఎవరికీ నమ్మకం లేకపోయినా, హేమ మాత్రం తనను నమ్మి తీరుతుంది. తనమీద దొంగతనపు నేరం మోపినందుకు యీపాటికే ఆమె ఎంత బాధపడుతున్నదో! ఒకవేళ యిదంతా...

"చంద్రం!" అన్న చిన్న పిలుపు అతడి చెవులకు వీణాస్వరంలా వినిపించి, చంద్రం తల ప్రక్కకు తిప్పి చూశాడు. హేమ అతణ్ణి సమీపిస్తున్నది. ఒక చేతిలో తినుబండారాలతో నిండివున్న వెండి పళ్ళెం, మరో చేతిలో నీళ్ళునింపిన మరచెంబు. ఆమెను చూస్తూనే చంద్రం ముఖం ఆనందంతో విప్పారింది.

"హేమా! వచ్చావా! త్వరగా యీ కట్లు విప్పెయ్. ఒళ్ళంతా నొప్పులు. కాళ్ళు పీక్కుపోతున్నాయి." అన్నాడు చంద్రం, హేమను తొందరచేస్తూ.

హేమ అతడి మాటలు విననట్టే తొణక్కుండా అతడి ముందుకు వచ్చి, తాపీగా పళ్ళెం, మరచెంబు కింద పెట్టింది. తరువాత పళ్ళెంలో వున్న తినుబండారాల్లో ఒకటి తీసుకుని చంద్రం నోటికి అందించబోయింది.

"ఈకట్లు శరీరాన్ని ఒరిపిడి చేస్తున్నై. చచ్చేంత బాధగా వుంది. ఇప్పుడా తిండి? ముందు నా కట్లువిప్పు." అన్నాడు చంద్రం ఆదుర్దాగా.

హేమ పెదవులు బిగించి 'ఊహూఁ' అంటూ తలాడించి, "అదేం కుదరదు, చంద్రం. నువ్వు నిజం చెప్పందే, కట్లు విప్పను. ఆ డబ్బు ఎక్కడ దాచావో నాతోనైనా చెప్పు. నేనా సంగతి నాన్నగారితో చెప్పి, నీకట్లు ఆయనే విప్పేలా చేస్తాను. మామయ్య నిన్ను మరి కొట్టకుండా చూసే బాధ్యత నాన్నగారిది." అన్నది.

హేమ యిలా అనేసరికి చంద్రం నిర్విణ్ణు డయిపోయాడు. హేమ కూడా తనను దొంగగా భావిస్తున్నదన్నమాట! అతడికి అంతా అయోమయంలా కనిపించింది. తనకాళ్ళకింది భూమి కిందికి కుంగిపోతున్నట్టూ, తను, కట్టివేయబడిన గుంజంతోసహా పాతాళానికి కూలి పోతున్నట్టూ అతడికి భయం వేసింది.

హేమ ఏదో మాట్లాడుతున్నది. అవేమీ చంద్రానికి అర్థంకావటంలేదు. కాని, అతడి చెవుల్లో ఒకే గింగురు శబ్దం....వేయి కంఠాలు మూకఉమ్మడిగా 'చంద్రం దొంగ! చంద్రం దొంగ!' అంటున్నాయి. ఆ కంఠస్వరాల్లో హేమ గొంతు మరింత స్పష్టంగా వినబడుతున్నది. 'చంద్రం దొంగ? చంద్రం.......!

ఒక్క క్షణకాలం నిశ్శబ్దం. చంద్రం నీరసంగా ముఖం పక్కకు తిప్పుకున్నాడు. గొడ్లచావిడి మొండిగోడ వెనక ఏదో అలికిడయింది. ఆ వెంటనే మొండిగోడ మీద నీడలాంటి చిన్న ఆకారం! చంద్రం ఆశ్చర్యంగా అటుకేసి చూశాడు.

గోడమీదినుంచి కిందికి చూస్తూ ఒక పదేళ్ళ అమ్మాయి అతడికి కనిపించింది. ఆ పిల్ల బీదయింటి పిల్లలా వుంది. అతుకులువేసి కుట్టిన పచ్చ పువ్వుల ఎర్ర పరికిణీ, ఎర్రగళ్ళ తెల్ల జాకెట్ వేసుకుని; ఆ అమ్మాయి కిందికి దూకేందుకు, దూరం ఏదో ఉజ్జాయింపు వేసుకుంటున్నట్టు కిందికీ పైకీ పరీక్షగా చూస్తున్నది.

చంద్రానికి అంత శారీరక, మానసిక బాధలలోకూడా ఆ అమ్మాయి వాలకం చూడ ముచ్చట కలిగింది. అతడామె ముఖకవళికలను పరీక్షగా చూడసాగాడు. గుండ్రని పెద్ద కళ్ళూ, చిన్న నొసలూ పోనుపోను కొంచెం వెడల్పయిన ముక్కూ, నొక్కుల జుత్తూ, కింద పెదవికంటే కొంచెం లావైన పై పెదవిగల ఒంపులు తిరిగిన చిన్న నోరూ, చామనచాయ శరీరం — చూడగానే ఆకర్షించే ప్రత్యేకతఏదో వుంది ఆ బాలిక ముఖంలో.

చంద్రంతోపాటు హేమకూడా ఆ మొండిగోడమీది పిల్లకేసి ఆశ్చర్యంగా చూడసాగింది. అంతలో ఆ పిల్ల దబుక్కుమంటూ కిందికి దుంకి, చంద్రం హేమలు వున్న చోటుకు రాసాగింది. "ఎంత జావుందీ అమ్మాయి!" అనుకున్నాడు చంద్రం. తన బాధ లన్నీ ఓ తృటికాలం మరిచిపోయి. గిజగిజలాడుతూంటే, కట్లిప్పకుండా నువ్విక్కడ తమాషా చూస్తున్నావా? అన్నదా అమ్మాయి. హేమ ముందుకు వచ్చి ఒయ్యారంగా నిలబడి.

హేమ చీదరిస్తున్నట్టు ఆ అమ్మాయికేసి చూసి, ఈ అలగాపిల్లకు జవాబిచ్చేదేమిటనుకుంటూ ముఖం పక్కకు తిప్పుకున్నది. ఆపిల్ల సరాసరి చంద్రం దగ్గిరకు వెళ్ళి అతడి కట్లిప్పటానికి వంగింది. హేమ పళ్ళు కొరుకుతూ, "జాగ్రత్త, ఏం చెయ్యబోతున్నావ్? కట్లిప్పావో, మా అత్తయ్యను కేకవేసి, నీ వీపు పగలగొట్టిస్తాను. చంద్రం తప్పు చేసాడు. పెద్దవాళ్ళు శిక్షిస్తున్నారు, మధ్య నువ్వెవరు కట్లిప్పటానికి?" అన్నది రోషంగా.

"అబ్బో, ఏవిఁటూ తప్పు? తప్పులు చెయనోళ్ళెవరు? చాల్లే, అడ్డంరాకు, తప్పుకో," అంటూ ఆపిల్ల హేమను భుజం పట్టుకుని ఒక్కతోపు తోసింది. ఆ బాలికకంటే వయసులో కొంచెం పెద్దదయినా, హేమ సుకుమారంగా పెరిగినది కావటంతో ముందుకు పడబోయినదల్లా, చప్పున చంద్రం కట్టివున్న గుంజను పట్టుకుని పడకుండా కాలు నిలదొక్కుకున్నది.

ఆ బీదయింటి అమ్మాయి చకచకా చంద్రం కట్లు విప్పసాగింది. ఇంతపాటి అలగాపిల్ల తన వంటిమీద చేయి చేసుకోవటమా? అన్న ఉక్రోషంలో హేమ "ఉండు, అత్తయ్యను పిలుచుకొస్తాను." అంటూ చావిట్లోనుంచి గబగబా బయిటికి పరిగెత్తింది.

ఈలోపల ఆ బీదయింటి చింపిరి జుట్టుపిల్ల చేతులతో, నోటితో కూడా పట్టుపట్టి చంద్రం కట్లు క్షణాలమీద విప్పేసింది. అంతవరకూ శరీరంలో సరిగా రక్తప్రసారం ఆడక, ఒక్కసారి తనను బంధించిన కట్లు ఊడిపోవటంతోనే తిరిగి ప్రసారం ప్రారంభం కావటంతో, చంద్రానికి కళ్ళు బైర్లుకమ్మినై. కాళ్ళూ, చేతులూ చచ్చుబడిపోయినట్టయి నిలబడలేక గుంజదగ్గిరే కూలబడ్డాడు. తన కింత సహాయం చేసిన ఆ బీదపిల్లమీద అతడికెంతో కృతజ్ఞతాభావం కలిగింది.

"నీ పేరేమిటి?" అని అడిగాడు చంద్రం ఆ అమ్మాయిని.

"గౌరి. మరి నీ పేరో?" అన్నదా పిల్ల రాగం తీస్తూ.

"చంద్రం. అది సరేకానీ, నువ్వు నా కళ్లెందుకు ఊడదీశావ్? అందరిలాగే నీకూ నేను దొంగలా కనిపించలేదా?" అన్నాడు చంద్రం.

"నువు దొంగ వెందుకవుతావ్? ఆ మొండిగోడపక్కగా వెళుతూంటే లోపల్నించి మాటలు వినిపించినై. ఏవరో చూద్దామని గోడ ఎక్కాను. నువ్వు! నీ ముఖం చూడగానే కష్టాల్లో వున్న మంచబ్బాయి అనుకున్నాను. గోడ దూకాను, కట్లిప్పాను,- సరిపాయె," అన్నది గౌరి అమాయకంగా ముసిముసి నవ్వులు నవ్వుతూ.

చంద్రం గౌరి అన్నమాటలూ, అవి చెప్పిన తీరూ చూసి చకితుడైపోయాడు. ఎందుకనో అతడికా క్షణంలో ఆ అమ్మాయిని ఒక చిన్నముద్దు పెట్టుకోవాలనిపించింది. చప్పున చేతులు చాచి, గౌరిని దగ్గిరకు లాక్కుని, నుదుటిమీద గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. మరుక్షణం అతడికి తాను గొప్ప తప్పిదం చేశానన్న భావం కలిగింది. వెంటనే అతడు లేచినిలబడి, గౌరికేసి చూడనైనా చూడకుండా మొండిగోడమీదికి పాకి, అవతలివైపుకు దూకి పరిగెత్తాడు. గౌరికూడా అతడితో పాటు లేచినిలబడి మొండిగోడకేసి వెళ్ళింది. కాని, చంద్రం మెరుపులా దూకి అందకుండా పారిపోవటంతో, ఆమె గోడ పక్కనే నిలబడి పారిపోతున్న చంద్రంకేసి చూస్తూ నిలబడిపోయింది. చూస్తూండగానే చంద్రం రోడ్డులో ఒక మలుపు తిరిగి కనబడకుండా పోయాడు. ఒక తృటికాలంపాటు గౌరి దిగాలు పడిపోయినట్టు అటు చూసింది. అంతలోకే ఆమె అమాయిక నేత్రాల్లో ఒక కొత్త వెలుగు ప్రవేశించింది. గౌరి భుజాలు ఎగరవేసి, కూనిరాగం తీస్తూ, లేడిపిల్లలా ఛెంగుఛెంగున ఎగురుతూ, అక్కడికి దాపులలో వున్న పూరిగుడిసెలకేసి పరిగెత్తింది.

(సశేషం)

ప్రభుత్వ నిర్ణయాలు

* లైసెన్సు పొందని ఏ పడవకూడా రాష్ట్రంలోని ఏ నదిలోనూ ప్రయాణీకులను దాటించ డానికి ఉపయోగించనీయరాదని ప్రభుత్వం నిశ్చయించింది. రెగ్యులర్ పడవలు లేనిచోట్ల కూడా ప్రయాణీకులను తీసుకువెళ్ళే ప్రతి పడవా పరిశీలించబడుతుంది. ప్రతి పడవకూ ప్రాణరక్షణ పరికరాలు జతపరచబడివుండాలి. పడవలు నడపడానికి అనుమతించేముందు ఆ సరంగుల పడవను నడపగలిగే అనుభవాన్ని పరిశీలించడం జరుగుతుంది.

* రాష్ట్రంలో ప్రారంభించిన కొత్త పరిశ్రమ లన్నిటికీ, వారి ఆక్రమణలోని భూమిపై పన్ను చెల్లింపు విషయంలో రాయితీని మంజూరుచేయడంద్వారా సహాయపడడానికి నిశ్చయించడ మైనది. దీని ప్రకారం కొత్త పరిశ్రమలు అయిదేళ్ళపాటు సగం పన్నును మాత్రమే చెల్లించ వలసివుంటుంది. ప్రభుత్వరంగంలో దీనిక్రింద భారీ విద్యుత్పరికరాల కర్మాగారం, సింథటిక్ మందుల కర్మాగారంలకు కూడా సౌకర్యం విస్తరించబడినది. కొత్తగూడెం ఎరువుల ఫ్యాక్టరీకి యివ్వడానికి గాను ఖమ్మం జిల్లాలో 1,000 ఎకరాల అడవి నేలను అరక్షిత ప్రాంతం కావించటానికి ప్రభుత్వం నిశ్చయించింది.

* ప్రస్తుతం రాష్ట్రంలోని ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో అమలులో వున్న జూద గృహాల చట్టంలో చేర్పులు, మార్పులకు సంబంధించిన చిత్తుబిల్లుకు మంత్రిమండలి అనుమతి లభించింది. ఇందులోని ముఖ్య విశేషం ఏమిటంటే జూదగృహాల యజమానులను, ఏజంట్లను దీనిద్వారా శిక్షించే అవకాశం ఏర్పడింది.

* 5,000 రూ. అంతకు తక్కువ లైసెన్సు ఫీజు చెల్లించవలసిన లైసెన్సుదార్లు ఎక్సైజు నియమాలను అధిగమించిన కారణంగా వారిపై విధించిన జరిమానాలను మాఫ్ చేయడానికి నిశ్చయించడమైనది. మొత్తం 90,000 రూపాయల మేరకు సంబంధించిన 300 కేసులు యీమాదిరివి వున్నాయి.


* ఆంధ్రప్రదేశ్ సహకార సెంట్రల్ బ్యాంకుకు వాటా పెట్టుబడిగా పెట్టడానికి రూ. 28 లక్షలను యివ్వాలని నిశ్చయించడమైనది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖాకు జాతీయ వ్యవసాయ పరపతి పథకంనుండి ఋణాన్ని పొందడానికిగాను పై సహకార సెంట్రల్ బ్యాంకుకూడా అంతే మొత్తంను యిస్తుంది.

* ఢిల్లీలోని ఆంధ్ర వనితా మండలికి రూ. 5,000 లను గ్రాంటుగా మంజూరు చేయడానికి ప్రభుత్వం నిశ్చయించింది.


* ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్ర భూమి తనఖా బ్యాంకు రూ. 50 లక్షల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు యిచ్చే నగదు ఋణానికి పూచీకత్తు వహించడానికి ప్రభుత్వం నిశ్చయించింది.



కచ్ ప్రాంతంలో పాకిస్థాను ఉపయోగించిన పటాన్ టాంకులను ఫొటో తీసిన భారత వైమానికదళ పైలట్ ఆఫీసర్ యు. బార్బరా.





కచ్ ప్రాంతంలో బీర్‌బేట్, 84 వ పాయింటు మధ్య భారత భూభాగంలోకి చొచ్చుకొనివచ్చిన పాకిస్థాను పటాన్ టాంకు ఫొటో. సాయుధ శకటాలతో కూడిన టాంకుల బలగంలో యీ టాంకు ఒకభాగం.



చిత్తడి నేలలతోపాటు దుమ్మూధూళితో నిండి యిసుకతో క్షామానికి ఆలవాలమైన పర్రనేల యీకచ్‌లోని రాన్ ప్రాంతం. ఇక్కడే పాకిస్థాను రెగ్యులర్ సాయుధసైన్యం కొనసాగించే కాల్పులనుండి మనసైన్యం రక్షణచర్యలు తీసుకుంటున్నది. ఇసకపర్రలో అతి కష్టంతో గస్తీచర్యలు జరుపుతున్న మన జవాన్లను యీఫొటోలో చూడవచ్చు.

కచ్ ప్రాంతంలోని బీర్‌బెట్, 84 వ పాయింటుమధ్య భారత భూభాగంలోకి చొచ్చుకొచ్చిన పాకిస్థాను పటాన్ టాంకులను ఫ్లయ్యింగ్ ఆఫీసర్‌యు. బార్చురా ఏప్రెలు 26 వ తేదీన అసమీపంగా విమానంలోంచి తీసిన ఫొటో. ఈ ఐ. ఎ, ఎఫ్. విమానం టాంకులమీదుగా ఎగురుతూరాగానే పాకిస్థాను సైనికులు పరుగెత్తి పారిపోయి దాగున్నారు. టాంకులు వెళ్ళినబాటకు అవతల కుడివైపున నేలమీద పాకిస్తాను సైనికుడు ఒకరు పడుకుని దాగివుండడాన్ని యీ ఫొటోలో చూడవచ్చు.






పూనాలోని సైనిక కేడెట్ కళాశాలలో సమరరంగపు శిక్షణ యిస్తారు. ఇక్కడ ఎంపికచేసిన కొంతమంది జవాన్లకు అధికారుల శిక్షణ యివ్వబడుతుంది.


బయలుప్రదేశంలో వుండడానికై, అప్పటికప్పుడు నిర్మించుకున్న గుడారాలవద్ద విశ్రాంతి తీసుకుంటున్న కొంతమంది కేడెట్లు.

ఒక వాగుమీద దాటడానికి వీలుగా కర్రలను, తాళ్ళతో తాము నిర్మించిన వంతెనపై దాటుతున్న జవాన్లు.



చూడదగిన స్థలాలు

భూతల స్వర్గం - కాశ్మీరు




బానిహాల్ కనుమవద్ద




శ్రీనగర్‌లోని యాత్రిక సమాచారకేంద్రం.


భారత్‌కు ఉత్తరాన 84,771 చ. మైళ్ళకు పైగా ఆవర్తించి జమ్మూ-కాశ్మీరు రాష్ట్రంవుంది. గ్రేట్ బ్రిటన్‌కన్న కొద్దిగా చిన్నదియిది. ఈ రాష్ట్రం జమ్ము, లడక్, కాశ్మీరులోయ అన్నమూడు వివిధ సంస్కృత భూఖండాల సమ్మేళనం. శ్రీనగర్, జమ్ము - యీరెండూ రెండు ప్రధాన నగరాలు. రాష్ట్ర ప్రభుత్వానికి యీ రెండూ వరుసగా వేసవి, శీతాకాల కార్యస్థానాలు.




దాల్ సరస్సు




శ్రీనగర్ ఓబరాయి పేలస్ హోటల్.




శ్రీనగర్‌లోని నిడస్ హోటల్.






జీవన భృతికై బయలుదేరబోతున్న కార్మికులు

జీలంనది జన్మస్థానమైన వీరనాగ్



వసంతంలో యాత్రికులు






కాశ్మీరు బాలురు

మంచు శిఖరాలు



కాశ్మీరును చూడవచ్చిన చిన్నపాప




శ్రీనగర్‌లో ఒకవీధి




దాల్‌సరస్సులో పరచుకున్న ప్రశాంతత





పేలస్ హోటల్‌లో ఒక సాయంకాలం



చష్మషాహి : శ్రీనగర్‌కు 5½ మైళ్ళ దూరంలో దాల్‌సరస్సు ఎగువ ఒకకొండమీద నిర్మించ బడింది. దీనిని పరివేష్టించి చక్కటి ఉద్యానవనం వుంది. ఇక్కడనుంచి చూస్తే దాల్‌సరస్సు, దాని పరిసరాల సుందర దృశ్యాలు కనిపిస్తాయి. షాజహాను దీనిని నిర్మించాడు. ఇక్కడి పాతాళగంగలో వైద్య సంబంధమైన మూలికలు కలిగి వున్నాయి.








షాలిమార్ : (ప్రేమాలయం)

నిషాత్‌కు అవతల రెండు మైళ్ళ దూరంలో జహంగీరు నిర్మించిన ప్రసిద్ధ మొగలు ఉద్యానవనం షాలిమార్ వుంది. ఈ శృంగారవనంలో బంగారు సూర్యకిరణాలు, వెన్నెల వెండి వెలుగులు వ్యాపిస్తున్న వేళల్లో జహంగీరు, ఆయన ప్రియురాలు నూర్జహాను గులాబీ మొక్కల మధ్య విహరిస్తుండేవారు. సౌందర్యోపాసకులకు కనువిందైన ప్రదేశమిది.

కాశ్మీరులోయ సుమారు 84 మైళ్ళ పొడవు, 20 నుండి 25 మైళ్ళ వెడల్పు గలిగిన రమణీయ ప్రకృతికి నిలయమైన ప్రదేశం. దీని మధ్యగా జీలంనది ప్రవహిస్తున్నది. సముద్ర మట్టానికి 5,200 అ. నుండి 6,000 అ. వరకు ఎత్తున ఉన్నదిది. ఈ లోయకు ఈశాన్య దిక్కున నందపర్వతం (26,660 అ.) మధ్య నిలిచి వుండగా వరుసగా బారులుతీర్చిన బ్రహ్మాండమైన హిమగిరులు వున్నాయి. ఎత్తులో ఎవరెస్టు శిఖరం తర్వాత చెప్పదగిన గుడ్విన్ ఆస్టిన్ శిఖరం (28,000 అ.) గల కారాకోరం పర్వతపంక్తి యీ లోయకు ఉత్తరం వైపున ఉన్నది.

కశ్యప ఋషిపేరుమీద కాశ్మీరు పిలవబడుతున్నది. ఈ ఋషి హరమూల అనే చోట కొండల్లో కాశీని సృష్టించి, ఒకనాడు రాక్షసులకు ఆలవాలమైన ఆ మధ్యలో గల సరస్సులోని నీటిని యింగిర్చి, నివాసయోగ్యంగా రూపొందించాడని ఒక ప్రతీతి. కాలగతిలో యీ 'కశ్యప్ – మర్' అనబడే ఈ కశ్యపలోయ కాశ్మీరుగా మారింది.







పహల్‌గామ్ : అపూర్వమైన మణిపంటి లిడ్డర్ ప్రదేశం శ్రీనగర్‌నుంచి రోడ్డు మార్గంలో 60 మైళ్ళ దూరంలో ఉన్నది. సముద్ర మట్టానికి 7,200 అడుగుల ఎత్తులో ఉన్నది. కాశ్మీరు మొత్తంలో యిది ఆహ్లాదకరమైన ప్రదేశం. అతి ఉన్నత పర్వత శ్రేణుల ఎత్తైన దృశ్యాలకు పహల్‌గామ్ ఉత్తమ స్థావరం. సనసార్, శేష్‌నాగ్, అమరనాథ్‌గుహ, యార్సార్, అరూ, లిడ్డర్ వాట్, కోలాహమంచునది లిడ్డర్‌లు ట్రౌట్‌రకం చేపల వేటకు అనువైనవి.


చరిత్ర ఆరంభంనుంచి కూడ కాశ్మీరు భారతదేశంలోనిఅంతర్భాగంగానే ఉన్నది. క్రీ. పూ. 3 శతాబ్దంలో అశోకుడు కాశ్మీరులో బౌద్ధమతాన్ని ప్రవేశపెట్టాడు. అనేక శతాబ్దాల వరకు బౌద్ధమతం, హిందూమతం రెండు అభివృద్ధి చెందాయి. ఈ కాలంలో అనేక దేవాలయాలు, ఆరామాలు నెలకొల్పబడ్డాయి. ప్రసిద్ధ కాశ్మీరు పాలకులలో ఒకరైన లలితాదిత్య క్రీ. శ. 8 వ శతాబ్దంలో ప్రసిద్ధ మార్తాండ దేవాలయాన్ని నిర్మించాడు. 1586 లో అక్బరు కాశ్మీరును స్వాధీనం చేసుకుని అనేకసార్లు యీ లోయను సందర్శించాడు.


పహల్‌గామ్

ప్రకృతి రామణీయతకు కాశ్మీరు పెట్టింది పేరు. ఫల, పుష్పాలకు, జలపాతాలు, సెలయేళ్ళకు ఆలవాలమైన ప్రదేశం. ఈ సెలయేళ్లనే స్వర్గలోక వాహినులని జహాంగీరు పిలిచేవాడు. ఆపిలులు, ఏప్రికోట్లు, చెర్రీలు పీచ్‌లు, ప్లమ్‌లు వాల్‌నట్లు, ఆల్మాండ్లు మొదలయిన పండ్లు విస్తారంగా పండుతాయి. పెద్ద మొత్తాంలో ఇక్కడి నుంచి ఎగుమతి అవుతుంటాయి.

వసంతం రాగానే అన్ని వైపులా, అంతటా నేలమీద రంగులు జల్లినట్లు పూలు పరచుకొని వుంటాయి. నీలిరంగు గంటాకారపు పుష్పాలు, పసుపు పచ్చని గడ్డిపూలు, ముదురు ఎరుపులో, స్వచ్ఛమయిన తెల్లరంగులో ఆల్మండ్ కుసుమాలు, గాఢమైన పసుపురంగు మస్టర్డ్ ప్రసూనాలు, రక్తవర్ణపు పాపీలు, నీలిమ ఐరిస్‌లు - రకరకాల రంగుల్లో, చిత్ర విచిత్రమైన సువాసనల్ని వెదజల్లుతూ చూపరుల హృదయాంతరాళాల్లో అనిర్వచనీయమైన అనుభూతులను సృష్టిస్తాయి. వసంతంలో కాశ్మీరులో గడపడం ఒక అదృష్టం. పండ్లు, పుష్పాలు, తెల్లటి మరగలు, పాములాంటి సెలయేళ్ళు, చీకటి లాంటి ఫిర్, పైన్ అరణ్యాలు - వీటితో కన్నుల పండువు చేస్తున్నది ప్రకృతి.

ఇక్కడి పక్షిగణాలు అతిరమణీయములై బహువిధ వర్ణములతో కూడినవి. ముఖ్యంగా చేపల్ని వేటాడే కింగ్ ఫిషర్‌లు, బంగారు పిచ్చుకలు, వడ్రంగి పిట్టలు, బుల్‌బుల్‌లు రకరకాల పక్షులు రంగురంగుల రెక్కలతో, కమ్మని కలకలారావములతో ఎగురుతుంటాయి. కాశ్మీరు ప్రజలు సుందర రూపులు. ఆజానుబాహులు. చిరునవ్వులు చిందులాడే ముఖారవిందములు గలవారు. సహనము, ఆతిథ్యము వారికి వెన్నతో పెట్టిన విద్య. కాశ్మీరీలు తెలివైనవారు. కాశ్మీర స్త్రీలు ఎంత అందాల రమణులో అంత శ్రమ జీవులు. ముదురు నీలము, ఆకుపచ్చ సల్వార్ ధరిస్తారు, పండుగ దినాలలో వీరుచేసే నృత్యాలు, పాడేపాటలు చిరకాలం మనసుల్లో ముద్రలు వేసుకుపోతాయి.







(ఫోటోలు తీసినది ప్రధాన సంపాదకులు)

కచ్‌లో పాకిస్థాన్ విద్రోహం

క్రచ్‌లోని రాన్ ప్రదేశం విస్తీర్ణం దాదాపు 9000 వేల చదరపుమైళ్ళు ఉంటుంది. ఈ ప్రాంతంలోని చాలాభాగం 600 అడుగుల దిగువ ఉంటుంది. ఈ ప్రాంతం సాధారణంగా ఎండిపోయిఉంటుంది.

1907 లో కరాచీలో ప్రచురించబడిన సింధు ప్రావిన్స్ అధికార గజెటులో సింధుసరిహద్దులు దిగువవిధంగా వివరించబడినవి:—

"తూర్పువైపు స్థానిక రాష్ట్రాలయిన మార్వారు, జైసల్ మార్, భావల్‌పూర్‌లు; ఉత్తరాన పంజాబు కొన ప్రాంతం, కచ్చిగా వ్యవహరించబడే కొలట్‌ఖాన్ ప్రాంతంలోని ఇసుకభాగం; పశ్చిమదిశలో అదేప్రాంతానికి చెందిన పర్వతభాగాలు, ఖిర్తారీ కనుమలపొడవున ఉన్న సరిహద్దురేఖ, బాట్‌నది; *దక్షిణదిశలో అరేబియాసముద్రం రాణాకచ్‌లు* సరిహద్దులుగా ఉన్నాయి."

ఈ విధంగా రాణాకచ్‌ప్రాంతం పూర్తిగా సింధుప్రావిన్సుకు అవలగా ఉన్నదని 1907 లోనే సుస్పష్టంగా పేర్కొనబడినది.

అప్పటి బ్రిటిష్‌పరిపాలకులు ప్రచురించిన ఇంపీరియల్ గజెటీర్ ఆఫ్ ఇండియా (బొంబాయి ప్రెసిడెన్సీ ప్రావిన్షియల్ సీరీస్ వాల్యూమ్ II) (1909) లో కచ్‌లోని రాన్, అరేబియాసముద్రం సింధుప్రావిన్స్ దక్షిణంలో సరిహద్దులుగా ఉన్నాయని పేర్కొన్నారు.

భారతదేశ బ్రిటిష్‌స్టేట్ కార్యదర్శి ప్రచురించిన (1908) ఇంపీరియల్ గజెటీర్ ఆఫ్ ఇండియాలో యిలా అన్నారు. "సింధుకు ఆగ్నేయదిశ చివరిసరిహద్దున కచ్‌లోని రాన్ ప్రాంతం ఉన్నది."

బ్రిటిష్ పరిపాలనకాలంలో భారత సర్వేవారు ప్రచురించిన అధికార మ్యాపులలో సింధుప్రావిన్సు, కచ్‌రాష్ట్రాల మధ్యగల స్పష్టమైన సరిహద్దురేఖను చూపారు.

భారతదేశ బ్రిటిష్‌ప్రభుత్వ రాజకీయశాఖ అధికారి రాజకీయ మార్పులగూర్చి 1937, 1939, 1912 లలో జారీచేయబడిన పత్రాలన్నిటిలోకూడ కచ్‌లోని రాన్ ప్రాంతాన్ని పశ్చిమభారత రాష్ట్రాల ఏజన్సీలోని ప్రదేశంగానే చూపారుగానీ సింధుప్రావిన్స్‌లోని భాగంగా ఎప్పుడూ పేర్కొనబడలేదు.

భారతదేశ బ్రిటిష్ పరిపాలకులు 1915 లో ప్రచురించిన 32—మైల్ మ్యాపులోను, 1928, 1936, 1945 లలో ప్రచురించిన 50—మైలు మ్యాపులోను, యితర మ్యాపులలోను కచ్ సింధుల మధ్య సరిహద్దులను స్పష్టంగాను, వివాదరహితమైనవిగాను చూపారు.

అప్పటి బ్రిటిష్ పరిపాలనలోని ఇండియా సర్వే అధికారులు 1938 లో కచ్‌రాష్ట్రం, సింధుల మధ్యగల ఉత్తర సరిహద్దును "వివాదాత్మక" మైనదిగా చూపారు; అయితే జాగ్రత్తగాను, నిశితంగాను పరిశీలించినతర్వాత యీ అంశం తప్పిదమైనదిగా తెలుసుకొని మరుసంవత్సరం 1939 లో మ్యాపులనుండి "వివాదాత్మక" మైన అనే పదాన్ని తొలగించాల్సిందిగా భారతదేశ బ్రిటిష్ ప్రభుత్వ మ్యాపు ప్రచురణశాఖ డైరెక్టరు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విధంగా పాకిస్థాన్ ఏర్పడిన 1947 ఆగస్టు 15 వ తేదీకి పూర్వపు సాక్ష్యాధారా లన్నిటకూడా సింధుప్రావిన్సు, కచ్‌ల మధ్యగల సరిహద్దులగూర్చి వివాదానికి ఏమాత్రం ప్రాదిపదిక కల్పించబడలేదు.

కచ్‌లోని రాన్ విభాగంపై అకారణమైన నిరాధారమైన హక్కును పాకిస్థాన్ 1948 లో ప్రతిపాదించింది.

బ్రిటిష్ అధికారులు కచ్, సింధుల మధ్య సరిహద్దులను సుస్పష్టంగాను, పదేపదే నిర్వచించినప్పటికీ, పాకిస్థాన్ వాదాన్ని సహేతుకమైనదిగా అంగీకరించకపోయినప్పటికీ సైనిక దురాక్రమణ ద్వారా తన హక్కును నిరూపించుకునే పాకిస్థాన్‌యొక్క ప్రస్తుత చర్యద్వారా యీ సరిహద్దు వివాదాత్మకమైనదిగా కాలేదు.

ఉభయదేశాల ప్రధానమంత్రులు, భారత, పాకిస్థాన్ దేశాల సరిహద్దుల సమస్యను పరిశీలించి మొత్తం భారతదేశం, పశ్చిమ పాకిస్థాన్‌లమధ్య సరిహద్దులను అత్యంత ప్రాధాన్య విషయంగా పరిగణించి సరిహద్దు రేఖలను నిర్ణయించే విధంగా భారత, పాకిస్థాన్ దేశాల కేంద్ర సర్వేశాఖలకు అప్పగించాలని 1956లో భారత, పాకిస్థాన్‌దేశాల ప్రధానమంత్రులు అంగీకరించారు. పంజాబు, పశ్చిమ పాకిస్థాన్‌లమధ్య సరిహద్దులను, రాజస్థాన్—పశ్చిమ పాకిస్థాన్‌లమధ్య సరిహద్దులను నిర్ణయించే కార్యక్రమం పూర్తిచేశారు. భారతదేశ సర్వేశాఖవారు గుజరాత్ — పశ్చిమపాకిస్థాన్‌ల మధ్య సరిహద్దురేఖలను నిర్ణయించే నిమిత్తం సమావేశం కావాలని పదేపదే కోరినప్పటికీ పాకిస్థాన్‌దేశ సర్వేశాఖవారు ఆ కోరికను మన్నించలేదు. ఈ సరిహద్దు నిర్ణయం జరిగితే అపార్థాలు, సంఘర్షణలు, ఉద్రిక్తలను శాశ్వతంగా నివారించడానికి అవకాశం కలిగేది.

మ్యాపులు, అధికారిక పత్రాలు, యితర వివరాల ప్రాతిపదిక పై సర్వే నిపుణులు ప్రశాంతంగా పరిశీలించే నిమిత్తం తన ప్రాంతీయ హక్కులవాదనను దాఖలు చేయడానికి పాకిస్థాన్ భయపడుతున్న దని దీనివల్ల స్పష్టమౌతున్నది.

అధికారిక వివరాల ప్రాతిపదిక పై నిపుణులు పరిశీలించడానికి వీలుగా తన వాదనను దాఖలు చేయడానికి నిరాకరిస్తూ పాకిస్థాన్ యిప్పుడు సైనికమార్గాలద్వారా తన హక్కును నిరూపించుకో చూస్తున్నది.

1964 మే 12వ తేదీన ముగ్గురు పాకిస్థానీ జాతీయులు భారతదేశ ప్రాంతంలోని కచ్‌లో కంజర్‌కోటవద్ద కనుగొనబడినారు. అయితే ఉద్దేశరహితంగా భారతీయ ప్రాంతంలోకి వచ్చారనే భావంతో గ్రౌండ్స్ నియమావళిక్రింద వారిని విడుదల చేయడం జరిగింది.

1965 జనవరి 25 వ తేదీన భారత భూభాగంలోకి $1\frac{1}{2}$ మైళ్ళు పాకిస్థానీ జాతీయులు చొచ్చుకొని వచ్చినట్టు భారతీయ సరిహద్దు పోలీసులు కనుగొన్నారు. భారతీయ సరిహద్దు అధికారులు పదే పదే కృషిచేసిన ఫలితంగా యీ సమస్యను గూర్చి చర్చించడానికి పాకిస్థాన్ పోలీసు అధికారులు ఫిబ్రవరి 5 వ తేదీన సమావేశానికి హాజరు అయ్యారు. వారి అక్రమ ప్రవేశంద్వారా సృష్టించబడిన యీ సమస్యను చర్చించడానికి వారు సిద్ధపడినట్టు వ్యక్తం కాలేదు.

1965 ఫిబ్రవరి 10 వ తేదీన పాకిస్థాన్ సైనికదళాలు తేలిక రకం మిషన్‌గన్‌లు, స్టెన్ గన్‌లు- రైఫిల్స్‌తో సమాయత్తమైన పటాలాలు కంజర్‌కోట ప్రాంతాన్ని ఆక్రమించుకున్నాయి. ఫిబ్రవరి 18 వ తేదీన భారత హైకమీషనర్, ఆక్షేపణ పత్రాన్ని పాకిస్థాన్ విదేశాంగమంత్రికి సమర్పించారు. మ్యాపులలో సూచించిన సరిహద్దు నాధారంగా సరిహద్దురేఖలను నిర్ణయించడానికి సర్వే నిపుణులు సమావేశంకావాలనీ, భారతీయ ప్రాంతంనుంచి పాకిస్థాన్ సైనిక దళాలను ఉపసంహరించుకుని యథా పూర్వస్థితిని నెల కొల్పాలనీ ఆ పత్రంలో తిరిగి భారతదేశం సూచించింది.

సర్వేనిపుణుల సమావేశం జరపడం అంగీకారయోగ్యం కాదని పాకిస్థాన్ విదేశ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఫిబ్రవరి 20 వ తేదీన భారతదేశానికి తెలియజేసింది. దీనివల్ల పాకిస్థాన్ తన ప్రాంతీయహక్కుల అక్రమవాదాన్ని సర్వే నిపుణులముందు ఉంచడానికి సంసిద్ధంగా లేదని స్పష్ట మౌతున్నది.

చర్చలనిమిత్తం సమావేశం కావడానికి భారతదేశం కృషి చేస్తున్న తరుణంలో పాకిస్థాన్ ప్రభుత్వం, ఏప్రిల్ 9 వ తేదీన భారీమోర్టార్లు, యంయమ్ జియస్‌లు, భారీఫిరంగులు 25 పౌడర్ గన్‌లతో పాకిస్థాన్ రెగులర్ సైనిక 51 ఇన్‌ఫెంట్రీ బ్రిగేడ్‌కు చెందిన రెండు బటాలియనులతో భారతీయ సర్దార్‌చౌక్ అక్రమ దురాక్రమణకు ఒడికట్టింది.

1965 ఏప్రిల్ 10వ తేదీన భారత సైనిక దళాలు, పాకిస్థాన్ సైనిక దళాలను వెనక్కు తరిమి సర్దార్‌పోస్టు తిరిగి స్వాధీనం చేసుకున్నవి. 1965 మార్చి మొదటివారంనుండే పాకిస్థాన్ సైని కులు యీ అక్రమ దురాక్రమణకు పూర్తి తయారీ చేసుకున్నదని పట్టుబడిన పాకిస్థాన్ సైనికుల వద్ద లభించిన సామగ్రి, యితర పత్రాలద్వారా స్పష్టమైనది.

సరిహద్దుపై పాకిస్థాన్ దురాక్రమణ లోక్ సభలో ప్రధాని ప్రసంగం.

కచ్ సరిహద్దులపై పాకిస్థాను సాయుధదళాలు పరంపరగా కొనసాగిస్తున్న దురాక్రమణలవల్ల తలెత్తిన పరిస్థితినిగూర్చి లోక్ సభలో చర్చను ప్రారంభిస్తూ ప్రధాని శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి యీ విధంగా అన్నారు:

"పాకిస్థాను సాయుధదళాలు పరంపరగా కచ్ సరిహద్దులపై సాగిస్తున్న దురాక్రమణలవల్ల ఉత్పన్నమైన పరిస్థితిని సభవారు గుర్తించాలని కోరుతున్నాను. చాలా తరుచుగా తీవ్రమైన సంఘట నలు యిక్కడ సంభవించాయి. మన జవానులు అద్వితీయమైన ధైర్య సాహసాలతో మన సరిహద్దులను పరిరక్షిస్తున్నారు. వారికి ఈ దేశ ప్రజలయొక్క యీ సభవారియొక్క పూర్తి అండదండలు లభిస్తాయనీ, మన సరిహద్దులపై జరిపిన ఈ దురాక్రమణను ఎదు ర్కోవడానికి ఎటువంటి త్యాగమైనా చేయడానికి సిద్ధంగా వున్నా మనీ యీ సందర్భంలో వారికి నేను మనవిచేయ దలచుకున్నాను.

ఈనాడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితి నిస్సంశయంగా చాలా భయంకరమైనది. ఈనాడు ఏర్పడ్డ యీ పరిస్థితికి కారణభూతమైన సంఘటల్నిగూర్చి యీ సభవారు తెలుసుకోవడం అవసరమని నా ఉద్దేశం.

తూర్పు, పశ్చిమాలు రెండు వైపులా భారత - పాకిస్థాను సరిహద్దులలో అనేకచోట్ల అప్పుడప్పుడు కాల్పులను గత కొన్ని నెలలుగా పాకిస్థాను కొనసాగిస్తున్నది. మన జవాన్లు ఎంతో కష్ట పడినప్పటికీ అతిసమర్థవంతంగా రక్షణచర్యలు తీసుకుంటున్నారు. పాకిస్థాను కొనసాగిస్తున్న కవ్వింపుచర్యలలో యిటీవలిది కచ్ సరిహద్దుల్లో కాల్పులు సాగించడం. కొద్ది రోజులక్రిందట పాకిస్థాను గస్తీదళాలు కచ్ - సింధ్ సరిహద్దుకు దగ్గర్లోని బాటలో వెళ్ళడం కనిపించింది. మన సరిహద్దుదళాలు వారిపై ఎదురు తిరగడంతో తాము పాకిస్థాను భూభాగంలోనే వున్న, చిరకాలంగా తమ ఆధీనం లోనేవున్న బాటలోకి దిపెళ్తున్నామని వారు తెలియజేశారు. కంజర్ కోట్‌ను పాకిస్థాను స్వాధీనం చేసుకోవడమూ, అక్కడ స్థిరంగా చౌకీని నెలకొల్పడము కూడా గుర్తించడం జరిగింది. గ్రౌడ్స్ రూల్సులోని 3 వ పేరా ననుసరించి రాజకోట్ రేంజీ డిప్యూటీ పోలీసు ఇనస్పెక్టర్ జనరల్ యీ విషయాన్ని పశ్చిమ పాకిస్థాను రేంజీ

డైరెక్టర్ జనరల్‌కు తెలియజేసి యీ పరిస్థితిపై చర్చించాలని యథాపూర్వ పరిస్థితిని నిర్ణయించాలని అందుకు సమావేశం కావాలని కోరారు. అయితే పశ్చిమ పాకిస్థాను రేంజ్ డైరెక్టరు జనరల్ యీ సమావేశానికి హాజరు కాలేదుకాని ప్రాంతీయ కమాండరును పంపించారు. ఆయన రాజకోట్ రేంజీ డి. ఐ. జిని కలుసుకున్నారు. ఈ సమావేశం ఫలించలేదు. పాకిస్థాను సరిహద్దు కాపలాదళాలు, మన కాపలాదళాలమధ్య చెదురు చెదురు సంఘటనలు కొనసాగుతూనే వున్నాయి.

ఏప్రెలు 9వ తేదీ ప్రాతఃకాలం 51వ ఇన్ఫెంట్రీ బ్రిగేడ్‌కు చెందిన పాకిస్థానురెగ్యులర్ ఆర్మీ తాలూకు రెండు బెటాలియన్లు 25పౌనుల ఫిరంగులతో, భారీ మోర్టారులు, ఎమ్. ఎమ్. జి. తుపాకులతో మన సరిహద్దులోని సర్దారుపోస్టును ఎదుర్కొని ముందుకు చొచ్చుకొచ్చారు. ఇంతకుపూర్వమే ఈ దురాక్రమణ వివరాలను హోంమంత్రి ఏప్రెలు 12వ తేదీన తమ నివేదికలో యీ సభవారికి తెలియజేశారు.

పాకిస్థాను యుద్ధ ఖైదీలవద్ద దొరికిన పత్రాలవల్లా –, వారిని ప్రశ్నించగా చెప్పిన సమాధానాలవల్లా యీ దురాక్రమణముందుగనే ఆలోచించుకుని చేసినదని స్పష్టమౌతున్నది. మన బోర్డరు చౌకీని పాకిస్థానుసైన్యం ఆక్రమించుకోవాలనే ప్లాను మార్చి రెండోవారం లోనే రూపొందించబడింది. అప్పటినుంచీ తమ సైన్యాన్ని అటు వైపుగా తరలించడం ఆరంభమైంది. ఈ చౌకీని ఎదుర్కొనమనే ఉత్తర్వులు వారికి ఏప్రెలు 7వ తేదీన వచ్చాయి. తొమ్మిదోతేదీ తెల్లవారురూమున దురాక్రమణకు పూనుకుంది.

దానితో సరిహద్దు రక్షణ బాధ్యతలను సైనిక ప్రధానాధికారి చేపట్టవలసిందిగా ఆదేశించడమైనది. అదేరోజు సాయంకాలం మన సైనికబలగం విఝకోటకు తరలించడం జరిగింది. అయినప్పటికీ పాకిస్థాను సైనికులు కాల్పులు కొనసాగిస్తూనే వున్నారు. మన సాయుధబలం ప్రతిగా ఎదురుకాల్పులు జరిపింది.

అప్పటినుంచీ కచ్– సింధు సరిహద్దుకు దక్షిణంగా మనభూభాగంమీద అనేకచోట్ల పెద్దఎత్తున పాకిస్థాను కాల్పులు సాగిస్తూనే వున్నది. ఏప్రెలు 24వ తేదీ ఉదయం 84వ పాయింటువద్దగల మన కంపెనీ చౌకీమీద టాంకులూ, యితర సాయుధసామగ్రితో పాకిస్థాను ఇన్ఫెంట్రీ కాల్పులు సాగించింది. ఏప్రెలు 26వ తేదీన పాకిస్థాను సాయుధబలాలు టాంకులూ, యితర యుద్ధ ఫిరంగులూ మొదలయిన శకటాలతో బియర్‌బెట్‌వద్ద మన చెక్‌పై కాల్పులు సాగించాయి. ఈ కాల్పులు యింకా కొనసాగుతూనే వున్నాయి.

పాకిస్థాను కొనసాగిస్తున్న యీ చర్య పూర్తిగా దురాక్రమణ పూరితమైనది. సరిహద్దుకు దక్షిణంగా ఆరునుంచి ఎనిమిదిమైళ్ళ లోపలకు చొచ్చుకువచ్చి భారతభూభాగంలోని భారతచెక్‌లపై పాకిస్థాను కాల్పులు సాగిస్తున్నది. ఏప్రెలు 16వ తేదీన పాకిస్థాను విదేశాంగమంత్రి భుట్టో చేసిన ప్రకటనను గౌరవనీయులైన యీ సభవారు చూచేవుంటారు. పాకిస్థాను చర్యల్ని సమర్థించుకుంటూ ఆయన "ముఖ్యంగా ఇది 24 వ సమాంతరానికి ఉత్తరంగా సరిహద్దులపై జరిగే వివాదమనేది గుర్తుంచుకోవాలి. సరిహద్దులు అతిక్రమణవల్ల యీ వివాదం ఏర్పడినదికాదు. అసలు వివాదగ్రస్తమైన ప్రాంతం భారతదేశపు ఆక్రమణలో వుండడంవల్లనే యీ వివాదం రేగింది" అన్నారు. ఇదీ ఆయన చెప్పినది. మరొకరకంగా చెప్పాలంటే, పాకిస్థానుకు ఏమాత్రమూ, ఎప్పుడూ హక్కులేని భూభాగంపై ఒకరకంగా భారతదేశం హక్కును వప్పుకుంటూనే భూభాగంపై దురాక్రమణ జరపడానికి పూనుకోవడం అన్నమాట. దీనినిబట్టి తన చర్యను తనే తప్పని ఒప్పుకుంటున్నట్టే అయింది. యధాపూర్వస్థితిని మార్పుచేయడానికీ, తన ప్రాంతీయ హక్కులు సరియైనవని నిరూపించడానికీ పాకిస్థాను బలప్రయోగం చేసింది. 1960 సం॥పు భారత పాకిస్థాను సరిహద్దు ఒప్పందంక్రింద గ్రౌండు రూల్సు, ఐక్యరాజ్యసమితి ఛార్టరుకు యిది విరుద్ధమైన చర్య. నిజానికి మన భూభాగంపై దురాక్రమణ చేయడమే పాకిస్థాను ఉద్దేశమని దాని ప్రవర్తనవల్ల స్పష్టమౌతున్నది.

శాంతిగా యీ సమస్యను పరిష్కరించుకోవడానికి ఒకవైపున దౌత్యసంప్రదింపులు సాగుతూ వుండగా మరోవంక పెద్ద ఎత్తున కాల్పులను సాగించడం, టాంకులు, భారీమరఫిరంగులతో మన చెక్‌లపై దురాక్రమణకు కదిలిరావడం పాకిస్థానుకుఅలవాటయిపోయింది.

ఏప్రెలు 19వ తేదీన విదేశ వ్యవహారాల కార్యదర్శి పాకిస్థాను హైకమీషనరు ఒక పత్రాన్ని సమర్పించారు. అందులోని విషయమూ, కొద్దిరోజులక్రిందట పాకిస్థాను విదేశ వ్యవహారాల అధికారి కరాచీలోని మన హైకమీషనరుకు సూచించిన విషయమూ యించుమించు ఒకటే.

యుద్ధవిరమణ చేయాలనీ, యాధాపూర్వస్థితిని కలిగించడానికీ, నిర్ణయించడానికీ అధికారులస్థాయిల్లో చర్చలు జరగాలనీ, ఆ తర్వాత సరిహద్దులనుగూర్చి చర్చించడానికి ఇరు ప్రభుత్వాల మధ్యా ఉన్నత స్థాయిని సమావేశం జరగాలని అందులో సూచించడం జరిగింది. ఏప్రెలు 24వ తేదీ ఉదయం విదేశీయ వ్యవహారాల కార్యదర్శికి పాకిస్థాను హైకమీషనరు మరొక పత్రాన్ని అందజేశారు. అందులో భారత, పాకిస్థాను దేశాలకు సంబంధించిన సివిలియన్, మిలిటరీ సాయుధసైన్యాలు రెండూ పాకిస్థాను వివాదగ్రస్త ప్రాంతంగా భావిస్తున్న కొన్ని ప్రాంతాలనుండి ఉపసంహరించుకోవడంద్వారా యుద్ధ విరమణ జరగాలని సూచించబడింది. అయితే అదేరోజు ఉదయం, యీ కొత్త ప్రతిపాదన అందజేయబడిన అనంతరంకూడా, చాడ్‌బెట్ పశ్చిమంగా 84వ పాయింటు వద్ద మన చెక్‌పై పెద్ద ఎత్తున భారీ మరఫిరంగులతో పాకిస్థాను

కాల్పులు కొనసాగించింది.

కాల్పులు సాగిస్తున్నంత కాలమూ పాకిస్థాను తప్పుడు వాదనలను, విరుద్ధమైన ప్రకటనలనూ చేస్తూ వచ్చింది. రాజకోట్ రేంజర్స్ డి. ఐ. జీకీ ఇండస్ రేంజర్స్ కమేండంట్ కల్నల్ అఫ్తాబ్ ఆలీకి మధ్య 1965 ఫిబ్రవరి 15 న కంజర్‌కోట్ సమావేశంలో జరిగిన చర్చల్లో తాము కంజర్‌కోట్‌ను ఆక్రమించలేదనీ, కంజర్‌కోట్‌కు దక్షిణంగావున్న మార్గంవరకూ – అంటేసుమారై, డింగ్‌లకు అనుకుని వున్న బాటవరకూ – సరిహద్దు కావలాచర్యలు తీసుకుంటున్నామనీ, యీబాట చాలాకాలంగా తాము వినియోగించుకుంటున్నదేననీ వారు వ్యక్తం చేశారు. 1965 ఫిబ్రవరి 18వ తేదీన భారత ప్రభుత్వం అందజేసిన ఆక్షేపణ పత్రానికి సమాధానంగా పాకిస్థాను ప్రభుత్వం అందజేసిన 1965 మార్చి 1 వ తేదీ పత్రంలో ఇండస్ రేంజర్లు కంజర్‌కోట్ కోటను స్వాధీనంచేసుకోలేదని తెలియజేసింది. ఈనాడు పాకిస్థాను కంజర్‌కోట్ యిప్పుడేకాదు, అనాదిగా తమ వాడుకలోనే వున్నదని వారు అంటున్న బాటను దాటుకునికూడా చాలాదూరం చొచ్చుకొని వచ్చింది. కచ్ – సింధు సరిహద్దు దక్షిణంగా 24 వ పేరలల్‌కు వుత్తరంగా విశాలమైన ప్రాంతం తనదేనని యీనాడు పాకిస్థాను వాదిస్తున్నది.

ఈ వాదనలను మనం తిరస్కరిస్తున్నట్టు స్పష్టంగా, గట్టిగా నేను చెప్పగలుగుతున్నాను. కచ్‌లోని రాన్ ప్రాంతం ఇన్‌లేండ్ సముద్ర ప్రాంతమనీ, అందువల్ల దీనిలో సగం భాగంపై తమకు హక్కు వుంటుందని పాకిస్థాను వాదిస్తున్నది. ఇది పూర్తిగా నిజంకాదు. కచ్‌లోని రాన్ ప్రాంతం ఇన్‌లేండ్ సముద్రం కాదు. ఆవిధంగా ఎప్పుడూ గుర్తింపబడలేదు. కచ్‌లోని రాన్ ప్రాంతం 'ఇన్‌లేండ్ సముద్రం' అనిగాని లేదా 'సరస్సు' అనిగాని అనడం కన్న 'చిత్తడినేల' అని అనడమే సమంజసమైనదని పాకిస్థాను ఏర్పడకపూర్వం కూడా ఆనాటి భారతదేశంలోని బ్రిటిష్ ప్రభుత్వం 1906 లో గట్టిగా భావించింది. కచ్‌లోని రాన్ ప్రాంతం 'చిత్తడి నేల' అనేది నిర్వివాదాంశం. బురదనేలల్లో పెరిగే గడ్డి యిక్కడ విస్తారంగా మొలుస్తుంది. ఆ మాదిరి నేల స్వభావాలు ఎన్నో దీనిలో కనిపిస్తాయి. చిత్తడినేలకు వుండాల్సిన గుణగణాలన్నీ దీనికి వున్నాయి. వర్షాకాలంలో అరేబియా సముద్రంలో పెద్దపెద్ద అలలవల్లా బలిష్టమైన గాలులవల్లా యీ పల్లపు ప్రాంతంలోకి సముద్రం నీరు చేరుకుంటుంది. అంతేకాక వర్షాకాలంలో నదుల్లో పొంగిపొర్లిన కొత్త నీరంతా యిక్కడకు వచ్చి చేరుకుంటుంది. అందువల్ల మే మధ్యనుండి అక్టోబరు మాసాంతం వరకూ వరదతో మునిగిపోతుంది. సంవత్సరంలోని మిగిలిన కాలమంతా యీ ప్రాంతంలో కొంత నేల చిత్తడిగాను, ఎక్కువ భాగం ఎండిపోయి వుంటుంది.

కచ్ – సింధు సరిహద్దు ఎల్లలను యేర్పాటు చేయనప్పటికీ మ్యాపులలో స్పష్టంగా సరిహద్దులను నిర్వచించడం జరిగిందనీ, యీ వాస్తవాన్ని పూర్తిగా గుర్తించడం జరిగిందనే చారిత్రక వాస్తవాలనుకూడా పాకిస్థాన్ వాదన మరుగుపరుస్తున్నది. భారత దేశ విభజనకుపూర్వం అప్పటి బ్రిటిష్ యిండియా ప్రావిన్స్ అయిన సింధు, భారతీయ రాష్ట్రమయిన కచ్‌లమధ్య సరిహద్దును వేరుచేయడం జరిగింది. అప్పుడు యిది అంతర్జాతీయ సరిహద్దు కాకపోవడం వల్ల ఎల్లలను యేర్పరచే అవసరం లేకపోయింది. అయితే 1872 నుంచి 1943 వరకు ఆతర్వాతకూడ అధికార మ్యాపులన్నిటకూడ యీ సరిహద్దును స్పష్టంగా పేర్కొని సుస్పష్టంగా స్థిరీకరించిన విషయం అందరికీ తెలిసినదే. భారతదేశ విభజనకుపూర్వం 25 సంవత్సరాలకు ముందునుంచికూడ అధికార పత్రాలన్నిటిలో యీ సరిహద్దునుగూర్చి విపులంగా వివరించబడింది. 1947 ఆగస్టు 15 కుపూర్వం అవిభక్త భారతదేశం అధికారిక మ్యాపులలో చూపబడిన సరిహద్దులను యిపుడు సవాలు చేయ వీలులేదు.

ఇటీవల జరిగిన దురాక్రమణకు పూర్వంనుంచి కూడ స్థానిక అధికారుల స్థాయిలోను, ఉన్నతస్థాయిలోను సమావేశాలు జరగాలని భారతప్రభుత్వం పాకిస్థాన్‌కు పదేపదే సూచిస్తూ వచ్చింది. ఉదాహరణకు – సరిహద్దు ఎల్లలను యేర్పాటుచేసే సమస్యను చర్చించడానికి ఉభయదేశాల సర్వేయర్స్ జనరల్ సమావేశం జరగాలని పాకిస్థాన్ ప్రభుత్వానికి మనం సూచించాము. పాకిస్థాన్ యీ సూచనను త్రోసిపుచ్చింది. పూర్వపు యథాస్థితిని నెలకొల్పడానికి కమాండర్లమధ్య సమావేశం జరగడం వాంఛనీయమనీ, గ్రౌండ్‌రూల్సును మనం పాకిస్థాన్‌కు గుర్తుచేశాము. పాకిస్థాన్ ఉచితమని భావించిన ఏ స్థాయిలోనైనా ఉభయ ప్రభుత్వాల ప్రతినిధులమధ్య సమావేశం జరగాలని ఫిబ్రవరి 18 వ తేదీ లేఖలో మనం సూచించాము. ఆతర్వాతకూడా పదేపదే యీ సూచనను చేశాము. ఇన్నివిధాల ప్రయత్నం చేసినప్పటికీ పాకిస్థాన్‌నుంచి తగిన సమాధానం లభించలేదు.

1965 ఏప్రిల్ 13 వ తేదీన పాకిస్థాన్ ప్రభుత్వం 3 సూచనల ప్రతిపాదనను చేసింది. (1) కాల్పుల విరమణ (2) యథాస్థితి గూర్చి నిర్వచించడం, పూర్వస్థితిని యెక్కడ ఏర్పరచే విషయాలను చర్చించడానికి ఉభయ ప్రభుత్వాల సమావేశం, (3) అతి ఉన్నతస్థాయిన సమావేశం. ఆ మరునాడు ఏప్రిల్ 15 వ తేదీన యీ ప్రతిపాదనలను అంగీకరించినట్టు తెల్పే అధికారాన్ని హైకమీషనరుకు భారత ప్రభుత్వం యిచ్చింది. పాకిస్థాన్ ప్రభుత్వం తన యీ పూర్వ ప్రతిపాదనలను ఆచరించకపోవడం దురదృష్టకరమైన విషయం.

కాల్పుల విరమణ ప్రతిపాదనను వెంటనే అంగీకరించాలని ఏప్రిల్ 19వతేదీన భారతప్రభుత్వం తిరిగి సూచించింది. అయితే యీ

ప్రతిపాదనను అంగీకరించడానికి బదులు ఏప్రిల్ 23 వ తేదీన పాకిస్థాన్ సరిక్రొత్త ప్రతిపాదలను చేసింది. నేను లోగా పేర్కొన్నట్టు వాస్తవంగా వివాదరహితమైన మన మొత్తం ప్రాంతాన్ని పాకిస్థాన్ తనకు తానే వివాదగ్రస్థ ప్రాంతంగా చిత్రిస్తూ భారత సైనిక దళాలను ఆ ప్రాంతంనుండి ఉపసంహరించాలని యీ ప్రతిపాదన పేర్కొంటున్నది. అప్పటినుండి పాకిస్థాన్ ఈకోర్కెపై పట్టుబడుతున్నది. యుద్ధోన్మాదంనుంచే వారిని మరలించడానికి మనంచేసే కృషినంతటినీవాస్తవంగా వమ్ముపరచడమే వారి దృక్పథమని యిది సూచిస్తున్నది.

పాకిస్థాన్ తప్పువాదనల పూర్తివృత్తాంతాన్ని, దాని ద్రోహచింతనను, మనపై నిర్లక్ష్యంగా సైనికశక్తిని ఉపయోగించి పచ్చి దురాక్రమణకు తలపడడం మొదలైన విషయాలను సవిస్తరంగా సభముందు ఉంచడానికే యీ సుదీర్ఘ వివరణను నేను చేయాల్సి వచ్చింది.

గత రెండుశతాబ్దాలనుంచి పాకిస్థాన్‌లోని కొన్ని మతోన్మాద దుష్టశక్తులు, పాకిస్థాన్ పత్రికలు, ఆ దేశనాయకులకు భారత దేశంపై గల పగ ద్వేషభావమే దీనికి ప్రధానకారణమని స్పష్టమవుతున్నది.

ఇప్పుడు నేను తెల్పిన యీ సంఘటనలు మన అందరికీ ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. స్వాతంత్ర్యం లభించినప్పటినుంచి శాంతి, అంతర్జాతీయ సౌభ్రాతృత్వం, సౌహార్దతలకు భారతదేశం కృషిచేస్తూఉన్నది. లక్షలాది మనప్రజల జీవనస్థాయిని అభివృద్ధి పరచేవిషయంలో మన కృషిని కేంద్రీకరించడానికి వీలుగా మనం శాంతిసాధనకు పాటుపడుతున్నాము. మనకు ఉన్న పరిమితమైన వనరులను ఉపయోగించడంలో ఆర్థిక అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులు; ప్రణాళికలకే మనం ప్రాధాన్యం యిస్తున్నాము. ఈ విధంగా సరిహద్దు సంఘటనలను రేకెత్తించడంలో భారతదేశానికి ఏమాత్రం ఆసక్తి లేదనీ, పోరాటం వాతావరణాన్ని సృష్టించే సంకల్పం లేదనీ పై విషయాలను స్థూలంగా పరిశీలించే వ్యక్తులకు సువిదితమౌతుంది.

అయితే మన పొరుగున ఉన్న చైనా, పాకిస్థానులు భారతదేశం విషయంలో దురాక్రమణ దృష్టిని అలవర్చుకున్నాయి. ఇటీవలి కాలంలో భారతదేశానికి వ్యతిరేకంగా వారు ఉభయులు చేయిచేయి కలిపి వ్యవహరిస్తున్నారు. యీ పరిస్థితులలో ప్రభుత్వ విధ్యుక్త ధర్మం సుస్పష్టమే. యీ ధర్మాన్ని పటిష్టవంతంగానూ, సమర్థవంతంగానూ నిర్వహిస్తూంది. మన సరిహద్దులను రక్షించుకోవడానికి, మనదేశ సమగ్రతను భద్రపరచుకోవడానికి దేశయావచ్ఛక్తిని వినియోగించడం జరుగుతుంది. మాతృదేశరక్షణకుయీనాడు భారతదేశంలోని 45 కోట్లమంది ప్రజలలో ప్రతి ఒక్కరూ తమ సర్వస్వాన్ని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నారని నాకు తెలుసు. అవసరమైనంత కాలం మనం దారిద్ర్యంతో నివసించడానికే ప్రాధాన్యం యిస్తాము కాని మన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను వదలుకోడానికి ఒప్పుకోము.

ప్రభుత్వం మాత్రమేగాక యీ సభ, వాస్తవంగా మొత్తం దేశం ప్రత్యేక సమస్యను పరిశీలించాల్సి ఉంది - మనం యిప్పుడు యే మార్గాన్ని అనుసరించాలి - అనేదే ఆ సమస్య. యే మార్గాన్ని మన అనుసరిస్తాము ?

శాంతియుతమార్గాన్ని అనుసరించడానికి మనం సిద్ధంగా ఉన్నాము. అయితే మనం ఒక్కరంమాత్రమే యీ మార్గాన్ని అనుసరించలేము. పాకిస్థాన్ తన యుద్ధోన్మాద కార్యక్రమాలను విరమించుకునేందుకు నిశ్చయించుకోవాలి. అది ఆవిధగా చేస్తే భారత పాకిస్థాన్ దేశాలు చర్చలద్వారా భారత, పాకిస్థాన్ దేశాల మధ్య సరిహద్దులను, పూర్వపు సింధుప్రావిన్సు, కచ్ రాష్ట్రాల మధ్యగల వాస్తవిక హద్దులను నిర్ణయించుకునే సామాన్య సమస్య పరిష్కారం కాకపోవడానికి నాకు కారణం కనిపించదు. ఇది సప్రదిపుల చర్చావేదిక కానవసరంకూడా లేదు. ఇది దాదాపు వాస్తవాలను కనుగొనే సమస్యయేగానీ పరిష్కారానికి సంప్రదింపులు కాదు. ఇద్దరివైపు నిపుణులు యీ పని చేయగలుగుతారు. యథాపూర్వస్థితిని నెలకొల్పి వెంటనే దురాక్రమణను విరమించుకున్నప్పుడు యిది సాధ్యమౌతుంది.

కచ్ సరిహద్దులలో పాకిస్థాన్‌కు అనుకూల పరిస్థితులు చాలా ఉన్నాయని సభకు నేను చెప్పదలిచాను. అంతేగాక యిప్పుడు మన సైనికులు స్థావరాలుగా ఏర్పరుచుకున్న ప్రాంతాలు త్వరలోనే నీటిలో మునిగిపోతాయి. అందువల్ల వారు అక్కడినుంచి తప్పనిసరిగా ఉపసంహరించుకోవాల్సి ఉంటుంది. పాకిస్థాన్ సహేతుకతను విడనాడి దురాక్రమణ కార్యక్రమాలను కొనసాగించడానికే తలపడితే మనసైన్యం మాతృదేశాన్ని రక్షించుకోడానికి సిద్ధంగా వుంది. దాని విధానాలను అదే నిర్ణయించుకుని అవసరమైన విధంగా తన శక్తియుక్తులను, వస్తుసామగ్రులను మన సైన్యం వినియోగించుకుటుంది. సాధ్యమైనంత త్వరలో కాల్పులవిరమణకు అంగీకరించాలని మన స్నేహదేశాలు విజ్ఞప్తిచేశాయి. వారి కోరికను అంగీకరించడానికి మనం సిద్ధంగా ఉన్నాము. అయితే అదే సమయంలో ప్రత్యామ్నాయ మార్గాలకు కూడా మనం సిద్ధంగా ఉండాలని నేను సభకు చెప్పవలసిఉన్నది.

గౌరవనీయులైన సభాపతిగారూ ! ఈ విషయాన్ని నేను బాగా ఆలోచించే, నా బాధ్యతల్ని నేను క్షుణ్ణంగా అర్థం చేసుకునే చెప్తున్నాను. ఈ కాలం చాలా క్లిష్టమైన కాలం. భారత పాకిస్థానులు రెండూ చరిత్రలో సంక్లిష్టమైన నాలుకూడలుల మధ్య నిలబడి వున్నాయి. ఇప్పటికీ మనం సహేతుకమైన, స్థిరమైన, శాంతి వెల్లివిరిసిన, ఆనంద దాయకమైన మార్గాన్నే పయనించడానికి నిశ్చయించాం. మన పోలీసువారూ, ఆ తర్వాత మన సైన్యమూ మన

దేశాన్ని కష్టనష్టాలకు ఓర్చి వజ్రసంకల్పంతో ధైర్యంగా శత్రు దురాక్రమణనుండి పరిరక్షిస్తూ వున్న యీ సమయంలో కూడా మనం మన శాంతిపథాన్ని విడనాడడం లేదు. అయితే యీ శాంతిపథంలో ఒంటరిగా మన మొక్కరమే వెళ్ళలేము. చేయి చేయీ కలుపుకుని నడవడానికి మరొకరుకూడా కావాలి మరి.

పరిస్థితులు చేతులు దాటి పోయినా, ఏప్రెలు 13 వ తేదీన తను చేసిన ప్రతిపాదనల మేరకు యుద్ధవిరమణకు అంగీకరించగల దని నేను విశ్వసిస్తున్నాను.

తన దేశరక్షణకు తాను ఏమి చేయాలి ? మన స్వాతంత్ర్యాన్ని. సరిహద్దులను దురాక్రమణ దారులనుండి రక్షించుకోవడానికి దేశం చేసే కృషిలో తాను ఏ విధంగా పాల్గొనాలి ? అన్న ప్రశ్నలను యీ సందర్భంలో ప్రతి భారతీయుడూ తనను తాను ప్రశ్నించు కుంటాడని నాకు తెలుసు. అలాంటివారికి నా సమాధాన మిది. మీరు ఎవరయినా, మీరు ఏ పని చేస్తున్నా మీరు మీ పనిని పూర్ణ విశ్వాసంతో, న్యాయమార్గంలో చేయండి. కష్టాలకు, త్యాగానికి సంసిద్ధులుకండి. మీలోని మంచిని వెలికితెచ్చి స్వార్థత్యాగ నిరతితో దేశానికి సేవచేయండి. ఈనాడు దేశానికి కావలసినది జాతీయ సమైక్యత. హృదయాలలో నిజమైన సమైక్యత. భారతీయులంతా, వా రేపని చేస్తున్నా, అంతా కలిసికట్టుగా నిలబడి కష్టనష్టాలకు వెరవక, స్వార్థాన్ని వదులుకుని, త్యాగానికికూడా సంసిద్ధులై నిల వాలి. మనలను మరో మార్గంలోకి చీల్చివేసే ఏ ఆలోచనకూ తా వివ్వవద్దు. దేశ స్వాతంత్ర్యాన్నిస మైక్యతను కాపాడడానికి జాతీయ క్రమశిక్షణతో, త్యాగబుద్ధితో మనందరమూ కలిసికట్టుగా కృషి చేద్దాం. ఈ పరిక్లిష్ట పరిస్థితిలో ప్రభుత్వానికి యీ సభవారి పూర్తి అండదండలను అభ్యర్థిస్తూ నేను నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.''

పాకిస్థాన్ దురాక్రమణను అనేక పత్రికలు తమ సంపాద కీయంలో తీవ్రంగా విమర్శించాయి. కొన్ని వ్యాఖ్యలను ఈ క్రింద పొందుపరుస్తున్నాము :

ఆంధ్రజ్యోతి

"యధాపూర్వస్థితిని పునరుద్ధరించాలనే షరతునుబట్టి పాకిస్థాన్ సేనలు కచ్ - సింధు పరిహద్దు వెనుకకు వెళ్ళిపోవలసి ఉంటుంది. అదివరలో ఆప్రాంతములో మన సేనలు లేవు కనుక వానిని మనము ఉపసంహరించు కున్నప్పటికీ, ఎప్పుడైనా వాటిని తిరిగి పంపేఅధికారం వుండనే వుంటుంది. అయితే పూర్వంవలెనే పోలీసుగస్తీని మనం ఏర్పాటు చేసుకోవచ్చు.

ఇక రాణ్ ఆఫ్ కచ్ ప్రాంతాన్ని వివాదాస్పద ప్రాంతంగా మనం అంగీకరించే ప్రశ్నలేదు. 1960 లో జరిగిన ఒప్పందం ప్రకారం అక్కడ నిర్ణయం కావలసినది. ఉభయదేశాల మధ్య పరిహద్దురేఖ మాత్రమే, అంతకుమించి పాకిస్థాన్ ఎట్టి వివాదాన్ని ప్రయత్నించినా మనం అంగీకరించలేదు.

బహుశ మరికొద్ది రోజులలోనే బ్రిటిష్ ప్రతిపాదనల సంగతి తాడోపేడో తేలిపోవచ్చు. వాటిపట్ల పాకిస్థాన్ వైఖరి ఎలాఉంటుందో తెలియదు. ఏమైనా ఇండియామాత్రం పాకిస్థాన్ బెదిరింపులకుగాని, బ్రిటన్ ఒత్తిడికిగాని లొంగిపోవట మనే ప్రశ్నేలేదు. చారిత్రిక సాక్ష్యాలపై యథార్థ పరిస్థితిపై న్యాయంపై ఆధారపడి మనం విధించిన షరతులకు అనుగుణంగా ఉండనిపక్షంలో బ్రిటిష్ ప్రతి పాదనలను నిర్మొహమాటంగా తిరస్కరించడానికి సందేహించ నక్కరలేదు.

గోలకొండ పత్రిక

"పాకిస్తానును సరియైన త్రోవలోనికి తీసుకొని రావడానికి బదులు అమెరికా, బ్రిటన్‌లు మన దేశముమీదనే ఒత్తిడిని తీసు కొని వచ్చుచున్నవి. అమెరికా ఆయుధాలను పాకిస్థాన్ మనకు వ్యతిరేకముగా ఉపయోగించుచున్నదని మన దేశము విమర్శించి నందుకు అమెరికా అధికారులకు కోపము వచ్చినదట. పాకిస్థాన్ సైన్యాలు ఆమెరికా ఆయుధాలను ఉపయోగించితే అడిగేవారు లేరు కాని మనము విమర్శించితే మాత్రము సహింపలేరు. అమెరికా, బ్రిటనులు మనలను బలపరచడములేదని భారత ప్రభుత్వ అధికారియొకరు తెలిపినారు. ఇందులో ఆశ్చర్యములేదు. గడచిన పదిహేడు సంవత్సరాలలో యీ రెండు దేశాలు పాకిస్థాన్‌కు వ్యతిరేకముగా మనను ఎన్నడు బలపరచలేదు. ప్రధానిశాస్త్రి లోక్‌సభలో ప్రకటించినట్లు బ్రిటన్, అమెరికాలు నడుపుచున్న రాయబారము ఫలితాలు సత్వరముగా వెల్లడి కావడం మంచిది; యీ రాయబారాల పేరుమీద మన దేశం ఎంతో ఓపిక పట్టలేదు.''

ఆంధ్రజ్యోతి (11-5-65)

"ఆంగ్లో అమెరికన్ పత్రికల భారత వ్యతిరేక ప్రచారం లిబరల్ మేధావులుగా పేరుకెక్కినవారి దృక్పథాలను సహితం కలుషితం చేయడం మరింత విచారకరం. యిటీవల న్యూ స్టేట్స్‌మెన్ పత్రికలో కింగ్స్‌లే మార్టిన్ వ్రాసిన ఒక వ్యాసమే దీని కొక ఉదాహరణ. లండన్‌నుంచి వెలువడే యీ వారపత్రిక లేబర్‌పార్టీలో అతివాదవర్గం భావాలను సమర్థించేదిగా అంతర్జాతీయంగా అభ్యుదయ విధానాలను ప్రోత్సహించేదిగా పేరుపొందింది. దానికి చాలా కాలం సంపాదకులుగా పనిచేసి విరమించిన కింగ్స్‌లే మార్టిన్ యిండియాకు ముఖ్యంగా నెహ్రూకు ఒకప్పుడు సన్నిహితుడుగా, సానుభూతిపరుడుగా పేరుబడినవాడు. అతడు సహితం తన దృక్పథాన్ని ఒక్కసారిగా మార్చుకుని ''బ్రిటిష్ అమెరికన్, పాకిస్థానీ పత్రికల విషప్రచారాన్ని గ్రుడ్డిగా విశ్వసించడం ఎంతైనా శోచనీయ మనిపించకమానదు.'' అన్నారు.

కింగ్‌మార్టిన్ దృష్టిలో ఆయూబ్‌ఖాన్ ఒక్కడే హేతువాది. అతడు యిండియాతో సంభాషణలకు సిద్ధంగా ఉన్నాడట. కాని కచ్ ప్రాంతంనుంచి ముందుగా పాక్ సేనలు వైదొలగాలని యిండియా

మొండిగా వాదిస్తూ సంభాషణలు జరగకుండా చేస్తున్నదట. పాకిస్థాన్ పై మొత్తంగా దండెత్తాలని లోకసభ సభ్యులు చేస్తున్న వాదాన్ని ప్రధాని శ్రీ శాస్త్రి అంగీకరించారట. పాకిస్థాన్ చైనాతో సరిహద్దుసంధి కుదుర్చుకోవడంలో తప్పు లేదట. అమెరికన్ ఆయుధాలు ప్రయోగిస్తున్నదని యిండియా ఆక్రోశించడం వినోదదాయకంగా ఉన్నదట. చైనా దండయాత్ర తర్వాత యిండియాకు రాజకీయంగా మతిపోయిందట. ప్రస్తుతం ఇండియాలో ముస్లింలకు వ్యతిరేకంగా అల్లర్లు జరిగే ప్రమాదం ఉందట.

ఈ వ్రాతలధోరణి కారణం విషయం తెలియని అజ్ఞానము, విషయం తెలియని దురుద్దేశము యేదైనప్పటికినీ తీవ్రంగా గర్హించ దగినది. సోషలిస్టులుగా, లిబరల్స్‌గా పేరుపొందినవారే యిటి మూర్ఖత ప్రదర్శిస్తుండగా యిక మిగతావారిమాట చెప్పనే అక్కరలేదు. ఈ కారణంచేతనే పాశ్చాత్య పత్రికల పాక్షిక వైఖరిని ప్రధాని శాస్త్రి నిర్మొహమాటంగా బయటపెట్టడం ఎంతైనా సందర్భోచితంగా ఉన్నది.

ఆంధ్రప్రభ (11-5-60)

"బలప్రయోగాన్ని బలంతోనే ఎదుర్కొని దేశాన్ని సంరక్షించు కొనవలెనని ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి స్వాతంత్ర్య యోధుల సమావేశంలో చేసిన ప్రకటనకు భారతదేశం యింతవరకు అనుసరిస్తూ వచ్చిన అహింస విధానానికి వైరుధ్యం ఎంతమాత్రమూలేదు. శత్రువుకులొంగిపోవడంఅహింసఎంతమాత్రంకాదు. శత్రువుచేదెబ్బ తిన్నతర్వాత శత్రువును ఎదుర్కొనడ మొక్కటే ఆత్మరక్షణ కానక్కరలేదు. శత్రువు పైకొనగలడని స్పష్టమైనప్పుడు దానిని వారించుకొనడంకూడ ఆత్మరక్షణమే. ఒక్కొక్కప్పుడు శత్రువుపై ముందే తాను దెబ్బతీయడంకూడ ఆత్మరక్షణకు ఉత్తమోపాయం కావచ్చు. అది ఒకే ఒక్క రంగంలో సంభవించకపోవచ్చు. కచ్-సింధుప్రాంతం పాకిస్థాన్‌కువలె భారతదేశానికి అనుకూలం కాని పక్షాన భారతదేశం తనకు అనుకూలించే మరొకరంగాన్ని నిర్ణయించుకోవచ్చు. పాకిస్థాన్ తన వ్యూహాన్ని బలపర్చుకునేటంత వరకు యిండియా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోటానికి వీలులేదు. భారతజాతి "హతోవా ప్రాప్యసే స్వర్గం, జిత్వా వాభోక్ష్యసే మహీం" అన్న దృఢనిశ్చయంతో తన కర్తవ్యపాలనకు సిద్ధపడాలి."

ఆంధ్ర పత్రిక (2-5-65)

"కచ్ ప్రాంతంలో భారత పాకిస్తాన్‌ల మధ్య సంఘర్షణలను వారించి ఉభయపక్షాల మధ్య సమోధ్యత కుదుర్చాలని అనేక దేశాలు ఆదుర్దా పడుతున్నాయి. వీటిలో కొన్ని తమకు తోచిన సూచనలను కొన్ని చేశాయి. మరికొన్ని మధ్యవర్తిత్వానికి కూడ సిద్ధమైనాయి. ఇవన్నీ అటు పాకిస్తాన్‌కు యిటు భారతదేశానికికూడా మిత్రదేశాలవడంచేత పెద్దపెట్టున పోరాటానికి దారితీసేట్లుగా ఉన్న ప్రస్తుత సంఘర్షణలను చూచి ఆందోళన పడడం సహజం. ఆ మాత్రం మనం అర్థం చేసుకోగలం. అయితే ఏదో ఒక రకంగా పరిష్కార సాధనకై ఆదుర్దా పడడం ఒకటేచాలదు. న్యాయాన్యాయ విచక్షణా దృష్టితో చేసినప్పుడే ఆ ప్రయత్నం రాణిస్తుంది.

బ్రిటన్ కానీ మరో దేశం కానీ పరిష్కార ప్రయత్నానికి తాపత్రయపడేముందు అసలుసంగతి సవ్యంగా అర్థం చేసుకోవాలి గానీ గుర్రాన్నీగాడిదను ఒకగాట కట్టి వ్యవహరించరాదు. ఇక్కడ భారత ప్రాంతంపై నిర్హేతుకంగా దురాక్రమణ సాగిస్తున్నది పాకిస్థాన్. దురాక్రమణకు గురి అయింది భారతదేశం. అటువంటప్పుడు వెంటనే కాల్పులను విరమించి సరిహద్దుల్లో సైన్యాన్ని ఉపసంహరించవలిసిందిగా ఒత్తిడిపెట్టవలిసింది పాకిస్థానును. అలా కాకుండా ఉభయపక్షాలు కాల్పులు విరమించి వెనకకు మళ్ళాలనడంలో ఏ మాత్రం అర్థముండదు. యీ మాత్రం విచక్షణ చూడకుండా, లేని వివాదాన్ని ఉన్నట్టుగా ఊహించి, రాజీకి పూనుకుంటే అది అనవసర జోక్య మనిపించుకుంటుంది."

కామనీయక

—సంపత్కుమార.

క॥ జనాంతరసంగతవా
సనాసనాథమగుజీవసంతతివిప్పం
గను తోచు రసాలాశో
కనీరజకువాలమల్లికల్ వికసించెన్.

శా॥ ఏదో ఒక్కటి పూవు చాలుగద తా నీ జీవికన్ గ్రమ్ము శో
భాదారిద్ర్యము రూపుమాపగ, సుధా ప్రాభాత రేఖావళీ
స్వాదుత్వమ్ములు చిమ్మగాఁ, బయిన నీ సంసార హేలావిలా
సాదిశ్రీమృదుపుష్పసంచయము విన్యాసించె నొక్కుమ్మడిన్.

క॥ తీవెలుగాఁ బూవులుగాఁ దావులుగాఁ గామనావితానమ్ముగ శో
భావధియగు నీవేళను రావయ్యా, కుసుమధన్వి! రా, పాలింపన్.

శా॥ మాలాబద్ధము లైనబంభరము లీమల్లీప్రసూనమ్ముపై
వ్రాలన్ జ్యా సవరించి యెక్కిడుచు సుస్వగ్రుండునై బాణహే
లాలీలల్ పచరించె మన్మథుడు. బాలానీలనేత్రాంతవీ
క్షాలాలిత్యము గుండె పాదుకొనగా చైత్రీరుచిప్రౌఢమై.

మ॥ ఎద సాంద్రమ్మయి, వాంఛ మందరముగా, నీ మంథనమ్మందు వే
లుదితల్, సుందరమందహాసరచితవ్యోమల్, సుధాభ గసం
పదుదంచన్మధుగీతరావలు, మధూన్మాదక్రియా వ్యాపృతుల్
ముదితల్ కామగపీపయోరుచిరలై మూర్తాదిమస్వర్తులై.

క॥ ఆలోలకాలహేలా వేలావధి గాగ బొల్చు క్రీడాపీఠా
జాతైకాకృతి లీలాకీలల్ దరికొల్పి యెడద కెరలించుతరిన్.

ఉ॥ వెల్గవె, వెల్గవే, వలపువెల్లువలా సతి! నీ యపాంగవీ
ఈ ల్గిలిగింతలై పుపులకా రిదియంతయు రాగమేచఁ, గ్రొం
జిల్గులు వోవు కాలమున చిక్కనియూహలివెల్ల కామనా
వల్గువులై నిరంత ఫలవంతములై పచరించుట్లుగన్.

చ॥ అనవధికాంతరీప పరమార్థముగా నిట సాగుచున్న జీ
వనమున సత్యమై వెలయు వాసన లెల్ల నసత్యమై చనన్
కొనమిగులేమి? యేమి కలుగున్? మరి యీ విచికిత్స యేల? వే
సిన యెదపీటపై వసతి సేయవె! సంగతవాసనాకృతీ!

క॥ మననావధియగుచున్ నిల్చినదానా! నీదు మాపు చిందించిన చి
క్కనికాంతులలో కాలమ్మున గ్రొత్తలలంకరింతు పో, నిరతమ్మున్.

ఎఱ్ఱన-పోతన

ఎస్వీ రామారావు

ప్రబంధ పరమేశ్వరుడుగ ప్రఖ్యాతిగాంచిన ఎఱ్ఱాప్రెగడ క్రీ. శ. 1324–1349 లో అద్దంకి రాజధానిగా పాలించిన రెడ్డిరాజ్య స్థాపకుడు ప్రోలయ వేమారెడ్డి కాలమున నెల్లూరిసీమలోని గ్రుడ్లూరు, చెదలువాడ ప్రాంతములందు జీవించినవాడు. ఓరుగల్లు ప్రాంతమున నివసించిన, సహజపాండిత్య బిరుదాంకితుడైన బమ్మెర పోతరాజు క్రీ. శ. 1430 – 1475 మధ్య రాచకొండ నేలిన సర్వజ్ఞ సింగభూపాలుని సమకాలీనుడు.

ఎఱ్ఱనకు సుమారు ఒక శతాబ్దికాలము పిదప జీవించిన బమ్మెరపోతన నన్నయ, తిక్కనల రచనలతోపాటు ఎఱ్ఱన కృతులను సైతము చదివి జీర్ణించికొని యుండును. భాగవతమునందు నన్నయ, తిక్కనాదులను మాత్రమే పేర్కొని ఎఱ్ఱనపేరు నుదహరింపకపోయినను "ఇతరపూర్వ కవిజన సంభావనము" లోనే పోతన ఎఱ్ఱన్నను సంభావించినాడని భావింపవచ్చును. భాగవత సప్తమ స్కంధములోని ప్రహ్లాదచరిత్ర ఘట్టములో ఎఱ్ఱన విరచితమైన నృసింహ పురాణము ననుసరించి కొన్ని పద్యములు వ్రాయబడినట్లు అగుపడుచున్నది. మహాకవులనుసరించిన మార్గములు విభిన్నములైనను వారి గమ్యము లొకటియే అని చెప్పుటలో అతిశయోక్తి లేదు. వారి రచనా శిల్పమునందు వైవిధ్యము గోచరించినను ఆ శిల్పము వెనకదాగిన కవితాత్మ ఒకటియే. "మహాకవులు వేసిన బాటలను విడనాడక, తృణీకరింపక వానికితోడు స్వోపజ్ఞా ప్రతిభల నుపయోగించుకవుల కావ్యములు చిరస్థాయులుగ నుండు"ననిన కురుగంటివారి పలుకులు సార్థకములు. కావున పోతనపై ఎఱ్ఱన ప్రభావము ప్రసరించుట సహజము. వారిరువురి వ్యక్తిత్వ, కవిత్వములందు ప్రతిబింబించెడు సామ్యమును దిఙ్మాత్రముగా పరిశీలించుటయే ఈ వ్యాసముయొక్క పరమోద్దేశము.

ఎఱ్ఱన, పోతనల కృతులను పరిశీలించి చూచినచో ఇతర కవులయందు లేని ఒక విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రవృత్తి ఆ మహాకవులయందు గోచరించును. వీరికి పూర్వము నందును, సమకాలమునందును ఎందరో కవు లుండియున్నను వారిలో నెవ్వరును యిట్టి ఆధ్యాత్మిక ప్రవృత్తితో రచనలు సాగించినట్లు కనబడదు. ఇరువురును భగవంతుని ఉపాసించి భక్త్యావేశముతో సద్గుణ సంకీర్తనము గావించిన మహనీయులు. ఎఱ్ఱయ ఎంతటి భక్తిపరుడైనను కొంత సంయమనముతో గంటము చేబట్టి రచన కొనసాగించెను. కాని పోతన భక్త్యావేశము కట్టలు త్రెంచుకొని ప్రవహించి తెలుగుదేశము నంతయు ముంచివేసినది. వీరి ఈ భగవదుపాసనము వారి కావ్యములందు అడుగడుగునను గోచరించుననుటలో సందియములేదు. ఇరువురును "శివపదాబ్జ సంతతధ్యాన సంసక్తచిత్తులై, అత్యుదాత్త భక్తిప్రయుక్తోల్లాస భాసితులై" కావ్యరచనకు పూనుకొనిరి.

ఎఱ్ఱన, పోతన లిరువురును శివభక్తులైయుండియు విష్ణుమాహాత్మ్య కథలను విస్తరించి చెప్పుట వారి ప్రత్యేకతను చాటుచున్నది. ఎఱ్ఱయ "పూజిత ధూర్జటి చరణాంబుజుడు", "శంభుదాస లక్షణాభిధేయుడు". పోతనతండ్రి "శైవశాస్త్రమతము గనినవాడు." పోతనయు "మహనీయ మంజుల పులిన తలంబున మహేశ్వరధ్యానంబు సేయుచుండగా" రామభద్రుడు సాక్షాత్కరించినాడు. ఇట్లు వీరు శివదాసులై యుండియు హరిసంకీర్తనము కావించి శివకేశవాభేదము పాటించినారు.

> చేతులారంగ శివునిఁ బూజింపదేని
> నోరు నొవ్వంగ హరికీర్తి నుడువదేని
> దయయు సత్యంబు లోనుగా దలపదేని
> గలుగ నేటికి దల్లుల కడుపుజేటు "

అన్న ఉదాత్తమగు అద్వైతాదర్శమును చాటి చెప్పినారు.

ఇరువురి యందును గోచరించు మరియొక విశిష్టగుణము వారి వినయ సంపన్నత. ఎఱ్ఱన "కతిపయాక్షర పరిగ్రహ జనితంబైన నైసర్గిక చాపలంబు కతంబున",

రాయంచను చూసి క్రౌంచపక్షియు కూయ కడంగునట్లు, ఆద్యులైన మహాకవుల కావ్యశయ్యా గీరించిన కీర్తిసంగ సుఖలీలకు తాను కాంక్ష జేసితినని వినయోదాత్తను ప్రకటించినాడు. పోతన నన్నయ తిక్కనాదులు మున్ను భాగవతమును తెలుగు జేయక పోవుట తన పురాకృత శుభాధిక్యముగా భావించినాడు. ఎఱ్ఱన తొల్లిటి కవులతోబాటు సమకాలీనులను తలచగా, పోతన మరింత ముందుకు వెళ్ళి పూర్వ, వర్తమాన కవులతో బాటు భావికవుల గూడ బహూకరించినాడు. ఇవివినయము మూర్తీభవించినవారివ్యక్తిత్వమును, సౌజన్యమును చాటుచు వినమోదయ భరితుడు, సాధుసమయుక్తుడు మున్నగు స్వీయ విశేషణములను సార్థక పరుచు చున్నవి. ఈ విధముగ భాగవత, నరసింహ పురాణావతారికలు పై యిరువురియందును గల సామ్యమును స్పష్టపరుచుట కెంతయో తోడ్పడుచున్నవి.

తెలుగు కావ్యములయందలి అవతారికలలో స్వప్నవృత్తాంతమును తొలుదొలుత ప్రవేశపెట్టినవాడు కవిబ్రహ్మ తిక్కన. నరాంకితము కాక భగవదంకితములైన కృతులయందు ఈ స్వప్న వృత్తాంతమునకు అమిత ప్రయోజనమున్నది. అందుచేతనే తరువాతి కవులనేకులు ఈ పద్ధతిని స్వీకరించిరి. ఎఱ్ఱన, పోతనలును తమ కావ్యములందీ విధానమును పాటించిరి. "ప్రబంధ మరమేశు డొక్కనాడు మహాప్రబంధ కల్పనా కుతూహలాయత్తంబగు చిత్తంబుతో తదనుసంధానానుబంధ సమాధి నిమీలితేక్షణుండై యున్న సమయంబున" తాత ఎఱ్ఱపోత సూరి "తదీయ భావంబున నావిర్భావము నొంది అహోబల మహితావతారమును స్తుతింపు"మని అనుగ్రహించెను. పోతనయు "శ్రీమన్నారాయణ కథాప్రపంచ విరచనా కుతూహలుండై మహేశ్వర ధ్యానంబు సేయుచు కించిదున్మీలితలోచనుండై యున్నయెడ శ్రీరామభద్రుడు ఎదుటగానంబడి శ్రీమహాభాగవతంబు తెనుంగు సేయుము" అని యానతిచ్చెను. భగవదంకితములైన కావ్యము లగుటజేసి ఇట్లు వీరిరువురును ధ్యానసమాధి వృత్తాంతము ప్రవేశపెట్టినారు.

ఎఱ్ఱన తన పితామహుని యాజ్ఞను గుణప్రసిద్ధియు, భవ్యసమృద్ధియు చేరు పుణ్యకార్యముగా తలంచి కృతిరచనకు కడంగినాడు. పోతన్న భాగవతమును తెనిగించి పునర్జన్మము లేకుండ తన జన్మను సఫలము చేసుకొందునని తలంచినాడు. మన ప్రాచీన కవులు "విశ్వశ్రేయః కావ్యం" అను సూక్తిని గట్టిగా విశ్వసించినవారు. కనుకనే ఎఱ్ఱన "జగద్ధితంబుగా కృతి గావింప" నియోగింపబడినాడు. పోతన సమ్మతితో, జగద్ధితంబుగా; కృతిని హరి కిచ్చినాడు.

పై మహాకవు లిరువురును విష్ణుపారమ్యగాథలనే రచించిరని తొలుతనే జెప్పబడినది. వీరి హరివంశ, భాగవత పురాణములయందు వస్తువిషయమునను సామ్యము గోచరించును. రెంటి మూలములకును కర్త శ్రీకృష్ణ ద్వైపాయనుడే. వ్యాసమునీంద్రుడు తన గ్రంథములందు విష్ణుప్రశంస చేసియున్నను హరినిగూర్చి వర్ణింపవలసినది చాలకలదని ఎఱింగి విష్ణూదంతములు ప్రధానముగాగల భాగవతపురాణము రచించెను. అంతకుపూర్వము వ్యాసుడు భారతమునకు ఖిలపర్వము వంటిదైన హరివంశమును రచించియుండెను. ఎఱ్ఱన హరివంశాంధ్రీకరణమున కొన్నిపట్టుల విష్ణుపురాణమును కూడ అనుసరించినట్లగపడుచున్నది. విష్ణుపురాణము భాగవతమునకు మూలమని యందురు. ఆంధ్ర హరివంశము వందు ప్రసంగవశమున విష్ణ్వవతారము లైదు వర్ణింపబడినవి. పోతన భాగవతమున భగవంతుని ఏకవింశత్యవతారములు వివరింపబడినవి. శ్రీకృష్ణుని చరిత్ర, రుక్మిణీకళ్యాణము, నరకాసుర వధ, పారిజాతాపహరణము, ఉషాపరిణయము మున్నగు వృత్తాంతములు ఆంధ్ర హరివంశ భాగవతములందు వస్తుసామ్యమును జాటుచున్నవి. నృసింహపురాణమున విస్తరముగా చెప్పబడిననృసింహావతారకథ భాగవత సప్తమస్కంధములోని ప్రహ్లాదచరిత్రయం దిమిడినది.

ఎఱ్ఱన, పోతనల రచనలను నిశితముగా అవలోకించినచో ప్రధానముగా వారియందు గోచరించునది వారి కవితా స్వాతంత్ర్యము. ఈ స్వేచ్ఛాప్రియత్వము వారి కావ్యములందంతటను ప్రతిబింబించుచుండును. ఇరువురును సంస్కృత మూలములను గ్రహించినను వానిని యథాతథముగా అనువదింపక స్వేచ్ఛా ప్రవృత్తి ననుసరించి చేర్పులు, కూర్పులు గావించి తమ కావ్యములను తీర్చిదిద్దిరి. ఎఱ్ఱాప్రెగడ నృసింహపురాణమునకు మూలము బ్రహ్మాండాది పురాణోక్తమైన గాథ అని చెప్పియున్నను వానియందు స్వల్పమాత్రముగా నున్న వస్తువును మాత్రమే స్వీకరించి స్వతంత్రముగా విరచించినాడు. 4,5 ఆశ్వాసములందలి విషయములు విష్ణుపురాణమునుండి గైకొనబడినవి. మొదటి మూడాశ్వాసములు స్వకపోల కల్పితములుగానే గోచరించుచున్నవి.

"ఏనునుఁ బెద్దలచే మును।
వీను లలరఁ దరతరంబ విన్న విధంబున్
మానసమున నున్నతెఱగు।
గానుపునం గన్నక్రమముఁ
గదనమొనర్తున్."

అన్న వద్యమునం దీవిషయము స్పష్టముగా సూచింపబడినది. బమ్మెర పోతరాజు

కూడ పై మార్గమునే అనుసరించి
"భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు
శూలికైనఁ దమ్మిచూలికైన
విబుధజనులవలన విన్నంతఁ గన్నంత
తెలియవచ్చినంత తేటపఱతు."
అని పలికినాడు.

నృసింహపురాణము వర్ణనాత్మకమైన ప్రబంధ మన నొప్పి ఎఱ్ఱన ప్రబంధ పరమేశ్వరత్వమును సార్థక మొనరించుచున్నది. ప్రబంధ పరమేశ్వరు డను బిరుదు ఎఱ్ఱయ కరణ్యపర్వ కర్తృత్వమువలన వచ్చినదే కాని వేరుకాదు. హరివంశ, నృసింహ పురాణములందు 'ప్రబంధ' శబ్దము విరివిగా ప్రయోగింపబడియున్నను అది సంస్కృతాను సారముగా కావ్యార్థమున ప్రయోగింపబడి నదే కాని నేటి ప్రబంధార్థమున కాదు. అయినను నేడు మనము ప్రబంధ లక్షణము లుగా భావించుచున్న వన్నియు నృసింహ పురాణమున కాననగును. "వర్ణనలు, అపరిష్టకథాంశము, అలంకారములు, ఉక్తి వైచిత్రి మున్నగున వన్నియు గలిగి ఇది ప్రబంధ రచనకు పునాదివంటి దనదగి యున్నది." ఈ గ్రంథము పురాణయుగము లేక అనువాద యుగముగా వ్యవహరింప బడు కాలమున వెలసిన స్వతంత్ర కావ్య మని చెప్పినచో అత్యుక్తి కానేరదు. మూలానుసారముగా రచించిన హరివంశము నందు సైతము క్రొత్తదారులు త్రొక్కి ప్రబంధపు పోకడలు పోయినా దన్నచో ఎఱ్ఱన స్వాతంత్ర్య ప్రియత్వము స్పష్ట మగు చున్నది.

పోతన తన భక్త్యావేశములో ఏవిధమైన అడ్డుకట్టలులేక తన కవితావాహిని ఆఱువుగా ప్రవహింపజేసినాడు. అందుచేత మూలములోని 22 వేల గ్రంథముల సంఖ్య ఆంధ్రమున 30 వేలకు పెరిగినది. మూలమునందలి గూఢార్థములను తేటపర్చుటకై విస్తరించి వ్రాయుటచేత ఆంధ్ర భాగవతము మాతృకకు వ్యాఖ్యానప్రాయముగా భాసించు చున్నది. అనువాదమునందు పోతన శ్రీధర వ్యాఖ్యలను జోడించి, కొన్ని తావుల ఆ వ్యాఖ్యలకు విరుద్ధములైన స్వతంత్రాభి ప్రాయములను కూడ వెలువరించి రచన సాగించెను. నరకుని కథ, సత్యభామా యుద్ధము మున్నగు ఘట్టములు విష్ణుపురాణ, హరివంశములనుండియు గైకొనబడినవి. ప్రథమ స్కంధమునందలి నైమిశారణ్య వర్ణనము, దశమస్కంధము నందలి గోపికల మధుర భక్తివృత్తాంతము మొద లగునవి కల్పితములు. "భగవద్గుణాభి వర్ణనాది ఘట్టములలో మూలానుసారముగా వర్ణించిన పిదప స్వకీయ భక్త్యాతిశయ మున, నిరంకుశ స్వాతంత్ర్యముచే తిరిగి విశేషముగా వర్ణించుట పోతన స్వభావము" ఇట్లే మహాకవుల కవితా స్వాతంత్ర్యము వారి కావ్యములందు స్పష్టముగా దృగ్గోచర మగుచున్నది.

భాగవతములోని ప్రహ్లాద వృత్తాంతము నందలి పద్యములు కొన్ని నృసింహ పురాణము ననుసరించి వ్రాయబడినటుల పైన చెప్పబడినది. ఆ ఘట్టమునందలి సుప్రసిద్ధ పద్యములు పెక్కింటికి ఎఱ్ఱాప్రెగడ పద్యములే ఒరవడి పెట్టినవి. మచ్చుకు కొన్ని చవిజూతము. నృసింహ పురాణములోని

సీ. వాసుదేవుని పాదవనరుహంబుల భక్తి
తగ దను తండ్రియుఁ దండ్రి గాదు
(5–22)

క. హరిభక్తుల తపము తపము
హరిభక్తుల జపము జపము (2–33)

అను పద్యములే భాగవతమునందలి

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
(7–169)

అను పద్యరచన కాధారభూతములైనవి. అట్లే ఈ క్రింది పద్యములును పోతనకు మార్గదర్శకము లైనవి.

ఉ. ఆడగబోయినప్పు డను
రాత్మజుఁ డంబుజనాభు నవ్యయుం
బాడుద మాదిదేవు పద
పంకజ పూజలు సేసి భక్తిమై.
నాడుదము......... (నృ.పు.3–149)

క. ఆడుదము మనము హరిరతిఁ
బాడుద మే ప్రొద్దు విష్ణు భద్రయశంబుల్
(భా. 7–248)

ఉ పాపడ యింతకాలమును
బాయక యొజ్జల యొద్ద నుండి నీ
వే పగిదిన్ బఠించితది
యేర్పడఁ బ్రస్ఫురితార్థసారమై
తీపులు వీనులుంగురియ
దివ్యసుధాషిత రత్న మొక్కటి
ద్దీపిత ధీ విజృంభణ ని
దేయత నొప్ప నుపన్యసింపుమా.
(నృ పు. 4–5)

శా. చోద్యంబయ్యెడి నింతకాల
మరిగెన్ శోధించి ఏమేమి నం
వేద్యాంశంబులు సెప్పిరో
గురు లే వెంటం బఠింపించిరో
విద్యాసార మెఱుంగ గోరెద
భవ ద్విజ్ఞాత శాస్త్రంబులోఁ
బద్యంబొక్కటి సెప్పి సార్థముగఁ
దాత్పర్యంబు భాషింపుమా ।
(భా. 7–163)

చ. కినియకు దైత్యనాథ యొక
కీడును వాడెన లేదు......
(నృ. పు. 4–11)

ఉ. తప్పులులేవు మావలన దానవనాథ ...
(భా. 7–176)

క. ఓ వత్స ! నీవు చెప్పిన
యీ విధమేఁ జెప్పననియె నిదె యొజ్జలు నీ
కేవాడు గఱపె నేర్పడ
గా వెఱవక చెప్పు మట్టిఖలు దండింతున్.
(నృ. పు. 4–13)

క. ఒజ్జలు సెప్పని ఈ మతి
మజ్జాతుడవైన నీకు మఱి యెవ్వరిచే
నుజ్జాతమయ్యె బాలక !
తజ్జనులం బేరుకొనుము తగ నా మ్రోలన్.
(భా. 7–179)

సీ. ....
మొందెఱుంగఁడంబుజోదర ధ్యానత
త్పరత యొకటి కాని బాలకుండు
(నృ పు. 3–147)

సీ. ....
అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృత పాన విశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు.
(భా. 7–150)

ఇట్లు పోతన్న పద్యములకు ఒఱవడి పెట్టిన వాని నుదాహరించుచుఁ బోయినచో గ్రంథము పెరుగును. కాన పోతన్న కవిత్వములో రేకులు విప్పిన ఎఱ్ఱన పద్యపద్మముల నింక రెంటిని మాత్ర ముదహరించెదను.

ఉ. ఊషర బీజముల్, భసిత
యోజ్యఘృతంబులు, షండకన్యకా
న్వేషణముల్, పయోధిగత
వృష్టితతుల్......
......విష్ణుమంగళక
థావిముఖాత్ముల దుష్టజన్మముల్.
(నృ పు. 5–?4)

శా. అంధేందూదయముల్, మహాబధిరశం
ఖారావముల్, మూక
సద్గ్రంథాఖ్యాపనముల్, నపుంసక వ
ధూకాంక్షల్......
......హరిభక్తి వర్జితుల రిక్త
వ్యర్థ సంసారముల్ (భా 7–168)

ఆ. కుడిచినపుడు నిద్రగూరిన యప్పుడు
మేలుకొనినయపుడు మెలగినపుడు
విష్ణు కీర్తనంబు విష్ణుచింతయ కాని
పలుక డొండు బుద్ధి దలప డొండు.
(నృ. పు 3–150)

శా. పానీయంబులు త్రావుచుం గుడుచుచున్
భాషించుచున్ హాస
లీలా నిద్రాదులు సేయుచుం దిరుగుచున్
లక్షించుచున్ సంతత
శ్రీనారాయణ పాదపద్మయుగళీ
చింతామృతాస్వాద సం
ధానుండై మఱచెన్ సురారి సుతుడే
తద్విశ్వమున్ భూవరా ! (భా 7–123)

దుష్టశిక్షణ శిష్టరక్షణకై నృసింహమూర్తి అవతరించు సందర్భమున ఎఱ్ఱాప్రగడ రచించిన స్తంభోద్భవ వచనము ఆంధ్ర గద్య వాఙ్మయమున సుప్రసిద్ధమైనది; సుప్రతిష్ఠితమైనది. పోతన్నయు ఆ సన్నివేశమున అదేశైలిని అనుకరించి అంతటి సుదీర్ఘ గద్యమునే రచించెను.

వ. ...హిరణ్యకశిపు ప్రహ్లాద విషయ నిగ్రహానుగ్రహేళ వ్యతికర విషమ సంరంభ దుర్వార గర్వారంభ భీషణాభిరూప సంస్థానంబును... (నృ. 5–82)

వ. ...ప్రహ్లాద హిరణ్యకశిపు రంజన భంజననిమిత్తాంతరంగ జేగీయమానకరుణావీరరస సంయుతుండును... (భా 7–285)

ఇట్లు ఎఱ్ఱన సూక్తులను, నృసింహ పురాణ కవితారీతులను అనుసరించిన పోతన ఎఱ్ఱనకు ఋణపడి యున్నాడనుట సహజమే. ఎఱ్ఱన్న పోతన్నకు అన్నయని వేలూరి వారు నుడివిన నుడులు ప్రత్యక్షర సత్యములు.

ఈ విధముగ పై మహాకవిద్వయము నందు ఎంత సామ్యము గోచరించినప్పటికిని రచనాశైలి విషయమున ఎంతయో వైలక్షణ్యమున్నది. ఇరువురును విభిన్నములైన, స్వతంత్రమైన పోకడలతో తమ కావ్యముల నంతరించిరి. ఎఱ్ఱన "కథాంశముఁ బోనీక, విషయసంగ్రహ మొనరించి, మూలగ్రంథమును క్లుప్తముగా, నిరర్గళ ధారతో, సహజమగు వర్ణనలతో కావ్య రచన గావించగా" పోతన "మూలములోని రసవత్తర భాగములు పెంచి, నీరస కథాంశమును వదలి, పద్దెముల కనువైన పోకడలు నంతరించుకొని, రసానుగుణమగు శైలి, పదాడంబరము, భావములు వెదకికొని ప్రబంధ నియమములతో రచన సాగించెను."

కవిత్రయమువారిది విశిష్టమైన ప్రసన్న శైలి. ఈ శైలీ సుభగత్వము తర్వాతి కవులలో కానరాదు. ప్రబంధయుగసారస్వతమున శబ్దాడంబరము, అన్వయక్లిష్టత, అలంకార సమృద్ధి గోచరించును. పురాణ, ప్రబంధయుగముల మధ్య వెలసిన శ్రీనాథుల కావ్యములలో పై రెండు మార్గముల సమ్మేళనము గోచరించును. ఎఱ్ఱనది ప్రసన్న శైలికాగా, పోతనది అలంకారికశైలి. ఎఱ్ఱాప్రెగడ ప్రధానముగా నన్నయ మార్గమునే అవలంబించినను, కొంతవరకు తిక్కన బాటలోకూడ నడిచినాడు. నన్నయ వదిలిన భాగమును నన్నయ మార్గమున, తిక్కన విడిచిన భాగమును తిక్కన మార్గమున కొనసాగించినాడనుట యుక్తము. నృసింహ పురాణము పై రెండు మార్గములను కలుపు విలక్షణమైన, స్వతంత్రమైన శైలిలో సాగినది.

బమ్మెర పోతరాజు రీతి ప్రధానమైన మార్గమున రచన కొనసాగించెను. అవతారిక యందు బాణుడు, కాళిదాసు, మాఘుడు, మయూరుడు మొ॥ గీర్వాణకవులను పోతన స్మరించినాడు. అనుప్రాస శోభితమై, శబ్దా

డంబరముతో విలసిల్లు పోతనశైలిని పరికించినచో భాస్కర, నాచన సోమనల ప్రభావమాతనియందు పొడసూపును. కొంత నన్నయ ప్రభావమును ప్రసరించక పోలేదు. మొత్తముమీద భాగవత కవిత్వమును పరీక్షించిజూచినచో పోతనామాత్యుడు తనకు పూర్వులైన గీర్వాణాంధ్ర కవులందరి కావ్యముల పఠించి మననము చేసికొనినా డనుట స్పష్ట మగును.

ఇట్లు ఎఱ్ఱన, పోతనల రచనా విధానమునందు వైవిధ్యము గోచరించుచున్నది. ఒకరిది "ప్రసన్న గంభీరమైన శరన్నదివంటి" కావ్యేతిహాసశైలి. మరొకరిది "తరంగ ఘోషతో దరు లొరసికొనుచు పరుగెత్తు వర్షాకాల నదివంటి" కావ్యప్రబంధశైలి. "హరి వంశములోని 4, 5 అశ్వాసములను పోతన్న కవిత్వముతో పోల్చిచూచినచో ఒకే కథను మహాప్రతిభాశాలులగు మహాకవు లెట్లు రెండు వేర్వేరు మార్గములలో సమర్థింపగలరో చూడవచ్చును." పోతన భక్తిపారవశ్యము గోపాలకృష్ణుని పరమేశ్వర విభూతిని పట్టియిచ్చినటుల, ప్రాకృత బాలకు డగు నందకిశోరుని లీలా మౌగ్ధ్యమును ఎఱ్ఱన వర్ణనమువలె మన కందీయ జాలదను కీ. శే. కాటూరివారి అభిప్రాయము సర్వులకును మాన్యమే.

కవుః కావ్యతత్త్వమును కూలంకషముగా అవగాహన చేసికొనుటలో దిట్టలయిన కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి మాటలలో ఎఱ్ఱన "సర్వ మార్గేచ్ఛా విధాతృండు." పోతన "తెలుగుల పుణ్యపేటి." ఎఱ్ఱనది ప్రధానముగా కావ్యదృష్టి. "మధురోక్తి గుంభన మనీషులు మెచ్చునట్లుగ" కావ్యరచన గావించు తలం పాతనికి గాఢముగా గలదు. కావుననే తన కవితావాహినిని బహుళమార్గముల ప్రవహింప జేసినాడు. పోతనది భక్తి ప్రధాన దృష్టి. "శ్రీరామచంద్ర కరుణా కటాక్షమును బొంది, భాగవతము నాధారముగా జేసికొని, తెలుగువారి మనః కేదారములలో భక్తి భావములు వెదవెట్టిన హాలికుడై, తెలుగుల పుణ్యపేటిగా రూపొందినాడు.

మణిముత్యాలు

ప్రజారక్షణము

శ్లో॥ చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా ।
నృశంసమనృశంసం వా ప్రజారక్షణకారణాత్ ॥
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సదా ।
రాజ్యభారనియుక్తానామేష ధర్మః సనాతనః ॥

—వాల్మీకి

"రాజు నాలుగువర్ణములవారిహితమును కోరి ప్రజాపాలనమే ప్రధానముగా తలచి ప్రజలకు హితమైనపని క్రూరమైనను, అక్రూరమైనను తప్పక చేయవలెను. తాను చేయుపని పాపపుదైనను, దోషయుక్తమైనను అది ప్రజారక్షణమునకు దోహదకారి యైనచో తప్పక చేయవలెను. రాజ్యభారమును వహించినవారు సనాతనముగా అవలంబించుచున్న ధర్మ మిది."

దాంపత్యము

శ్లో॥ ప్రేయో మిత్రం బంధుతా వా సమగ్రా ।
సర్వే కామాః శేవధిః జీవితం వా
స్త్రీణాం భర్తా ధర్మదారాశ్చ పుంసాం ।
ఇత్యన్యోన్యం వత్సయోః జ్ఞాతమస్తు ॥

—భవభూతి

"ప్రియతముడు, మిత్రుడు, సమస్తబంధుసమూహము, అన్నికామ్యవిషయములు, నిధి, వేయేల? సంపూర్ణజీవితమే స్త్రీలకు భర్త, పురుషులకు ధర్మపత్ని యగుదురు."

అహితుడు

చ॥ ప్రియ మెసఁగం దగం బిలిచి పెట్టెడుకూ డది లెస్సకూడు ద
క్కయనయహీనతం దమకు నాపద యైనెడ నిట్టు నట్టు నే
మియు నన లేనికూ డెదిరి మేవడి యై చను; నీవు మాదెసం
బ్రియుఁడవు గావు; మాకు ధృతి పెంపఱ నాపద లే దొకింతయున్.

— తిక్కనసోమయాజి

మందమారుతము

మ॥ "యమునాకంకణచారి యై వనజపుష్పాఽఽమోదసంచారి యై,
రమణీఘర్మనివారి యై, మదనకీరాసక్రమోత్తారి యై,
ప్రమదామానసనవ్యభవ్యసుఖసంపత్కారి యై, చేరి యా
కమలాక్షుం డలరంగ గాలి విసరెం గల్యాణభావంబునన్."

—పోతనామాత్యుఁడు.

డంబరముతో విలసిల్లు పోతనశైలిని పరికించినచో భాస్కర, నాచన సోమనల ప్రభావ మాతనియందు పొడసూపును. కొంత నన్నయ ప్రభావమును ప్రసరించక పోలేదు. మొత్తముమీద భాగవత కవిత్వమును పరీక్షించిజూచినచో పోతనామాత్యుడు తనకు పూర్వులైన గీర్వాణాంధ్ర కవులందరి కావ్యముల పఠించి మననము చేసికొనినాడనుట స్పష్ట మగును.

ఇట్లు ఎఱ్ఱన, పోతనల రచనా విధానమునందు వైవిధ్యము గోచరించుచున్నది. ఒకరిది "ప్రసన్న గంభీరమైన శరన్నదివంటి" కావ్యేతిహాసశైలి. మరొకరిది "తరంగ ఘోషతో దరులొరసికొనుచు పరుగెత్తు వర్షాకాల నదివంటి" కావ్య ప్రబంధశైలి. "హరి వంశములోని 4, 5 ఆశ్వాసములను పోతన్న కవిత్వముతో పోల్చిచూచినచో ఒకే కథను మహా ప్రతిభాశాలులగు మహాకవు లెట్లు రెండు వేర్వేరు మార్గములలో సమర్థింపగలరో చూడవచ్చును." పోతన భక్తిపారవశ్యము గోపాలకృష్ణుని పరమేశ్వర విభూతిని పట్టియిచ్చినటుల, ప్రాకృత బాలకు డగు నంద కిశోరుని లీలా మౌగ్ధ్యమును ఎఱ్ఱన వర్ణనమువలె మన కందీయ జాలదని కీ. శే. కాటూరివారి అభిప్రాయము సర్వులకును మాన్యమే.

కవుల కావ్యతత్త్వమును కూలంకషముగా అవగాహన చేసికొనుటలో దిట్టలయిన కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి మాటలలో ఎఱ్ఱన "సర్వ మార్గేచ్ఛా విధాతృండు." పోతన "తెలుగుల పుణ్య పేటి." ఎఱ్ఱనది ప్రధానముగా కావ్యదృష్టి. "మధురోక్తి గుంభన మనీషులు మెచ్చునట్లుగ" కావ్యరచన గావించు తలం పాతనికి గాఢముగా గలదు. కావుననే తన కవితా వాహినిని బహుళమార్గముల ప్రవహింప జేసినాడు. పోతనది భక్తి ప్రధాన దృష్టి. "శ్రీరామచంద్ర కరుణా కటాక్షమును బొంది, భాగవతము నాధారముగా జేసికొని, తెలుగువారి మనః కేదారములలో భక్తి భావములు వెదవెట్టిన హాలికుడై, తెలుగుల పుణ్యపేటిగా రూపొందినాడు.

మణిమాణిక్యాలు

ప్రజారక్షణము

శ్లో॥ దాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా ।
నృశంసమానృశంసం వా ప్రజారక్షణకారణాత్ ॥
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సదా ।
రాజ్యభారనియుక్తానామేష ధర్మః సనాతనః ॥

—వాల్మీకి

"రాజు నాలుగువర్ణములవారిహితమును కోరి ప్రజాపాలనమే ప్రధానముగా తలచి ప్రజలకు హితమైనపని క్రూరమైనను, అక్రూరమైనను తప్పక చేయవలెను. తాను చేయుపని పాపపుదైనను, దోషయుక్తమైనను అది ప్రజారక్షణమునకు దోహదకారి యైనచో తప్పక చేయవలెను. రాజ్యభారమును వహించినవారు సనాతనముగా అవలంబించుచున్న ధర్మ మిది."

దాంపత్యము

శ్లో॥ ప్రేయో మిత్రం బంధుతా వా సమగ్రా ।
సర్వే కామాః శేవధిః జీవితం వా
స్త్రీణాం భర్తా ధర్మదారాశ్చ పుంసాం ।
ఇత్యన్యోన్యం వత్సయోః జ్ఞాతమస్తు ॥

—భవభూతి

"ప్రియతముడు, మిత్రుడు, సమస్తబంధుసమూహము, అన్నికామ్యవిషయములు, నిధి, వేయేల ? సంపూర్ణజీవితమే స్త్రీలకు భర్త, పురుషులకు ధర్మపత్ని యగుదురు."

అహితుడు

చ॥ ప్రియ మొసఁగం దగం బిలిచి పెట్టెదుకూడదది లెస్సకూడు ద
క్కయనయహీనతం దమకు నాపద యైనెడ నిట్టు నట్టు నే
మియు నన లేనికూడెదిరి మేవడి యై చను; నీవు మాదెసం
బ్రియుఁడవు గావు; మాకు ధృతిపెం పఱ నాపద లే దొకింతయున్.

— తిక్కనసోమయాజి

మందమారుతము

మ॥ "యమునాకంకణచారి యై వనజపుష్పాఽఽమోదసంచారి యై,
రమణీఘర్మనివారి యై, మదవతీరాసశ్రమోత్తారి యై,
ప్రమదామానసనవ్యభవ్యసుఖసంపత్కారి యై, చేరి యా
కమలాక్షుం డలరంగ గాలి విసరెం గల్యాణభావంబునన్."

—పోతనామాత్యుఁడు.

మహాత్ములు

చ॥ "అలఘుగుణంబులం దధికుఁ డైనమహాత్ముఁడు రాగకోపమా
యలఁ బడి యక్షమావివశుఁ డై యచిరాంశులతావిలాసచం
చల మగులక్ష్మి కాసపడి సత్యము ధర్మువు దప్పి సత్యభాఽఽ
వలిఁ దగువారియొద్దఁ దగువాఁ డయి సద్విధి నుండ నేర్చునే."

—నన్నయభట్టారకుఁడు.

వాన

సీ॥ ''ఉదధిసమేతపీతోద్వాంతబాడబ
జ్వాలాఽఽయితోగ్రశంపాలతంబు,
నిర్ఘాతరవసరంధ్రీకృతాజాండబ
హిర్జలభ్రమదధారోర్జితంబు,
నిర్జాడ్యగర్జితస్ఫూర్జథూత్కర్జిత
ప్రళయభైరవరటత్పటహారవము,
ఝంఝాప్రభంజనజాతసంఘట్టన
పరిగళత్తారకత్కరకగణము,
తే॥ గీ॥ నగుచు ఘనఘనాఘనసంఘ మవ్విధమునఁ
బూని హోరున జెడిదంపువాన గురియఁ
గరము భూనభోఽంతరము చీఁకట్లు గొనియె
నఖిలలోకంబు నుదకమయత్వ మొందె.''

—పింగళి సూరనార్యుఁడు.

దుర్యోధనుని వధఘట్టము


ఉ॥ "ఆరనిలోఁతునీటికొల నక్కట ! పూచినతమ్మికిన్ విధి
ప్రేరణ రాలిపోయినవి రేకులు తొంబదితొమ్మి దింక నా
నీరజమందుఁ దా మిగులునే ? యొకరే కటు నిల్చుఁ గాం కలం
కారము లౌనె ? యాకొలనుగాని సరోజముగాని భూమికిన్."

—తిరుపతి వెంకటకవులు.

డోలాకేళి

కం॥ "ఊగుడువేడుక బల్లవు
లూగి మఱలుగఱిత లంది రుప్పరవీదిన్
మూగినవేల్పువెలందుల
లోఁ గన నౌసోయగంబులో సగపాలున్."

—ఆంధ్రభిల్హణ.





ఇండియాలో —వజీరు సుల్తాన్‌వారిది

ఆగ్నేయాసియాలో పెద్దదైన సిగరెట్ ఫేక్టరీ. ది వజీరు సుల్తాను టుబాకో కంపెనీ లిమిటెడ్, అది వారి స్వంతం. ఇండియాలో, ఆంధ్రప్రదేశ్‌కు రాజధానియైన హైదరాబాదులో వుంది. ప్రపంచములో ప్రసిద్ధి గాంచినది. అతి వేగంగా పనిచేసే ఆటోమేటిక్ యంత్రాలు, నేర్పుగా పనిచేసే ప్రవీణులు, నాణ్యతను పరిశీలించే వైజ్ఞానికులు, యిందులో. దీనికంతకీ సిగరెట్ తయారీలో పరిశోధన చేసేవారి అజమాయిషీ. ఇలాంటి ఫేక్టరీలో ప్రఖ్యాతిపొందిన ఏ సిగరెట్లు తయారగుచున్నది? చార్‌మినార్


చార్‌మినార్‌లోని అద్వితీయమైన రుచి అమితమైన సువాసన. ఆ సిగరెట్టు భారతదేశంలో బహుజనాదరణను కలుగజేయుచున్నవి. కాల్చే ప్రతి నాల్గు సిగరెట్లలోను ఒకటి చార్‌మినార్. ప్రతివేళా కొంత కోట్ల సిగరెట్లు వాడబడుచున్నట్లు లెక్కకు వస్తుంది. ఈ ఆవశ్యకతను పూరించుటకు వూహాతీతమైన వేగముతో నిర్మాణం సాగవలె—నిముషానికి యిరవైవేలకు మించిన సిగరెట్ల తయారీ! ప్రపంచ స్థాయికందుకొనిన కంపెనీ మాత్రమే ఆ పని చేయగలదు. ఇండియాలో ది వజీరు సుల్తాను టుబాకో కంపెనీ లిమిటెడ్ వారు అంతపనిని ప్రతిదినము చేయుచున్నారు.

అద్వితీయమైనది చార్‌మినార్. ఇండియాలో ఘనత వహించిన సిగరెట్.


ది వజీరు సుల్తాను టుబాకో కంపెనీ లిమిటెడ్

భారతదేశమంతట ఘనత వహించిన సిగరెట్ నిర్మాతలు.


CAS/VS-4 TEL




కొత్త ఢిల్లీలో మే 7వ తేదీన సమాచార మంత్రుల సమావేశానికి ప్రారంభోత్సవం చేసినప్పటి చిత్రం.



సమాచార మంత్రులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేంద్ర రేడియో, సమాచారశాఖా మంత్రిణి శ్రీమతి ఇందిరా గాంధీ




సమావేశం దృశ్యం



రేడియో, కేంద్ర సమాచారశాఖా మంత్రిణి శ్రీమతి ఇందిరా గాంధీతో సంభాషిస్తున్న శ్రీ బి. వి. గురుమూర్తి, కేంద్ర సమాచార డిప్యూటీ మంత్రి శ్రీ సి. ఆర్. పట్టాభి రామన్ కూడా యీ చిత్రంలో చూడవచ్చు.




విరామ సమయంలో వేడివేడి టీ తాగుతూ ప్రచారానికి సంబంధించిన అంశాలపై చర్చిస్తున్నారు.



హైదరాబాదులో మే 2వ తేదీన ఎల్.ఐ.సి. వారి కొత్త భవనం 'జీవన్ ప్రకాశ్' కు ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేసిన సందర్భంలో ప్రసంగిస్తున్న దృశ్యం.




ఆ సందర్భంలో అధ్యక్షత వహించిన డా. ఎమ్. ఎన్. లక్ష్మీనరసయ్య



ఎల్. ఐ. సి. డివిజనల్ మేనేజరు వందనసమర్పణ




ప్రారంభోత్సవానికి విచ్చేసిన సభికులు



'జీవన్ ప్రకాశ్'



ప్రణాళిక పై పునర్వ్యవస్థీకరించబడిన రాష్ట్ర సలహా మండలి ద్వితీయ సమావేశం ఏప్రెలు 26 న సచివాలయం లోని కమిటీ హాలులో జరిగినప్పటి దృశ్యం।




కెనడా హైకమీషనర్ శ్రీ రోలండ్ మోక్వర్ ఏప్రిలు 11 వ తేదీన హైదరాబాదుకు విచ్చేసిన సందర్భంలో బేగంపేట విమానాశ్రయంలో తీసిన ఫోటో.




హైదరాబాదులో ఏప్రిలు 21 న ప్రభుత్వ డిస్టిలరీస్ సిబ్బంది సంఘం ద్వితీయ వార్షిక సమావేశానికి ప్రారంభోత్సవం చేసిన ముఖ్య మంత్రి శ్రీ కె. బ్రహ్మానంద రెడ్డి



స్వర్గీయ జె. మహేశ్వరి దానం చేసిన ఆమె కనుగుడ్లవల్ల దృష్టి భాగ్యం సంపాదించిన అంధురాలు బాలమ్మ.




మే నెల 20 వ తేదీన జరిగిన సమాచార, పౌరసంబంధాల శాఖ తాలూకు క్షేత్ర ప్రచారకోద్యోగుల వార్షిక సమావేశంలో కార్మిక, సమాచార శాఖ మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి ప్రసంగిస్తున్న దృశ్యం.




రామగుండంలో 20 మెగావాట్ల థర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రాన్నొక దానిని ఏర్పాటు చేసే ఒప్పందంపై రాష్ట్ర విద్యుచ్ఛక్తి మండలి అధ్యక్షుడు శ్రీ జె. వి. నరసింగరావు డా. ధర్మతేజ సంతకాలు చేసిన దృశ్యం




మంత్రిగారి ప్రసంగాన్ని శ్రద్ధతో ఆలకిస్తున్న క్షేత్రప్రచారకోద్యోగులు.



ఒప్పందంపై సంతకాలు అయిన తర్వాత తీసిన ఫొటో ఇందులో శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యుచ్ఛక్తి మండలి అధ్యక్షుడు శ్రీ జె. వి. నరసింగరావు, శ్రీ జె. ధర్మతేజ, శ్రీమతి తేజ, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఉన్నతాధికారులు గలరు.




ఈ సందర్భంలో పబ్లిక్‌వర్క్సుశాఖామంత్రి శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి ప్రసంగిస్తున్న దృశ్యం.




ఇటీవల చిత్తూరుకు వచ్చిన సందర్భంలో గవర్నరు జిల్లా పరిషత్తు సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న చిత్రం.




దుగ్గిరాల సహకార భూమి తనఖా బ్యాంకు రజతోత్సవాన్ని ఏప్రిలు 17వ తేదీన గుంటూరులో శాసన మండలి అధ్యక్షుడు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రారంభోత్సవం చేస్తున్నదృశ్యం.



మేడ్చల్‌లో ఏప్రిలు 25న జరిగిన పంచాయతీ సమ్మేళనంలో డా॥ ఎమ్. చెన్నారెడ్డి.



నంద్యాలలోని కార్మిక నాయకుల్ని ఏప్రిలు 18న కార్మిక, రవాణా శాఖామంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి కలుసుకున్నప్పటి ఫొటో.



జవహర్ లాల్ స్మారకనిధి ప్రాంతీయ ఉపసంఘం తాలూకు సబ్ కమిటీ ఏప్రిలు 20 వ తేదీన ముఖ్యమంత్రి అధ్యక్షతను సమావేశమైనప్పటి చిత్రం.




అఖిల భారత రచయిత్రుల సమావేశానికి ఏప్రిలు 25న ప్రారంభోత్సవం చేసిన శ్రీమతి విజయలక్ష్మి పండిట్.




ఉస్మానియా విశ్వవిద్యాలయ రష్యా భాషా సంఘంవారి వార్షిక. వీడ్కోలు ఉత్సవ సందర్భంలో ఏప్రిలు 30వ తేదీన అధ్యక్షోపన్యాసం కావిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. ఎన్. అనంతరామన్.



గురుజాలలో నాగార్జునసాగర్ ఆయకట్టు అభివృద్ధి ఋణ పథకానికి ప్రారంభోత్సవం చేస్తున్న పి. డబ్ల్యు. డి. మంత్రి శ్రీ ఏ. సి సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఎమ్. నాగేశ్వరావు, ఆంధ్ర ప్రదేశ్ సహకార భూమి తనఖా బ్యాంకు అధ్యక్షుడు శ్రీ కె. వెంగళ రెడ్డి, ఎం. పి; గారిని కూడా చిత్రంలో చూడవచ్చు.




సంగారెడ్డిలో జిల్లా స్టేడియంకు ఏప్రిలు 9వ తేదీన పబ్లిక్ వర్క్సు శాఖా మంత్రి శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంలో తీసిన ఫొటో.




లక్సెట్టిపేట (ఆదిలాబాదు జిల్లా) లో ఏప్రిలు 8వ తేదీన వ్యవసాయ సదస్సు, ప్రదర్శనకు శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి ప్రారంభోత్సవం చేసినప్పుడు ప్రసంగిస్తున్న దృశ్యం.



లక్సెట్టి పేటలో ఏర్పాటు చేయబడిన వ్యవసాయ ప్రదర్శన సింహద్వారం.



వరంగల్లు జిల్లా నెక్కొండలో ఏప్రిలు 10వ బంజారా సమావేశానికి ప్రారంభోత్సవం చేస్తున్న మహారాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ వి. పి. పట్నాయక్.




బంజారా సమావేశంలోని సభికులు.



పశ్చిమ గోదావరి జిల్లా సంగీత, నాటక సమ్మేళనంలో పాలకొల్లు బి. ఆర్. ఎమ్ వి. పురపాలక సంఘోన్నత పాఠశాల విద్యార్థులు పురోగమించిన భారతిఅన్న బుర్రకథను ప్రదర్శించినప్పటి చిత్రం.



ఒరిస్సా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. సివరామన్ నాయకత్వం క్రింద భారత ప్రభుత్వం నియమించిన ఎరువుల నిపుణుల బృందం ప. గోదావరి జిల్లా మొవ్వేరులో త్వరగా చేతికందే రెండో పంట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చిత్రం.



గుంటూరు స్టేడియం గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేయబడిన సమాచారశాఖా స్టాలు.

బతికిన కాలేజీ

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్

3

మిస్టర్ చింతా సొగసైన తన మెత్తల కుర్చీలో కూర్చున్నాడు. అప్పు డప్పుడు కళ్ళు అరమూసి, సిగచుట్ట పీలుస్తున్నాడు — అవి అతడు ప్రత్యేకంగా తెప్పించుకుంటాడు హవానానించి. అప్పు డప్పుడూ పక్క టీపాయిమీదున్న కప్పు ఎత్తి టీ తాగుతున్నాడు. చుట్టతాలూకు రెట్ట ఏమన్నా పడిందేమోనన్నట్టు ఎడం చేత్తో మడతనలగని పాంటు సున్నితంగా దులుపుకుంటున్నాడు. నల్లటి నున్నటి కోణాలు దేలిన అతనిబూట్లు, అలవాటు చొప్పున కింద దరువులు వాయిస్తూ న్నాయి. అయితే నేలమీద దళసరి కాశ్మీర్ తివాసీ పరిచిఉన్న మూలంగా చప్పుడు కావడంలేదు. ఈ వర్ణనకి అర్థం ఏమిటంటే — మిస్టర్ చింతా గాఢంగా ఆలోచిస్తున్నా డన్నమాట.

ఆ గది చూసి బ్రహ్మచారి నివసించే గదని ఎవరూ అనుకోరు. చక్కగా, శుభ్రంగా, సంపన్నంగా, అలంకరించబడి ఉంది ఆగది. ఆగది మిస్టర్ చింతా అభిరుచికి గీటురాయి. గోడలకి లేత నీలి మైనపు రంగుపూత; నల్లవిరుగుడు చేవ సోఫాసెట్టు; దానిలోని మెత్తలకు లేత నారింజరంగు గుడ్డ ఆచ్ఛాదనం. మధ్య మధ్య నల్లవిరుగుడు చేవ టీపాయిలు అద్దాల్లా మెరుస్తున్నవి. కింద ఒత్తైన కాశ్మీర్ తివాసీ — ఎర్రటిది; గోడలమీద అతి సున్నితమైన నీటిరంగు చిత్రాలు — సన్నగా పొడుగ్గా ఉన్నవి, వెడల్పుగా సన్నగా ఉన్నవి. కొన్ని నాట్యభంగిమలు. కొన్ని ప్రకృతి దృశ్యాలు; పైకి కనబడని దీపాలు: చప్పుడు చెయ్యని ఎయిర్ కండిషనరూ.

మిస్టర్ చింతా గాఢాలోచనలో కళ్ళు మూసుకున్నా డన్నాను. నిజానికి అతను ఎవరన్నా ఏదన్నా చెపుతున్నప్పుడు కళ్ళు అరమూసుకుని ఆలోచనా పూర్వకంగా వింటాడు; వింటున్నట్టుంటా డంటే మంచిది. ఈ కళ్ళుమూసుకునే కార్యక్రమంముందే. అతను కావాలని అలవాటు చేసుకున్నాడు. ఎందుకంటే చింత అంటే ఆలోచన. తనఇంటి పేరు అన్నివిధాలా సార్థకం కావాలని అతని పట్టుదల. చింత అంటే మరో అర్థం దుఃఖం గనకానున్నా, అతని జీవితంలో దుఃఖం అనే అనుభవానికి అవకాశం లేకపోవడం చేతనున్నా, అతను అధమం ఇతరుల దుఃఖాలను ఓపికగా వినాలని నిశ్చయించుకున్నాడు.

ప్రస్తుతం అతడు పట్టూ విషాదగాథ వింటున్నాడు.

“అప్సరసరా. స్వర్గంలోంచి దిగొచ్చిన ఊర్వశిరా. ఆ అమ్మాయి అమ్మాయికానే కాదు. అంటే మనిషే కాదు. సౌందర్య సారం ఆ అమ్మాయి. నాట్యకళకు మూర్తీభావం. అహో! ఏం నాట్యంరా.”

“నాట్యమా? ఏం నాట్యం?” అని అడిగాడు మిస్టర్ చింతా.

“ఆ అమ్మాయి నాట్యంరా,” అంటున్నాడు.



"అమ్మాయా! ఏ అమ్మాయి" అని అడిగాడు మిస్టర్ చింతా.

"ఏ అమ్మాయేమిటి? ఇంతవరకూ నేను చెప్పిన అమ్మాయే. ఈ లోకంలో ఇంతకీ ఆమె ఒక్కత్తే అసలయిన అమ్మాయి. ఇంకా ఏ అమ్మాయని అడుగుతారు." అన్నాడు పట్టూ చిరాకుగా.

"ఎక్కడుంది?" అన్నాడు మిస్టర్ చింతా.

పట్టు ఇంక చెప్పలేక నిస్పృహతో నిట్టూర్చాడు.

మిస్టర్ చింతాతో కష్టసుఖాలు చెప్పుకునేవాళ్ళకి ఒక పెద్ద ఇబ్బంది ఉంది. అతడు వింటాడు అంటే వింటున్నట్టే కనిపిస్తాడు. అయితే, మీ మాటలు ఒక చెవిలో ప్రవేశించి, బహుశా రెండో చెవిగుండా అవతలికి పోతాయేమో. అతని మెదడుదాకా మాత్రం ప్రయాణం చెయ్యడం అరుదు. ఎక్కడో ఇక్కడో మాటా, అక్కడో అక్షరం అతని మెదడులోకి ప్రవేశిస్తాయి. తక్కినవన్నీ అతని స్మృతిపథంలోకేరావు. బహుశా ఒక మాట మెదడులోకి ప్రవేశించి, మిగతా మాటలు లోపలికి రాకుండా బిరడాలాగ దార్లో బిగుసుకుపోతుందో ఏమో. అతనితో తమ కష్టసుఖాలు చెప్పుకోవలసి వచ్చిన దురదృష్టవంతులు మరో కారణము చెపుతారు. వాళ్ళేమంటారంటే, అతని మెదడు మరీ చిన్నదనీ, ఒకే సమయంలో అందులో ఒకటి రెండక్షరాలకంటే పట్టవనీ. ఒక మాటలో రెండు కన్నా ఎక్కువ అక్షరాలుంటే, అందులో ఆఖరు రెండే మెదడులోకి ఎక్కుతాయనిన్నీ. వాళ్ళసూచన ఏమంటే, మిస్టర్ చింతా పట్టి మట్టిబుర్రేకాక, పిచ్చాసుపత్రిలో ఉండవలసినవాడని. ఈ సందర్భంలో మిస్టర్ చింతాకీ, మరొక పెద్ద మనిషికీ మధ్య నడచిన సంభాషణ ఇక్కడ ఉదహరించడం న్యాయం.

పెద్దమనిషి:— చూశారూ? ఉన్నవేవీ ఏమంటే నా పెళ్ళాం సత్య.

మిస్టర్ చింతా:— సత్యవరమేనా? తమలపాకులకు మహాప్రసిద్ధి.

పె. మ:— కావచ్చు. ఇంతకీ నేను చెప్పేదేమంటే మా బావమరిది దున్నాదేవా డొట్టి లండాచోరీ.

మి. చిం: చోరీఆ? చోరాచోరీ ఆ? రాజ కపూర్ పిక్చర్ కాదండి!

పె. మ.— అదెవడి పిక్చరైతే నాకేం కావాలండీ? నా ఏడుపేమిటంటే, నా బావమరిది ఎంతచెపితే అంత నా పెళ్ళాంపీనుక్కు. మా అమ్మనీ, తమ్ముడినీ వేరేకాపురం పెట్టించమని నూరిపోశాడు. ఇంత ఒంటెత్తు బతుకైతే...

మి. చిం:— అవునవును. ఒంటెత్తు బతుకు కష్టం. పోనీ మీరు పెళ్ళిచేసుకో కూడదూ?

పె. మ:— అయ్యోరాత! ఇందాకట్నుంచి నే చెప్పేదేమిటండీ? నాకో పెళ్ళాం పీనుగుంది. ఓ బావమరిది పీనుగు కూడా తగులడాడు.

మి. చిం:— అయితే ఇంకేం? పీనుగు తగలడిందిగా. ఇంతకీ మీసమస్య ఏమిటి?

సంభాషణకి ఈస్థితి కొచ్చేసరికి, మిస్టర్ చింతా పీక నులిపెయ్యాలన్నంత కోపం వొచ్చింది పెద్ద మనిషికి. అదంత సులువుగా నెరవేరేపని కాదని ఆ పెద్ద మనిషి విరమించుకున్నాడు.

పట్టూమాత్రం మొత్తంమీద తనకథ చాలాభాగం మిస్టర్ చింతా బుర్రలోకి ఎక్కించగలిగాడు. తను పిల్లని చూడ్డానికి వెళ్ళాడు. అదృష్టవశాత్తూ పిల్ల ముందే అతని కంట పడింది. (తను చూచినపిల్ల వాళ్ళు చూపించదలుచుకున్నపిల్ల కాదని అతని కేం తెలుసు, పాపం?) ఏస్థితిలో అతని కంట పడిందని!! ఏ పెళ్ళికొడుకూ పెళ్ళికూతుర్ని ఇంతవరకూ అలా చూసి ఉండడు, ఇకముందు చూడబోడు. ఒకవేళ చూసినా, ఆ మొదటిచూపులోనే ప్రేమ సముద్రాలు అతనిలో కట్టలు తెంచుకోడం జరగదు. ఇంతా జరిగి ఏం లాభం? తండ్రుల మూర్ఖత్వంవల్ల అంతా చెడిపోయింది.

"తండ్రులా? ఏ తండ్రులు?" అన్నాడు మిస్టర్ చింతా.

"ఇంకెవరు? నా తండ్రీ ఆ పిల్ల తండ్రీ."

"వాళ్ళేం చేశారు?"

"దెబ్బలాడుకున్నారు."

"పాపం వాళ్ళకి దెబ్బలాడుకోవాలనుందేమో, ఆడుకోనీ,"

"అదికాదురా. ఆదెబ్బలాటమూలంగా అంతా చెడిపోయింది."

"ఎందుకు చెడిపోయింది?"

"ఎందుకేమిటి! నీతలకాయి. ఇంక సంబంధ మెల్లాకుదురుతుంది? పెళ్ళెలా జరుగుతుంది?"

"పట్టూ. నువ్వు చెప్పేదాంట్లో అర్థం లేదు. వాళ్ళకి దెబ్బలాట సరదా. నీకు పెళ్ళిసరదా. వాళ్ళ సరదా వాళ్ళు తీర్చుకున్నారు. నీ సరదా నువ్వు తీర్చుకో. వెళ్ళి పిల్లని పెళ్ళాడెయ్యి."

అదంత సులభంగాదనీ, తల్లీ తండ్రీ అనే ప్రతిబంధకాలు యువకులకూ వాళ్ళ ఆశయాలకీ మధ్య దాటరాని అడ్డంకులనీ, పట్టూ మిస్టర్ చింతాకి వివరించి చెప్పాడు. మిస్టర్ చింతా కళ్ళు మూసుకున్నాడు. అంటే ఆలోచిస్తున్నా డన్న మాట. చటుకుని లేచాడు.

"పద" అన్నాడు.

"ఎక్కడికి?" అని అడిగాడు పట్టూ.

"శ్రీమాన్ పేరయ్యదగ్గరకు."

4

ఎన్ని పెళ్ళిళ్ళు చేయించిన పేరయ్యలైనా, కొన్ని సందర్భాలలో తబ్బిబ్బు కాక తప్పదు. అసలు వాళ్ళలోకం పరిమితమైనది. అందులో ఉండేది మూడే

రకాల మానవులు. అమాయకంగా తల వంచుకునే ఆడపిల్లలూ, లేని మీసాలు మెలివేసే బ్రహ్మచారి కుంకలూ, పెళ్ళి కెదిగిన కుర్రాణ్ణి మంచి ధరొచ్చే జంతువుగా పరిగణించే తండ్రులూ.

మన కథలో పేరయ్య తన జన్మలో ఎప్పుడూ మిస్టర్ చింతాలాంటి బ్రహ్మచారిని చూసి ఉండడు. మొట్టమొదట మిస్టర్ చింతా ఊరూపేరూ వినగానే, ఇంత పెద్ద చేప తన పెళ్ళిళ్ళ వలలో పడబోతోందని పేరయ్య సంతోషించాడు. కాస్త సంభాషణ సాగిన తరవాత, ఈ చేప తన వలని కొరికేసి, ఇతర వలమీదికి చాడిసాగించగల గడ్డు చేప అని గ్రహించాడు పేరయ్య. అసలు పరిచయాలూ కుశలప్రశ్నలూ ముగిసే సరికే పేరయ్య మెదడు స్తంభించిపోయింది — తిమ్మిరెక్కిందనడం సబబేమో. మిస్టర్ చింతా మాటలు విన్నకొద్దీ, అతన్ని నీరసం, నిస్పృహ, ఏదో తెలియని కంగారు ఆవరించాయి.

"శ్రీమాన్ పేరయ్యా! ముందీ విషయం మనం తేల్చుకుందాం," అన్నాడు మిస్టర్ చింతా. "చూడండి. మనం ప్రస్తుతం చర్చిస్తున్నది అతని పెళ్ళి విషయం. నా పెళ్ళి విషయం కాదు. మరి కాస్త స్పష్టంగా చెప్పాలంటే, శ్రీమాన్ రామయ్య కొడుకైన శ్రీయుత పట్టూ అనబడే ఈ కుర్రవాడి కోసం, మీరు తీసుకొచ్చిన ఒకానొక సంబంధం విషయమై మనం ప్రస్తుతం చర్చిస్తున్నాం. అంతేగాని, శ్రీ శ్రీ శేషుడైన శ్రీ శ్రీ చింతాగారి కుమారుడు మిస్టర్ చింతా వివాహవిషయం కాదు."

ఈ విషయం పేరయ్య బానకడుపులోకి ఎక్కించడానికన్నట్టు, తన చేతి కర్ర కొనతో అతని పొట్టమీద మరీ మరీ నొక్కాడు. పేరయ్య వెర్రినవ్వు నవ్వాడు.

"అది సరేలెండి. నేననేది మీరుకూడా త్వరలో — ఏదో సంబంధం చూసి...అంతే పెద్దలు చెప్పినట్టు బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా....." అని మరి కాస్త నవ్వడానికి ప్రయత్నించాడు.

నేను ముదిరానని ఎవరన్నారు? అదీగాక, నేను బ్రహ్మచారినని ఎందుకనుకున్నారు? మిమ్మల్నింతగా తికమక పెట్టేసినందుకు నేను చాలా విచారిస్తున్నాను. మాట్లాడుతున్నది నేనూ, మౌనంగా వున్నది అతనూ గనక, పెళ్ళికొడుకు ఉద్యోగానికి నేను దరఖాస్తు పెట్టుకుంటున్నానని, మీరు పొరబడి ఉండొచ్చు. కాదు. దరఖాస్తు పెడుతున్నది నేనుకాదు. అతను. అతని తరఫున మాట్లాడుతున్నానంతే. నేనూ పెళ్ళికొడుకు ఉద్యోగానికి అర్హుణ్ణే. అయితే ప్రస్తుతం నేనింకా నిర్ణయానికి రాలేదు. ప్రస్తుతం — అనగా ఈక్షణంలో మనం చర్చించవలసిన పెళ్ళికొడుకు. పట్టూ అని పిలవబడే శ్రీజిత్ పట్టాభి రామారావు. తెలిసిందా? అతను. నేను కాదు."

ఆఖరు విషయం మరింత స్పష్టపరచటానికి మొదట పట్టూవైపు వేలుపెట్టి చూపించి, తరువాత తనవేపు వేలు తిప్పాడు మిస్టర్ చింతా. పేరయ్య నిస్పృహతో తల ఊపాడు.

"అమ్మయ్య, ఇప్పటికి పెళ్ళికొడుకు అతనా నేనా అన్న గడ్డుప్రశ్న తేలిపోయింది. ఇంక మిగిలినసమస్య చాలా తేలికైనది. ఒకపిల్ల, పిల్లవాడు ఒకరికొకరు వచ్చి పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకున్నాక, ఆ పెళ్ళి ఆపడం బ్రహ్మతరంకాదు. అయితే పట్టూ, తలిదండ్రుల రూపంలో కొన్ని అడ్డంకులున్నాయంటాడు. అవి తొలగించడం మీపని. అంటే తలిదండ్రుల్ని తొలగించమనికాదు. పాపం క్షమించుగాక, అడ్డంకుల్ని తొలగించమని నా అభిప్రాయం."

పట్టూ, పేరయ్యాకూడా ఏం మాట్లాడాలో తెలియక వింటూ కూర్చున్నారు. మిస్టర్ చింతా ఆపిన తరువాత ఒక నిమిషం గడిచేదాకా, అతను చెప్పవలసింది అయిపోయిందనీ, తను ఇప్పుడుసమాధానం చెప్పాలనీ పేరయ్యకి తోచలేదు. మరోనిమిషం సందేహించాడు పేరయ్య.

"సరే," అన్నాడు సందేహంగానే. మరికొంతసేపాలోచించి, కొత్త ఆలోచనేదో తోచినట్టు, "సరే," అన్నాడు.

(సశేషం)



పంచతంత్రము

(గత సంచిక తరువాయి)

దమనకుడు అను నక్క మృగరాజైన పింగళకునికి అపూర్వ ధ్వనిని వినినంత మాత్రము చేత భయపడకూడదని ధైర్యము చెప్పుచూ దృష్టాంతముగా యీ క్రింది కథను చెప్పుచున్నది:

అడవిలో గోమాయువు అను పేరుగల ఒక నక్క ఆకలిబాధ పడుతూ అక్కడక్కడ తిరుగుతూ రెండు సైన్యములు పోరాడు యుద్ధభూమిని చేరెను. అచ్చట గాలితాకిడి చేత అల్లాడుచున్న లతలు ఒక నగారాపై బడి కొట్టుకొనుచుండెను. అట్టి ధ్వనిని ఆ నక్క విని భయపడెను. అయ్యో! ఎక్కడి నుండి యీ అపూర్వమైన ధ్వని భయంకరముగా వినవచ్చుచున్నది. అట్లు ధ్వనించు జంతువు కంటబడకుండా దూరముగా పోయెదననుకొనెను. అని తలచికూడ — తండ్రి తాతల కాలమునుండి నాకు నివాసముగానున్న యీ అడవిని విడచుట యుక్తముకాదు అని విమర్శించుకొని ధైర్యము వహించి ఆధ్వని ఎక్కడి దని తెలిసికొనుటకు ప్రయత్నించెను మెల్లగా అడుగులు వేయుచు ముందుకు పోయి ఆ నగారాలు చూచెను. సంతోషపడి తాను కూడ దానిని వాయించుచు గంతులు వేసెను. దానిలోపల మిక్కిలి మాంసము రక్తము నిండియున్నది. పైన చర్మముతో కప్పబడినది అని భ్రాంతిపడి తనకు దండిగా ఆహారముకూడ దొరకు నని సంతోషించి దానిని చీల్చి లోపల ప్రవేశించెను. ఆ చర్మమును దంతములలో చీల్చుటవలన ఆ నక్కకు దంతభంగమే కలిగెనుకాని దాని లోపల మాంసముగానీ నెత్తురుగానీ లేక నిరాశచెందెను. లోపల చర్మము, కొయ్య తప్ప యేమీ కనబడలేదు కనుక ఓ రాజా! ధ్వని వినినంతమాత్రముచేత భయపడ కూటదు, అనెను.

పింగళకుడు : నా పరివారమువారందరు భయముచేత వ్యాకులపడి, యిక్కడి నుండి పారిపోదలచుచున్నారు. నేను మాత్రము ధైర్యమువహించి ఎట్లు ఉండగలుగుదును.

దమనకుడు : స్వామీ! యిది వారిదోషము కాదు. ప్రభువు ననుసరించియేకదా భక్తు లుందురు. కనుక పౌరుషముతో నీ విక్కడనే నిలిచియుండుము. నేను పోయి ఆశబ్దము వచ్చుటకు మూలము తెలుసుకొని వచ్చెదను. ఆ తర్వాత మనకు ఏది ఉచితమో ఆ కార్యము చేయుదము.

పిం : నీవు అక్కడికి పోదల్చుకున్నావా?

దమ : ప్రభువు ఆజ్ఞ లయినప్పుడు యోగ్యుడైన సేవకునికి యేది కృత్యము యేది అకృత్యము లను భేదము లేక ప్రభువు ఆజ్ఞను శిరసావహించి చేయలసినదే.

పిం : భద్రుడా! అట్లైనచో పోయిరమ్ము. నీకు శుభము కలుగుగాక.

ఆమాటలువిని దమనకుడు సంజీవకుని శబ్దము వచ్చిన దారినిబట్టి పోయెను. దమనకుడు పోయినతర్వాత భయముతో పింగళకుడు యీ విధముగా చింతించెను. "అయ్యో! నేను ఆ నక్కను నమ్మి నా మనసులోని అభిప్రాయమును తెల్పితిని. అది కుట్రచేత రెండువైపుల లాభమును పొందదలచి నా నాశనమును తలపెట్టునేమో. ఎందుకనగా అది పూర్వము మంత్రిగా నుండి అధికారము నుండి తొలగింపబడినది. కనుక ఆ నక్క కుట్రను కనిపెట్టుచు వేరుచోట దాగి యుండి చూచుచుండెదను. నేను యిక్కడనే యుండినచో ఒకవేళ దమనకుడు ఆ అపూర్వమృగమును తోలుకొనివచ్చి దానిచేత నన్ను చంపించవచ్చును." అని నిశ్చయించి పింగళకుడు స్థానాంతరము పోయి దమనకుని త్రోవను పొంచిచూచుచు ఒంటరిగా నిలిచి యుండెను.

దమనకుడు సంజీవకునిదగ్గరకు పోయి అది వృషభమని తెలుసుకొని సంతోషించి "ఆహా? మంచిపనియే జరిగినది. ఈ సంజీవకునితో పింగళకునికి సంధి చేసి



క్రమముగా ఆ యిరువురికి ద్వేషము కలిగించి తద్వారా పింగళకుని నేను వశపర్చుకుందును" అని ఆలోచించుచు తిరిగి పింగళకునివద్దకు పోయెను. పింగళకుడు కూడా ఆ వచ్చుచున్న దమనకునికి కనపడకుండా పోయి మొదటిచోటనే నిలచి యుండెను. దమనకుడు పింగళకునివద్దకు పోయి నిలిచెను.

పిం : నీవు ఆ జంతువును చూచితివా?

దమ : తమ అనుగ్రహమువలన చూడ కలిగితిని.

పిం. సత్యముగా చూచితివా?

దమ : ప్రభువు సమక్షములో అసత్యము చెప్పుదునా?

పిం : నీవు దీనుడ వని, ఆ మహాసత్వము దయదలచి నిన్ను చంపలేదను కొనెదను.

దమ : అవును. అతను మహాత్ముడు. మనము దీనులము అయినప్పటికి మీ ఆజ్ఞ అయినచో అత డెంత గొప్పవాడైనను మీకు భృత్యునిగా చేసెదను.

పిం : (ఊరడిల్లి) నీ వట్లు చేయగలుగుదువా?

దమ : బుద్ధికి అసాధ్య మేమున్నది?

పిం : అట్లయినచో నీకు మంత్రిపదవి యిచ్చితిని. నేటినుండి నాకు ప్రతినిధిగా యీ రాజ్యమును పాలించుచుండుము.

తరువాత దమనకుడు త్వరగా సంజీవకుని వద్దకు పోయి "ఓ దుష్టవృషభమా రమ్ము. మా స్వామియగు పింగళకుడు నిన్ను పిలుచుచున్నాడు. నీవు భయము లేక మాటి మాటికి వ్యర్థముగా అరచుచున్నావు.

సంజీవకుడు : భద్రుకా! పింగళకు డనగా ఎవరు?

దమ:- ప్రభువైన పింగళకునే నీ వెరుగవా? క్షణకాలము యచటనే నిలిచియుండుము. అత డెవరో నీకు తెలియగలదు. సమస్త మృగపరివారముచే కూడినవాడయి, ఆ మఱ్ఱిచెట్టు నీడన పింగళకు డను సింహము కూర్చొనియున్నాడు. అతడు యీ వనమునకంతా ప్రభువు.

సం:- ఆ మాట విని తన ప్రాణము పోయినంత భయపడి దుఃఖించుచు భద్రుడా! నీవు సత్ప్రవర్తన కలవాడవై మాటనేర్పరిగా కనబడుచున్నావు. మీ ప్రభువువద్దకు నన్ను తోడుకొని పోదలచినయడల నాకు అతనినుండి అభయమును యిప్పించి నన్ను అతని అనుగ్రహమునకు పాత్రునిగా చేయుము.

దమ : ఓయీ! అట్లే కానిమ్ము. నీ విక్కడనే

నిలిచియుండుము. సమయమును కనిపెట్టి నిన్ను ప్రభువద్దకు తీసుకుని పోయెదను.

అని చెప్పి దమనకుడు పింగళకునివద్దకు పోయి "స్వామీ, అది సామాన్యమైన జంతువుకాదు. పరమేశ్వరునికి వాహనమైన నందికేశ్వరుడట. దానిని అనుగ్రహించి భగవంతుడు యమునానది ప్రాంతములో పచ్చిక మేయుచూ హాయిగా తిరుగుచుండుము. నీవు క్రీడించుటకు యీ వనము నీకిచ్చితిని" అని ఆజ్ఞాపించెనట.

పిం: (భయపడి) నేను అనుకున్నమాట నిజమే. దేవతానుగ్రహము లేనిదే గడ్డిమేయును క్షుద్రజంతువులు క్రూరమృగ సంకీర్ణమైన యీ ఘోరవనమునందు నిర్భయముగా సంచరించుచు తిరుగలవా? నీవు అతనితో ఏమంటివి?

దమ: "ఇది పార్వతీదేవి వాహనమైన పింగళకుడను సింహము యొక్క నివాసవనము. నీవు పరమేశ్వరుని వాహనము గనుక మా ప్రభువుకు ప్రియమైన అతిథివి. కనుక మీ యిరువురు కలిసి సోదర స్నేహముతో ఒకచోటనే ఆహార పానీయములు విహారములు సలుపుచు కాలము గడుపుట మంచిది." అని నామాటను విని అది సంతోషముతో అంగీకరించి "మీ ప్రభువునుండి అభయము యిప్పింపుము అని కోరెను. జరిగినవిషయము తమకు మనవి చేసితిని. దీనిపై ప్రభు చిత్తానుసారముగా నడచుకొనెదను" అని దమనకుడు చెప్పెను.


పిం: మంత్రిసత్తమా! నీవు చాలా మంచిపని చేసితివి. నా మనస్సులో ఉన్నమాటను గ్రహించి దానికి అనుకూలముగానే బదులుచెప్పితివి. ఆ వృషభమునకు అభయ ప్రదానము చేసితిని. నాకుకూడా దానినుండి అభయము నిప్పించి వెంటనే నావద్దకు దానిని తీసుకొనిరమ్ము.

అదివినిదమనకుడు నమస్కరించి సంజీవకుని వద్దకు పోవుచు "ఆహా! ప్రభువు అనుగ్రహమును సంపాదించితి. అతను నా వలలో పడెను. నాకంటె ధన్యుడులేడు." అని తలచి సంజీవకునివద్దకు పోయి వినయముతో "మిత్రమా? నీకు అభయము యిచ్చుటకు మా ప్రభువు అంగీకరించెను. కనుక నిశ్చింతగా అతని వద్దకు రమ్ము. కాని నీవు రాజానుగ్రహముపొందిన తర్వాత నాతో కలిసిమెలిసి ఉండవలెను. నీవు అధికార గర్వముచే మెలగకూడదు. నేనుకూడ నీతో సంప్రదించి నా మంత్రిపదవి నిర్వహించెదను. మన మిరువురము పరస్పర స్నేహముతో గడిపి మెలగుచు రాజ్యలక్ష్మిని అనుభవింతము. నన్ను నీచ మృగముగా తలచకూడదు. గర్వముచేత ఎవరు ఉత్తమ, మధ్యమ, అధములను ఆదరించడో అట్టివాడు రాజానుగ్రహముకు పాత్రుడైనను నాశనమును చెందును. పూర్వము దంతిలుడు అనువాడు యిట్లే నశించెను."

సం: ఆ కథ చెప్పుము.

దమ: ఈ విధముగా అతను చెప్పెను:

(సశేషము)



సీరియల్ నవల

అనుభవం

కొడవటిగంటి కుటుంబరావు

3

చిదానందందగ్గిరనుంచీ ఉత్తరం వచ్చింది. వాడు అనుకున్నంతపనీ చేశాడు. మెడికల్ కాలేజీలో చేరాడు. వైజాగ్ పరిసరాలన్నీ తిరిగాట్ట; తెగ వర్ణించాడు. నా విషయం తెలపమని రాశాడు.

ఆ కిందటిరోజే నేను కాలేజీలో చేరాను. చిదానందం ఉత్తరం చూడగానే నాకు రాఘవరావుగారింటిగది గుర్తుకొచ్చింది. ఆగది మాట్లాడతానని డాక్టరుగారితో ఎట్లా చెప్పాలో తెలియలేదు. మాట్లాడకుండా ఊరుకోవటం ఎంతమాత్రమూ బాగుండదనిపించింది. డాక్టరుగారింటిగది సొంతం చేసుకోవటమేకాదు, రెండుపూటలా భోజనం కూడా చేస్తున్నాను.

నాతకాకుండా, పీక్లనములుతూ, "డాక్టరుగారూ, నేనింకా గది చూసుకోవటం మర్యాదగా ఉంటుందికాదూ? కాలేజీలో చేరానాయె. ఆ రాఘవరావుగారింట్లో గది సరాయివాళ్ళ కివ్వరనుకోండి — నాకైతే ఇవ్వొచ్చనుకుంటాను," అన్నాను.

"ఏం, నాయనా? ఇంటిగది ఏమి బాగాలేదా?'' అన్నది డాక్టరుగారిభార్య.

"బాగా లేకపోవట మేమిటండీ? అద్దె ఎంతో చెప్పండి. డాక్టరుగారిచేత పుస్తకాలు చదివించుకుని వినటం నాకేమన్నా చేదనుకున్నారా?'' అన్నాను.

"ఇదుగో, సూర్యం. నీ అంతరాత్మకు శాంతికలిగే పక్షంలో నీ కిష్టమైనంత అద్దె ఇచ్చి ఇక్కడే ఉండిపో. ఏ న్నడిగేవాళ్లెవరూలేరు. భోజనంకూడా ఇక్కడేచెయ్యి, నీ కిష్టమైనవి అడిగి చేయించుకుంటే మా ఆవిడ సంతోషిస్తుందికూడానూ. గెస్టుగా ఉండటం బాధైతే పేయింగ్‌గెస్టుగా ఉండు. మే మంతా కంపెనీకోసం వాచిపోతున్న వాళ్ళమే. అదీ అసలుసంగతి.''

"నా కభ్యంతరం లేదు," అన్నాను. నెల కో ముప్పైరూపాయలు డాక్టరుగారికి, కాదు, సుందరమ్మ గారికి ఇద్దామని నా మనస్సులో అనుకున్నాను. హోటలుకూ, గదికీ కలిపి అంతకన్న ఎక్కువకాదు—కాస్త తక్కువే అవుతుందికూడానూ.

డాక్టరుగారింట మతంలేదు, దేవుడులేడు, పూజలులేవు, పండగలులేవు, పర్వాలులేవు. డాక్టరుగారు ఖద్దరు కట్టకపోయినా, మిల్లుబట్టలు కట్టేవాడు కాడు, ఆయనబ్రాండు చేనేతబట్టలు. ఆడవాళ్ళిద్దరూ మిల్లుచీరెలు కట్టేవాళ్ల. వాళ్ళిద్దరికీ కలిపి చిన్నమెత్తు బంగారంలేదు. వాళ్ళింట పౌడర్లుగాని, స్నోలుగాని, క్రీములుగాని లేవు. స్నానానికి సబ్బుమాత్రం వాడేవాళ్ళు. టూత్‌పేస్టు వాడేవాళ్లుకారు; కచ్చిక వాడేవాళ్ళు. డాక్టరుగారు వేపపుల్లతో పళ్ళు తోముకునేవాడు.

ముగ్గురిలోకీ మాట్లాడాలని సరదా ఉన్న వాడు డాక్టరుగారే. అదైనా భార్యతోనూ, కూతురితోనూ కాదు, నాబోటివాళ్ళతో. ఆ కుటుంబాన్ని రోజురోజూ చూస్తుంటే వాళ్ళు, తేనెటీగల్లాగా, కొద్దిసంజ్ఞలతో ఒకరినొకరు అర్థంచేసుకున్నట్టు కనపడేవాళ్ళు. అది నాకు కాస్త వింతగానేఉండేది.

నేను వాళ్ళింట్లో గమనించిన వింత ఏమిటంటే, ఆఫీసుకు వెళ్లేవాళ్లెవరూ లేకపోయినా ముగ్గురి దినచర్యా గడియారంలాగా జరిగిపోయేది. ఆవిద్య నాకు తెలియకపోవటంచేత నేను మొదట్లో వాళ్ళ పనులకు అడ్డంవచ్చిఉంటాలి. ఒంటిగంటి రామలింగంలాగా జీవిస్తూ వచ్చానేమో, నా యిష్టం వచ్చినప్పుడు నిద్రలేవటమూ, ఇష్టం వచ్చినప్పుడు గడ్డం గీక్కోవటమూ, స్నానం చెయ్యటమూ చేసేవాణ్ణి. హోటల్లో భోజనంచేసి కాలేజీకి బయలుదేరటం ఒక్కటే గడియారానికి కట్టుబడి చేసేవాణ్ణి.

ఒకరోజు నర్సు నా గదిలోకి వచ్చి ఏదో పట్టుకుపోయింది. నేను పరధ్యానంగా ఉండి గమనించలేదు. ఆ అమ్మాయి నా షేవింగ్ కప్పులో వేడినీళ్ళుతెచ్చి, "మీ షేవ్‌కు నీళ్ళు. నేను స్నానం చెయ్యబోతున్నాను. పావుగంటదాకా బయటికిరాను. మీ షేవు ఆలస్యమైపోవచ్చు," అని వెళ్ళిపోయింది.

ఆ ఒక్క అనుభవంతోనూ నేను క్రమబద్ధంగా ప్రవర్తించటం నేర్చుకున్నాను. ఉదయం కనువూడ్చే చప్పుడుకు నిద్రలేవటం లగాయతు కాలేజీకి బయలుదేరినదాకా నేను చేసే మూడు నాలుగుపనులూ ఇంటివాళ్ళ కడ్డం రాకుండా చూసుకోవటం అలవర్చుకున్నాను.

నర్సు థోర్డుఫారం పాసయి ఫిఫ్తుఫారంలో చేరింది. థోర్డుఫారంలో ఆమెకు అయిదో రాంక్ వచ్చిందని విని ఆశ్చర్యపడ్డాను. తెలివిగలదై ఉండాలి.

కాలేజీలో చేరగానే మా బావకూ, బాబాయికీ ఉత్తరాలు రాశాను. మా బావ ఉత్తరాలు రాయడు. మా బాబాయి నా ఉత్తరం

అందిన పది పన్నెండు రోజులకు తన బావమరిది శ్రీనివాసరావు పెళ్ళి ఖాయమైనట్టు రాశాడు. తరవాత కొద్దిరోజులకే శుభలేఖ కూడా వచ్చింది.

నాకు శుభలేఖ వచ్చిననాడే డాక్టరుగారికి ఎవరో వచ్చి ఒక పెళ్ళిశుభలేఖ ఇచ్చి వెళ్లారు. అదీ శ్రీనివాసరావు పెళ్ళి శుభలేఖే; కాని పెళ్ళికూతురువాళ్ళ తరపున వచ్చింది.

"భేష్, భేష్! మనం బంధువులమవుతున్నామన్నమాట. పెళ్ళికొడుకు నీకేం కావాలి? మీ బాబాయి బావమరిదా? పెళ్ళికూతురు నాకు పెత్తండ్రి మనమరాలు — కూతురి కూతురు." అన్నాడు డాక్టరుగారు.

"వాళ్ళ దీ వూరేనా?"

"కాదుగాని, మా పెత్తండ్రిగారల్లుడిక్కడే. డిస్ట్రిక్టు కోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు.''

"మరి వాళ్లెప్పుడూ వచ్చినట్టు కనబడరే?''

"ఎక్కడో అగ్రహారంలో ఉంటారు. వాళ్ళు నన్ను వెలివెయ్యలేదులే. ఎప్పుడైనా చూడవస్తారు — కాని మా ఇంట పచ్చిమంచినీళ్ళుకూడా తాగరు. కులం చెడతామని భయం! ఎన్నిభయాలూ లేకుండా ఈ జీవితాలు వెళ్ళమారుతాయా?''

"మిమ్మల్ని పెళ్ళికి ఆహ్వానిస్తున్నారే! వాళ్ళింటో మీరు మంచినీళ్లు తాగొచ్చునేమో!''

"పిలిచినా రానన్నధైర్యంతో పిలిచి ఉంటారు.'' అందులో ఏదో హాస్యం ఉన్నట్టు డాక్టరుగారు నవ్వుకున్నాడు. నాకు మాత్రం చాలా కోపంగా ఉంది.

పెళ్ళికి కొద్దిరోజులముందరే నేనొక పాడుపని చేశాను. అది పాడుపని అవుతుందని నాకు తట్టనుకూడాలేదు. నాకోసం కొత్తసబ్బూ, టూత్‌బ్రషూ కొనుక్కుంటూ కళ్ళకు కొట్టవచ్చినట్టు ఎదురుగా కనిపిస్తే, నర్సుకోసం పాండ్స్ వానిషింగ్ క్రీమ్ కొన్నాను.

నర్సు దాన్ని తీసుకోననేసింది.

"క్రీములు పూసుకోకూడదని నియమమా?" అన్నాను, కొంచెంగానొచ్చుకుని.

"ఆరకం వస్తువులకింద ఖర్చుచెయ్యటం అలవాటులేదు. అవి అవసరమైన వస్తువుల కిందికిరావు." అన్నది నర్సు.


"ఖర్చు చేసింది నేనుగా?" అన్నాను, ఫూల్‌లాగా.

"ఫరవాలేదు, తీసుకోమ్మా." అన్నాడు డాక్టరుగారు. ఆయన కంఠస్వరం నాకు సుముఖంగాలేదు.

నర్సు తీసుకున్నది. కాని ఆమె దాన్ని వాడదని నేనప్పుడే అనుకున్నాను. నా ఊహ తప్పుకాలేదు.

ఇప్పుడు వెనకతిరిగి చూసుకుంటే నేను నర్సుకా క్రీమ్ ఎందు కిచ్చానో అర్థమవుతున్నది. ఆడవాళ్లూ, ఆడతనమూ, ఆడ అందమూ అనేవి నా మానసిక జీవితంలో క్రమంగా ప్రాముఖ్యం సంపాదించుకుంటున్నాయి. నేను చేసే ఇతర ఆలోచనలతోనూ, చదువుతోనూ అతి పోటీచేసి నాకు కొంత నష్టంకూడా కలిగిస్తున్నాయి. నాకు నిత్యమూ కనిపించే ఆడవాళ్ళిద్దరూ మరి కాస్త 'ఆడ'గా ఉండాలని నా మనసులో ఒక కోరిక ఉండిఉండాలి. నేనా క్రీము అచ్చగా నర్సుకోసమే కొనలేదు; తల్లీ కూతుళ్ళిద్దరూ దానిని పూసుకోవాలనే నా ఉద్దేశం.

నేనెంతో అభిమానంతో తెచ్చిన క్రీమును వాళ్ళు తృణీకరించటం నాకు అవమానమే అయింది. ఆ రోషంలో నాకు వాళ్ళ ప్రవర్తన మరింత అసహ్యంగా కనబడింది. పైకి చూడటానికి వాళ్ళు సంస్కా



రులు, సంఘ నియమాచారాలను తుస్కారించినవాళ్ళు! కాని వీళ్ళ కింకోరకం మడీ, మైలా ఉన్నాయి! స్నానం చేశాక దమ్మిడీ ఎత్తు క్రీమ్ తీసుకుని మొహానికి పూసుకుని, అరదమ్మిడీ ఎత్తు పౌడరు ఫామకుంటే మైలపడిపోతారు! అంటే వాళ్ళ దృష్టిలో క్రీములూ, పౌడర్లూ ఉపయోగించేవాళ్ళందరూ హీనులేనా? అలాటివారు ఇతరుల మూఢ విశ్వాసాలను ఏమని తప్పు పడతారూ?

పోనీ, దుర్వ్యయమని వాళ్ళు అలంకరణ సాధనాలు ఉపయోగించుకోకపోతే నాకేమీ అక్షేపణ ఉండదు. గుడిసెల్లోవాళ్ళు క్రీము లుపయోగించ రని నే నాక్షేపిస్తానా? నేను కొంటే వాళ్ళ కేం డబ్బుఖర్చా? నా క్రీము ఉపయోగించకపోవటంలో గల ప్రిన్సిపుల్ ఏమిటి?

నేను లోలోపల అవమానంతోనూ, కోపంతోనూ కుమిలిపోయాను. నా స్థితి ఇంట్లో అందరూ గమనించి ఉండాలి. నేను క్రీము తెచ్చిన మర్నాడు గాక, మూడో రోజు సాయంకాలంఆయన నన్ను పాకలోకి పిలిచి కూర్చోమన్నాడు. ఆయన చేతిలో భాసనాటకా లున్నాయి.

"చారుదత్తం గురించి ఆలోచిస్తున్నాను!" అన్నా డాయన.

"మంచి నాటకం. పూర్తిగా ఉంటే ఎంత బాగుండేదో?" అన్నాను.

"నే నాలోచిస్తున్నది మనిషిలో ఉండే స్పిరిట్ గురించి. చారుదత్తంలో మైత్రేయుడు, చూడూ, తన స్నేహితుణ్ణి గురించి వసంతసేనతో అబద్ధ మాడేస్తాడు. నీ నగను నా స్నేహితుడు జూదమాడి పోగొట్టుకున్నా డంటాడు; దొంగ ఎత్తుకుపోయినట్టు చెప్పడు! ఎందుకు? ఆలోచించిన కొద్దీ ఆ బ్రాహ్మడి ప్రవర్తనలో ఏవేవో లోతులు కనిపిస్తున్నాయి. వసంతసేన హారాన్ని దొంగవా డెత్తుకుపోవటానికి కారణం చారుదత్తుడి దారిద్ర్యం. అతను మంచిఇంట ఉంటే దొంగ కన్నం వేసి సులువుగా ప్రవేశించలేడు. విలువైన నగలతో జూదం ఆడటం ధనికుల లక్షణం. తన మిత్రుడైన చారుదత్తుడిలో దరిద్రుడి లక్షణం చూపలేక ధనికుడి లక్షణం చూపుదామనా? చారుదత్తుడి భార్య ఉదారంగా తన ముత్యాలహారం ఇచ్చేసింది – వేశ్య కిచ్చెయ్యమని. అందుకు మైత్రేయుడి కడుపులో తన మిత్రుడిపైన మైత్రీ సంబంధమైన మంట రేగుతున్నదా? లేక అతను వసంతసేనను పరీక్షిస్తున్నాడా? దొంగ లెత్తుకుపోయారంటే వసంతసేన చారుదత్తుడిపైన కనికరించి, పోయిన తన నగల విలువ పుచ్చుకోక పోవచ్చు. జూదంలో తన నగలు ఓడిపోయాడంటే ఆమెకు చారుదత్తుడిపైన జాలి ఉండ నవసరం లేదు. ఆమె కతనిపై నిజంగా ప్రేమే ఉంటే ముత్యాలహారం తీసుకోకూడదు. కాని వసంతసేన "అయ్యో, పాపం!" అని కూడా అనకుండా ముత్యాలహారం తీసుకుంటుంది. 'లంజబుద్ధి' అని మైత్రేయుడు తిట్టుకుంటాడు. మైత్రేయుడి స్పిరిట్ ఎంత చిత్రంగా చిత్రించాడో భాసుడు! వసంతసేన మటుకు? తన నగ దొంగ లెత్తుకుపోయిన సంగతి ఆమెకు తెలుసు. ఆ నగ ఆమె దగ్గిరికి చేరింది కూడా. అయినా మైత్రేయుడు చెప్పిన అబద్ధం నమ్మినట్టే ప్రవర్తిస్తుంది. ముత్యాలహారం పుచ్చుకుంటుంది. తనకు చారుదత్తుడిపైన పొంగి పొర్లే ప్రేమను మైత్రేయుడికి అణుమాత్రం కూడా తెలియనివ్వదు! హ్యూమన్ స్పిరిట్, సూర్యం. అది విలువలేని వజ్రంలాగా ధగధగ మెరుస్తుంది. ఒకరికి దిగ్భ్రమ కలిగించాలని కాదు మెరవటం– దాని స్వభావం. ఆ స్పిరిట్ ప్రభావంతో మనుషులు తమ ప్రవర్తనలోనూ, మాటలలోనూ, చర్యలలోనూ రకరకాల నిగ్రహాలు పాటిస్తారు...భాసుడిపాత్రలతోపోలుస్తున్నాననుకోక, మావాళ్ళు క్రీములూ, పౌడర్లూ వాడకపోవటంలోకూడా ఏదో ఒక వింత స్పిరిటున్నది. వాళ్ళు లిప్‌స్టిక్ వేసుకున్నా నే నభ్యంతరం చెప్పను. కాని నా వైఫ్‌కు కొన్ని కొన్ని పడవు. కొన్ని కొన్ని పనులు చేస్తే ఆవిడ స్పిరిట్ దెబ్బ తింటుంది. సిల్కు చీరెలు కట్టదు. కట్టకపోవటంలో నీతి ఉందనీ కాదు, గొప్పతనం ఉందనీ కాదు. సిల్కుచీరెలు కట్టేవాళ్ళను గురించి తక్కువగా అనుకుంటుం దనీ కాదు. మనం సిగరేట్లు కాల్చేవా ళ్ళందర్నీ తక్కువచేసి చూస్తామా? అది పాప మనుకుంటున్నామా?...

ఆ రాత్రి నాకు చాలా సేపు నిద్రపట్టలేదు. నే నింత ఇగోసెంట్రిక్‌గా ఎందుకుంటున్నాను? ఏం చూసుకుని నా కీ అహంభావం? ఇతరులు నాలాగా లేనప్పుడూ, నా ఉద్దేశాలకు సూటిగా నడుచుకోనప్పుడూ నా కేదో అవమానమైపోయినట్టు ఎందుకనుకుంటానూ? డాక్టరుగారివంటి మనిషి పక్కనే ఉండబట్టి గానీ, లేకపోతే నే నిట్లా ఉన్నా ననికూడా నాకు తెలీదు గద!

నా గొడవలో పడి ఆలోచించు కోవటంలో నాకు భాసుడి రచనా నైపుణ్యం గురించి తలుచుకుని ఆనందించాలని కూడా తట్టలేదు. అదికూడా ఇగోసెంట్రిసిజమే! దాన్నిగురించి పశ్చాత్తాపపడటంలో కూడా అదే ప్రదర్శిస్తున్నాను. నా పశ్చాత్తాపం నిజమైతే, బుద్ధి తెచ్చుకుని నిశ్చింతగా నిద్రపోయేవాణ్ణేనేమో! కాని అహంభావం అంత సులువుగా చచ్చేదికాదు. మంచి నశించినంత తేలికగా చెడు నశించదు. దేవతల కన్న రాక్షసు లెప్పుడూ బలవంతులే. అందుకే యూరపులో ముసోలినీ హిట్లర్లు విజృంభిస్తున్నారు. ప్రపంచ నాగరికతకంతకీ పునాది అనుకున్న పాశ్చాత్య సంస్కృతి దగ్ధమైపోతున్నది ...

పెళ్ళిరోజు వచ్చేసింది. లగ్నం రాత్రి తొమ్మిది ప్రాంతాల. మధ్యాన్నంనుంచీ కాలేజీ ఎగగొట్టి పెళ్ళివారి విడిదికి వెళ్లాను. పెళ్ళి పెద్ద మా బాబాయే. చుట్టా లెక్కువమంది రాలేదు. కొలకలూరు స్టేషనుదగ్గిర బస్సు పట్టుకుని సులువుగా రావచ్చు. సుబ్బక్కా వాళ్ళుకూడా రాలేదు. వచ్చిన నలుగురూ మా పిన్నివైపు బంధువులే.

శ్రీనివాసరావును పెళ్ళికొడుకు చేసి ఉంచారు. లావుగా, పొట్టిగా, పొన్నకాయల్లే ఉండే శ్రీనివాసరావుకు పెళ్ళికొడుకు వేషం నప్పింది. అతను నన్ను కొంచెం కష్టపడి గుర్తించి, "ఎంతెత్తు ఎదిగిపోయావు!" అన్నాడు.

పెళ్ళివారికి ఉప్మా, కాఫీ వచ్చాయి. కాఫీచుక్కలు కడుపులో పడుతూనే మా బాబాయి పెళ్ళివారింటికి ఏదోపనిమీద పోతూ, తోడుగా నన్నుకూడా బయలు దేరదీశాడు. విడిది నుంచి పడమరగా వచ్చి పక్కవీధిలోకి తిరగగానే పెళ్ళివారిల్లు. ఇంటిచుట్టూ ఉన్న ఖాళీ స్థల మంతా పందిరి వేశారు. పందిట్లోకి అడుగు పెడుతుండగానే ఎవరో బాబాయిని పిలిచారు. ఆయన నన్ను స్వేచ్ఛగా వదిలేసి ఎటో వెళ్ళిపోయాడు. పెళ్ళివారిల్లు సందడిగానే ఉంది. కొంతమంది పనీ పాటా ఏమీ లేనట్టు విశ్రాంతి తీసుకుంటూ మందకొడిగా పడిఉన్నారు. మరికొందరు చీమల్లాగా తెగతిరుగుతున్నారు.

వరండాలో ఒక పెద్ద పేము పడకకుర్చీ వేసిఉన్నది. అందులో ఒక పెద్దసైజు వృద్ధుడు, చేతు లెత్తి నెత్తివెనక పెట్టుకుని, పడుకుని ఉన్నాడు. నే నాయనకు కొంచెం దూరంలో ఉన్న బల్లమీద కూర్చుని, అందరినీ గమనిస్తున్నాను. కళ్ళఎదటికి వచ్చిన ఆడవాళ్ళ వయసూ, పెళ్ళిఅయిన వాళ్ళూ, కానివాళ్ళూ, ఎంతమంది పిల్లలతల్లులూ ఇత్యాది విషయా లాలోచిస్తున్నాను.

ఇంతలో ఒక వంటబ్రాహ్మడులాంటి మనిషి ఒక పెద్ద మరచెంబులో కాఫీ కాబోలు తెచ్చి, "ఎవరన్నా మళ్ళీ కాఫీ తాగుతారా ? ఆఖరు ఛాన్సు." అన్నాడు. ఆయన నన్ను కాఫీ తాగుతావా అని అడిగాడు. తాగ నన్నాను. కుర్చీలో పడుకుని సమాధిలో ఉన్న ముసలాయన దగ్గిరికి వెళ్ళి, "ఏం, బాబూ, నరిసింహం పంతులుగారూ? ఒక్కగ్లాసు కాఫీ పుచ్చుకోండి," అంటూ మరచెంబు మూత తీసి, అందులోనుంచే ఒక గ్లాసుతీసి, అందులో కాఫీ పోసి, ఇవ్వబోయాడు.

"నేను కాఫీ తాగాను," అన్నాడు ముసలాయన నిశ్చింతగా.

"కాఫీ తాగననరాదు; పుచ్చుకోండి."

"కాఫీ తాగననరాదూ? ఎందుకనరాదూ? నే చెబుతున్నాను – అనొచ్చు."

నరిసింహం? విన్నపేరు. ముసలాడిలో కుర్రాడి మకురుతనం ఉన్నది. ఈ ముసలాడికి శరీరం ఒక పద్ధతిలో పెరిగింది. మనస్సు మరో పద్ధతిలో పెరిగింది. డెబ్భై దాటి ఉండాలి. ఏడేళ్ళ కుర్రాడి బుద్ధులు... నరిసింహం! గుడ్ గాడ్!

"ఏమండీ, డాక్టరు కనకసుందరావు గారు మీ కేమన్నా అవుతారా?'' అన్నాను.

ఆయన తలపక్కకి తిప్పి, నన్ను కొరకొరా చూసి, "ఎందుకూ?" అన్నాడు.

"ఆయన తండ్రిగారిపేరూ మీ పేరూ ఒకటే నన్నట్టు జ్ఞాపకం".

తనకు కావలిసిం దదే నన్నట్టుగా ఆయన మళ్ళా సమాధిలో పడ్డాడు. నే నడిగిన మాటకు సమాధానం చెప్పటం ఆయన కవసరంగా తోచినట్టు లేదు.

"డాక్టరుగారి తండ్రిగారు చాలా విరసమైన మనిషి అని విన్నాను. అందుచేత మీరై ఉండరు," అన్నాను.

ముసలాయన తేలుకుట్టినట్టు కుర్చీలో లేచి కూర్చుని, "నే నంటే నీకు వేళాకోళంగా ఉందా? ఎవ రసలునువ్వు? ఇక్కడ ఏం చేస్తున్నావు?" అన్నాడు తీవ్రంగా.

"నేను పెళ్ళికొడుకు బావగారి అన్నకొడుకును. డాక్టరుగారింటో అద్దె కుంటున్నాను. రెండువైపులవారి ఆహ్వానాలూ అందాయి. పిల్ల తరఫువాళ్ళు డాక్టరుగారిని వెలేసినట్టు లేదు: అయినా డాక్టరుగారు రావటంలేదులెండి. తాను వస్తే కొందరు విస్తళ్ళముందునుంచి లేచిపోతారని ఆయన అనుమానం. ఆయన చట్టవిరుద్ధమైన పనులేమీ చెయ్యలేదు, చూడండీ! హంతకులను కాపాడేవాళ్ళు ఆయన పంక్తిని ఎట్లా భోంచేస్తారు? మీరే చెప్పండి!" అన్నాను.

పైకి నిర్వికారంగా మాట్లాడా ననుకుంటాను. లోపలమాత్రం ఆ ముసలాడిమీద మండిపోతున్నది.

ముసలాయనమాత్రం నిర్వికారంగా ఉండలేకపోయాడు. మొహం జేవురించింది. పెదిమలు వణికాయి. ఆయన నన్ను వెలివేసేసి సమాధిలోకి వెళ్ళిపోయాడు.

ఇంకా ఆయనను కెలకాలనిపించింది గాని, పెద్దవాడు, ఇచ్చిన డోసు చాల్లెమ్మనుకున్నాను. ఈ బుల్లిబుల్లి హిట్లర్లకు అడపాదడపా పడవలసినట్టు డోసులు పడుతూండకపోతే మితిమీరిపోయి వాతావరణంకలుషితం చేస్తారు.

నేను కూర్చున్న బల్లమీదినుంచి లేచి, వరండాముందు పందిట్లోకి వచ్చాను. తాటాకుల వాసనా, ఈతాకుల వాసనా, ఎక్కడినుంచో వస్తున్న ఊదువత్తుల వాసనా అనుభవిస్తూ అటూ ఇటూ తిరిగాను. బాబాయి ఏం చేస్తున్నాడో ఎవరితో మాట్లాడుతున్నాడో అంతు చిక్కలేదు.

"ఇదుగో, ఏమోయ్! విన్నే! ఇలారా ఓసారి!"

క్రిమినలుగారు పిలుస్తున్నారు. నే నన్న మాటలకు పగ తీర్చుకునే లాపాయింట్లాలోచించి ఉంటాడు. ఎంతచెడ్డా, పేరుమోసిన లాయరుగద.

మళ్ళీ వరండాలోకి వెళ్లాను.

"ఆ బెంచీ దగ్గిరిగా ఈడ్చి కూచో."

కూర్చున్నాను.

''నువ్వా ఇంట్లో ఎంతకాలమై ఉంటున్నావు ?''

ఏ ఇల్లని అడగలేదు; నెల రోజులుగా ఉంటున్నానని చెప్పాను.

"గది అద్దెకు తీసుకున్నావా ?''

"గది తీసుకోవట మేమిటిలెండి: పేయింగ్ గెస్టులాటి ఏర్పాటు. భోజనం కూడా అక్కడే. హోటల్లో బొత్తిగా మాలకూడే గదండీ? అందుచేత కొంచెంశుచిగా–''

నామీదకోపం తెచ్చుకోవాలా, వద్దా

అన్నట్టు ముసలాయన నాకేసిచూసి, నన్ను క్షమించేసి. "పిల్ల పెద్దదై ఉంటుంది. నేను దాన్ని ఎన్నడూ చూడలేదు." అన్నాడు.

"ఏపిల్లండీ?'' అన్నాను అమాయికంగా.

"బుర్ర పని చెయ్యటంలేదా ఏమిటి? నా మనవరాల్ని గురించి మాట్లాడుతున్నాను!" అన్నాడాయన కసురుగా. ''దానికి వాళ్ళమ్మపేరు పెట్టుకున్నాట్ట".

''వాళ్ళమ్మపేరు నాకు తెలీదండీ! పిల్లను నర్సు అని పిలుస్తారు''.

''నర్సు! దేనర్సూ. నైట్‌నర్సూనూ! వెధవ్వేషాలు!'' ముసలాయన కాస్సేపు నణిగి. చివరకు. ''దాని నాయనమ్మ పేరు నరసమ్మ. ఆడపిల్ల కనకతనతల్లిపేరు పెట్టుకున్నాడు. మగపిల్లవాడైతే నాపేరు పెట్టుకుని ఉండడు.'' అన్నాడు.

''నర్సంటే నరసింహమ్మేమోనండీ? ఒకవేళ పిల్లకు మీ పేరే పెట్టుకున్నారేమో?" అన్నాను.

పెద్దబాతు (గూస్) కావద్దని ఆయన నన్ను మందలించాడు ఇంగ్లీషులో — పెద్దవాళ్ళు సంస్కృతంలో దీవించినట్లు.

"తిట్లకి ఇంగ్లీషూ, దీవించటానికి సంస్కృతమూనూ. తెలుగు కూరలు బేరం చేయటానికీ దానికీతప్ప దేనికీ పనికిరాదు," అని నేను పైకే అనేసినట్టున్నాను.

''ఏమిటదీ?" అన్నాడాయన.

''ఏమీలేదండీ; స్వగతం."

"అదెలా వుంటుంది?" అన్నాడాయన కాస్సేపుండి.

''ఏదండీ?" అన్నాను, పరధ్యానం అభినయిస్తూ.

''అదే. నా మనవరాలు," అన్నాడాయన చిరాకుగా. తనని వెంటనే అర్థం చేసుకోకపోతే ఆయనకు అవమానం జరిగినట్టుంటుంది కాబోలు మరి.

''బాగానే ఉంటుందండీ. స్నోలూ అవీ పూసుకోదు. నగా నట్రా ఏమీలేదు. ఈ క్రైస్తవు లమ్మాయి లుంటారు, చూడండీ! అచ్చంగా అలా ఉంటుందండీ; మెళ్ళో ఒక క్రాసు తగిలించి, చేతిలో చిన్న బైబిలు పెడితే —''

ఆయన నా మాటలు వినిపించుకుంటున్నట్టులేదు.

''అప్రయోజకుడు! ఒక్క కూతురు — అరతులం బంగారంతో గాజులు చేయించి పెట్టలేడు! ఈ ముండమోపి నన్నూ నా ఆస్తినీ కాలదన్ని వేరుపోయాడు;'' అని ముసలాయిన గొణిగాడు.

''లాభంలేదండీ. మీరు చేయించి ఇచ్చినా ఆ అమ్మాయి పెట్టుకోదు కదండీ!" అన్నాను.

''పెట్టుకోదూ? నువు చూశావా ఏవిటి? నగలొద్దన్నఆడ దెక్కడన్నా ఉంటుందా!"

'నగలొల్లని నాతి గలదె పరికింపంగన్' అని ఆశుధారగా నాతలలోంచి పుట్టుకొచ్చింది. దాన్ని అదుపులో ఉంచి, "చూడండీ — పోనీ గదా అని నర్సు కొక క్రీమ్‌బుడ్డి కొనిచ్చానండీ. పూసుకోదు. క్రీములు పూసుకోరాదుట, నగలు పెట్టుకోరాదుట, సినిమాలు చూడరాదుట, పట్టుబట్టలు పనికిరావుట —" అంటూ వేళ్ళమీద లెక్క ప్రారంభించాను.

"ఏడవకపోయారు! దరిద్రపు వేషాలు! దారిద్ర్యాన్ని గ్లోరిఫై చెయ్యటం! ఛీ! ఛీ! తాను చెడ్డాడు, పిల్లనూ చెడగొట్టాడు," అన్నాడాయన.

"డాక్టరుగారి భార్యగారుకూడా ఇదే వరసండీ! ఆవిడ తల్లో పూలు పెట్టుకోదు!" అన్నాను.

''పూలూ, బొట్టూ ఏవని పెట్టుకుంటుంది? ఐదోతనం ఏడిస్తేగా?" అన్నాడాయన.

నాకు అరికాలిమంట నెత్తికొచ్చింది.

''మీ రావిణ్ణి ద్వేషించటం రైటే. ఆవిడకూ్కడా మీరంటే అంత ఘనమైన అభిప్రాయం లేదు," అన్నాను.

ముసలాయిన అగ్గయిపోయాడు.

''దాని అభిప్రాయం ఎవడిక్కావాలి! అది నా కెవతె?'' అని ఆయన గాండ్రించాడు.

''మీ మనవరాలి తల్లే గదండీ?'' అన్నాను.

ఆయన నాకు పెద్దరహస్యం చెబుతున్నవాడల్లే, ''నా మనవరా లెప్పటికైనా నావైపే వస్తుంది చూస్తూండు," అన్నాడు.

ఆయన కా మనవరాలిపైన ఏదో మమత ఉన్నట్టు నా కర్థమయింది.

నేను చప్పరించి, "చెప్పలేమండీ. నర్సు ముమ్మూర్తులా తండ్రేనండీ!'' అన్నాను.

ముసలాయన కళ్ళు మెరిశాయి; ''అలాగా? చెప్పవేం? వాడంతా వాళ్ళమ్మ పోలిక. అది ఎలాటిమనిషి! మనిషికాదు, దేవత! ఇన్నివేలమంది ఆడవాళ్ళను చూశాను; అటువంటి ఇల్లాలుండదు; రత్నంలాటి మనిషిని పోగొట్టుకున్నాను," అన్నాడాయన.

''డాక్టరుగారి భార్యకూడా అలాటి మనిషేనండీ. ఎంత అనుకూలంగా ఉంటుంది," అన్నాను.

ముసలాయన మొహం చిట్లించి, తల అడ్డంగా తిప్పుతూ, "నాకు దాని సంగతి చెప్పకు!" అని చీదరించుకున్నాడు.

"నే నందుకు చెప్పలేదండీ! తండ్రికొడుకు లిద్దరికీ అనుకూలవతులైన భార్యలు దొరకటం చిత్రమని చెప్పడానికి చెప్పాను".

"వాడికీ నాకూ సాపత్య మేమిటి? ఏ చచ్చినవాడి పెళ్లాన్నో తెచ్చి నేను చేసుకోలేదు!" అన్నాడాయన. ఆయన మాటలు వింటుంటే నాకు పెద్దపెట్టున రోగం చేస్తున్నట్టనిపించింది. ఆయనలో ఏదో "మనువు కాంప్లెక్స్" లాటి దున్నది. అటువంటివాడికి శాసనాధికారం ఇస్తే క్షణంలో ప్రపంచాన్ని ఒక కొలిక్కి తీసుకురాగలడు.

నేను లేచాను.

"ఒక్క క్షణం కూర్చో; వాళ్ళు పెళ్ళికి

రావటంలేదన్నావు కాదూ?

"నాకు స్పష్టంగా తెలీదు సుమండీ. రారేమో అనుకున్నాను. ఒక వేళ వస్తే రావచ్చు; వెలి అయిన వాళ్ళు, చూడండీ, తిరిగి నలుగురి మధ్యకూ వచ్చే అవకాశం దొరికితే సాధారణంగా వదిలిపెట్టరు."

ముసలాయన విసుక్కున్నాడు,

"వాళ్ళని వెలి ఎవరు వేశారు? ఒకరి నొకరు వెలివెయ్యటానికి చట్టం ఒప్పదు. తాను చేసింది వెధవపని గనక తనను లోకం వెలివేసిందని వాడనుకుంటే అనుకోనీ? దానికెవరు బాధ్యులు.

"అదీ నిజమేలెండి, వాళ్ళను రాత్రి లగ్గానికి తీసుకురమ్మంటారా?"

నన్ను ఆయన తన సీక్రెట్ ఏజెంటుగా వేసేసుకుని, "మిగిలినవాళ్ళ మాటెందుకులే. మా నరసమ్మను ఎలాగైనా తీసుకురా. ఏంలేదు, ఒకసారి చూద్దామని!" అన్నాడు.

"ఒక్కతే వస్తుందా? అయినా ట్రై చేస్తాం. కాని మీ రాకపోతే ఆశపెట్టుకో — అడుగో, మా బాబాయి. మళ్లీ కనిపిస్తాలెండి. శలవూ!" అంటూ వచ్చేశాను.

లగ్నం వేళకు తిరిగివస్తాననీ, రాత్రి భోజనాని కుంటాననీ మాట ఇచ్చినమీదట మా బాబాయి నన్నింటికి వెళ్ళరానిచ్చాడు.

"ఏమండీ, డాక్టరు గారూ? మీ నాన్నగారిని చూశాను. మీలాగా సన్నగా, చామన చాయగా ఉంటారనుకున్నాను. చాలా స్థూలమైన మనిషి, మంచి రంగు. తెల్లబడినా ఒత్తయిన జుట్టు. ఆయనతో చాలాసేపు మాట్లాడాను. పాపం, ఆయన ప్రాణం మనవరాలి నొకసారి చూడాలని మహా పీకుతున్నది. లగ్గానికి నర్సును తీసుకురమ్మని మరీమరీ చెప్పారు," అన్నాను.

నా మీద చూపవలిసిన ఆపేక్షకూడా నర్సుమీదే చూపుతున్నాడేమో," అన్నాడు డాక్టరుగారు.

"మీ నర్సు మీ అమ్మగారల్లే ఉంటుందని ఆయన ఊహించారు."

డాక్టరుగా రాశ్చర్యపడి," ఎవరో చెప్పి ఉంటా రాయనకు. అయినా ఆవిడ ఏనాడో పోయిందిగదా. ఆవిణ్ణి ఎరిగి, ఆయనతో చెప్పేవా ళ్లెవరుంటా రబ్బా?" అన్నాడు.

"మీరు దొంకంతా తిరుగున్నారు. నర్సు మీ పోలికే నని నేనే చెప్పాను. మీ రంతా మీ అమ్మగారి పోలికేట."

"నర్సు నా పోలికని ఆయనతో ఎందుకు చెప్పాలి నొచ్చిందీ?"

"నా మనవరా లెట్లా ఉంటుందని ఆయన గుచ్చిగుచ్చి అడుగుతుంటే, వర్ణించే శక్తి లేక సులువుగా, మీలాగే ఉంటుందని చెప్పేశాను."

డాక్టరుగారు కొంచెంసే పింకేదో ఆలోచించి, "నిజానికి మా అమ్మ పోలికలు నాలోకన్న నర్సులోనే ఒక పిసరు జాస్తి. ఒకవేళ నే నాడదాన్నయితే అచ్చు నర్సులాగే ఉండే వాణ్ణేమో!" అన్నాడు.

"ఆయన, పాపం, ఇప్పటికీ మీ అమ్మగారిని మరిచిపోలేదు. అటువంటి ఇల్లాలెక్కడా ఉండ దన్నారు."

"కాదా మరి. బతకని బిడ్డ బారెడుట! నీవంటి ఇల్లాలు ఎక్కడ ఉండదని ఆవిడతో ఒక్కసారి ఆయన అనిఉంటే ఎంత సంతోషించేదో!" అన్నాడు డాక్టరుగారు బిటర్‌గా,

"ఏమండో వ్, సుందరమ్మగారూ? మిమ్మల్ని గురించీ సందర్భవశాత్తూ ఒక్క అబద్ధం ఆడేశాను. చేసిన పాపం చెబితే పోతుంది. ఆయనంటే మీకు పరమ అసహ్యమని చెప్పేశాను."

సుందరమ్మగారు నవ్వుతూ, "అందులో అబద్ధ మేమీ లేదులే. ఆయనలాగా నా అసహ్యాలను పొదుగుతూ కూర్చో నన్నమాటేగాని, నా కాయనంటే అసహ్యమే. ఆయనతో ముఖాముఖీ ఒక్కసారే మాట్లాడాను. జన్మకంతకీ సరిపోయినంత రోత పుట్టించారు," అన్నది,

"అది సహజమేలే, సుందరం. తనపైన తనకు అసహ్యం ఉన్న మనిషే ఇతరులకూ కూడా రోతపుట్టిస్తాడు. మా నాన్న వంటివాడు తనను చూసి తాను రోతపడకుండా ఉండటం సాధ్యంకాదు," అన్నాడు డాక్టరుగారు.

"ఏం, నర్సమ్మా? మీ తాతను చూడ వస్తావా?" అన్నాను.

"రాను," అన్నది నర్సు.

"ని న్నొక్కసారి చూడాలని చాలా తహతహ లాడుతున్నాడు. ఒక్కసారి కనిపిస్తే నేమిటి? ఆపాటి భూతదయ ఉండాలి. నా కాయనంటే ఏమీ మంచి అభిప్రాయం లేదు. కాని ఆయన కోరిక నిజమైనది. నాకే జాలేసిందంటే నమ్ము," అన్నాను.

డాక్టరుగారింట దేన్ని గురించీ దీర్ఘంగా చర్చలు జరగటం నే నెరగను. కొన్ని విషయాలలో డాక్టర్‌గారు చెప్పినది వేదవాక్యంగా వుంటుంది. మిగిలిన విషయాలలో సుందరమ్మగారి నిర్ణయాలకు తిరుగుండదు. అటువంటప్పుడు చర్చల కవకాశమేముంటుందీ?

కాని నర్సు నావెంట లగ్నానికి వచ్చి తాతగారికి కనిపించటం గురించి చాలాసేపు చర్చ జరిగింది. నర్సు తన తాతగారికి కనిపించటం మంచిదని నేను కాస్త పట్టుదలగానే వాదించాను. ఆయనను ఇంకేవిధంగా నన్నా సాధించవచ్చుగాని, ఈ విధంగా సాధించవద్దన్నాను. నా పట్టుదలవల్లనైతే నేం, డాక్టరుగారు తగినంత పట్టుదల చూపకపోవటంవల్లనైతేనేం, నర్సును నావెంట పంపటానికే నిర్ణయం జరిగింది.

"బయలుదేరు మరి. డ్రెస్ చేసుకో అప్పుడే ఎనిమిది దాటింది," అని నేను నర్సును తొందరచేశాను.

"డ్రెస్ చేసుకునే ఉన్నాను. రెడీయే." అన్నది నర్సు.

నరిసింహం పంతులుగారు అదే వరండాలో, అదే పేముకుర్చీలో, అవే చేతులు అదే నెత్తికింద పెట్టుకునిఉన్నాడు.

"ఇదుగోనండీ. మీ మనవరాలూ, నర్సూ. వీరు మీ తాతగారు." అన్నాను.

ముసలాయన కష్టపడి కుర్చీలో లేచి కూర్చుని మెరిసే కళ్ళతో నర్సుకేసి చాలాసేపు చూశాడు. చూడ్డమనేది ఎంత చచ్చు

మాటో నాకా క్షణంలో అర్థమయింది. కళ్ళతో ఒక మనిషిని తాగెయ్యవచ్చు.

"రా, తల్లీ," అంటూ ఆయన నర్సు చెయ్యి పట్టుకుని దగ్గిరికి తీసుకుని, ఒళ్ళో కూర్చోబెట్టుకున్నాడు, తల నిమిరాడు; వీపు నిమిరాడు; చెక్కిళ్ళు నిమిరాడు.

ఈయన నాటకంలో పాత్రలాగా ప్రవర్తించబోతాడని తెలిస్తే నర్సును వెంట బెట్టుకు రాకనేపోదును.

"రాణివాసంగా ఉండవలసినదానివి మీ నాన్న ఇలాగా ఉంచాడు. నీ యీడున మీ నాయనమ్మ అపరలక్ష్మీదేవిలా గుండేది, తెలుసా ?" అన్నా డాయన. నర్సు బిడియంతో కుంగిపోయి తాతకేసి చూడనన్నా చూడకుండా ఉంది.

"ఏం చదువుతున్నావు తల్లీ ?"

నర్సు మాట్లాడలేదు.

"నాతో మాట్లాడొద్దని మీ నాన్న చెప్పి పంపించాడేమే ?"

"ఫిఫ్తుఫారం." అన్నది నర్సు, తల అడ్డంగా ఆడించి.

"నీకు మీ నాన్న పెళ్లెప్పుడు చేస్తాట్ట ! వాడి మొహం ! వాడు చేసే దేమిటి ? నీ పెళ్ళి నేను చేస్తానే ! చూ డెలా చేస్తానో !.... లక్ష్మీ ? ఓ వెంకట్లక్ష్మీ ?" గట్టిగా ఎత్తితే ఆయన గొంతుకు ఇల్లంతా దద్దరిల్లింది.

"ఏవిటి, తాతయ్యా ?" అంటూ ఒక పాతికేళ్ళ ఆడమనిషి వచ్చింది.

"నా మనవరాలే ! ఇదుగో ఈ తాళంచెవి తీసుకుని నా పెట్టె తెరిచి అందులో ఉన్న నగలన్నీ పెట్టి, గులాబీరంగు సిల్కుచీరె కట్టి, కాళ్ళకు పసుపూ పారాణీ పెట్టి, కల్యాణం బొట్టుపెట్టి మరీ తీసుకురా. నా మనవరాలు పెళ్ళికూతురైతే ఎలా ఉంటుందో చూసుకుని సంతోషిస్తాను. చూడూ, పిల్ల తలనిండా చక్కగా పూలుపెట్టు. అఁ ?"

నర్సు నాకేసి ప్రశ్నార్థకంగా చూసింది, భరించాలి, తప్పదన్నట్టు మొహం పెట్టి, వెళ్ళమన్నట్టు తల ఊపాను.

మరో పావుగంటకల్లా నర్సు గుర్తుపట్టరాకుండా మారిపోయి వెంకటలక్ష్మి వెంట తాతగారి దగ్గిరికి తిరిగివచ్చింది. నేను నర్సును చూసి స్టన్నయిపోయాను. ఆమె సినిమాలో వేషం లాగున్నది. మొహాని కింత క్రీము పూసుకోటానికే కంపరమెత్తే మనిషి, డ్రెస్సుచేయించుకుని, మెడకూ చేతులకూ, కాళ్ళకూ, నడుముకూ నగలు తగిలించుకుని, తలనిండా పూలు పెట్టుకుని, కాళ్ళకు పసుపూ పారాణీ పూయించుకుని ఎట్లా సహించిందో నా కర్థంకాలేదు. నర్సులో నాకేమీ చిరాకు కనిపించలేదు. ఆ మాటకు వస్తే ఆనందంకూడా కనిపించలేదు.

ఆముసలాయన తన్మయత్వంపొందుతూ, కాస్త పైత్యానపడ్డవాడల్లే, "ఆ హా హా ! నా తల్లి కెంత అందమే !...నా మనవరాలిని అందరూ వచ్చి చూడండ్రా !" అని గట్టిగా అన్నాడు. ఆయన కుర్చీలోనుంచి లేవటానికి యాతన పడుతుంటే, నేను రెక్క పట్టుకుని సహాయం చేశాను.

నాకు ప్రాచీన సంప్రదాయాలు జ్ఞాపకం వచ్చి, "నర్సూ, తాతగారి కాళ్ళకు నమస్కారం చెయ్యి," అన్నాను.

"నేను చెయ్యను," అన్నది నర్సు ఖచ్చితంగా.

"వద్దే, తల్లీ ! ఎందుకొచ్చిన నమస్కారాలు. కావలసింది ఆపేక్షలూ, అంతఃకరణలూనూ !" అంటూ ముసలాయన నర్సు భుజాలమీద చేతులువేసి ఆమె రెండు చెంపలూ ముద్దుపెట్టుకున్నాడు.

జనం మూగుతున్నారు. "పంతులుగారి మనవరాలు", "కనకసుందరం కూతురు," అనే మాటలు వినిపిస్తున్నాయి.

"ఇంక ఈవేషం విప్పవచ్చునా ?" అన్నది నర్సు.

"ఛీ ! ఛీ ! అదేవిటి తల్లీ, ఇది వేషం కాదు. నీ నగలు, నీ చీరె, ఎందుకు విప్పటం, ఉంచుకో. ఇంటికి పట్టుకుపో !" అన్నాడు ముసలాయన. ఆయన నాకేసి తిరిగి, "లగ్గాని కింకా ఇరవై నిమిషాలున్నది. మీ రిద్దరూ వెళ్ళి భోంచెయ్యకూడదూ. పందిట్లో వడ్డన జరుగుతున్నది," అన్నాడు.

"ఇవన్నీ తీసెయ్యకుండా ఎట్లా అన్నం తినటం ?" అన్నది నర్సు.

"వాటిసంగతి తరవాత చూద్దాం పద !" అంటూ నర్సును చెయ్యి పట్టుకుని బయటికి తీసుకుపోయాను, దారిలో ఆమెతో, "ఆయన ఎంతో ప్రేమతో ఇచ్చిన వస్తువులు. ఇంటికి పోయి తీసెయ్యవచ్చు. నీకు పెట్టుకోవటం ఇష్టం లేకపోతే మూటగట్టి ఏ అటకపైనో దాచెయ్యి. నే నిచ్చిన క్రీమ్ దాచేసినట్టు," అన్నాను.

ఇద్దరమూ ఇంటివెనక పందిట్లో వడ్డించి ఉన్న విస్తళ్ళముందు కూర్చుని భోజనం చేసేశాము. అది అనధికార పంక్తి. తినేవాళ్ళు తిని లేచిపోతున్నారు, వచ్చేవాళ్ళు వచ్చి విస్తళ్ళముందు కూర్చుంటున్నారు.

భోజనం పూర్తి చేసి, చేతులు కడుక్కునేటప్పుడు నర్సు, "మన మిక వెళ్ళవచ్చునా?" అన్నది.

"లగ్గం చూడకుండానా ?"

"ఈ వేషంతో అందరి మధ్యా కూర్చోనా ?" నే నిక్కడ ఒక్క క్షణం ఉండను. నే నా ముసలాయన్ని చూడటానికి వచ్చానుగాని, ముహూర్తం చూడటానికి రాలేదు," అన్నది నర్సు.

ఆమాట రైటేమరి. నేను మా బాబాయిని వెతికిపట్టుకుని, "బాబాయ్, నేను అర్జంటుగా ఇంటి కెళ్ళాలి, ముహూర్తానికి ఉన్నట్టే భావించుకో," అన్నాను.

బాబాయి నర్సుకేసి నోరుతెరుచుకుచూసి, "ఈ పెళ్ళికూతు రెక్కడ సంపాదించావురా ?" అన్నాడు.

"పిల్లతరపు బంధువు ఒక క్రిమినలున్నాడు, ముసలాయన. ఆయన మనవరాలు. ఈ పిల్ల నింటికి తీసుకుపోయేభారం నాది," అన్నాను.

తరవాత శ్రీనివాసరావు దగ్గిరికి వెళ్ళి: "ఏరా, మామా ? నీ పెళ్ళి లగ్నమూ, నా జన్మ నక్షత్రమూ షష్టాష్టకంలో ఉన్నాయట. నేను పోతున్నాను; నువు మాత్రం

కొంచెం జాగ్రత్తగా పెళ్ళి చేసుకో." అన్నాను. నా మాట లేమీ శ్రీనివాసరావు కర్థమైనట్టు లేవు. వాడు నర్సుకేసి వెర్రిగా చూశాడు. వాడు మరింత ఏడుచుకోగలందు లకు, నేను నర్సును చెయ్యి పట్టుకుని ఈడ్చు కుంటూ వచ్చి ఇవతల పడ్డాను.

నర్సును వెంటబెట్టుకుని రాత్రి తొమ్మిది గంటలవేళ కొంపకి క్షేమంగా చేరట మెట్లాగా అన్న సమస్య నన్ను వేధిస్తు న్నది. మే మిద్దరమూ వీధిలోకి అడుగు పెట్టుతుండగా చిన్న చిటాక్కా తట్టింది.

ముహూర్తానికి జనం వస్తున్నారు; ఎవరో జట్కాలోవచ్చి దిగి, బండివాడికి డబ్బు లిచ్చి లోపలికి వెళ్లారు. నేను జట్కా వాడితో ఏమీ అనకుండా నర్సును ఎక్కించి, వెనకగా నేనూ ఎక్కి, "సర్కిలిన్స్పెక్ట రుగా రింటికి తోలవోయ్," అన్నాను.

ఏం చెయ్యాలి? నర్సు ఒంటిపైన ఎంత లేదన్నా మూడు నాలుగు వేల రూపాయల బంగారపు నగలున్నాయి. జట్కా వాళ్ళను నమ్మటానికి లేదు. సర్కిలిన్స్పెక్టరుగా రిల్లు డాక్టరుగా రింటికి గట్టిగా మూప్పై గజాలు లేదు. డాక్టరుగా రిల్లు దాటితే గాని సర్కిలుగా రిల్లు రాదు.

జట్కావాడు మారు మాట్లాడకుండా బండి ఎక్కికూర్చుని గుర్రాన్ని అదిలించాడు.

దారిలో నర్సుతో, "ఇవన్నీ తగిలించు కుని నువ్వెట్లా ఉన్నావో నీ కేమైనా ఐడియా ఉందా?" అని అడిగాను.

"ఎందుకు లేదూ? ఆగదిలో నా ఎత్తు నిలువు టద్దం ఉంది. అందులో చూసు కున్నాను. ఎవరో లా గున్నాను" అన్నది నర్సు.

కొంచెం సేపుంది. "మీ తాతయ్యతో చెప్పకుండా వచ్చేశాం. ఆయన నీకోసం వెతు క్కుని చాలా బాధపడతాడు. నా నగలు తీసుకుని ఉడాయించిందని ఆయన కేసు పెడితే ఏం చేస్తావు?" అన్నాను.

"వెధవనగలు. ఆయనకు బంగీకట్టి పంపేద్దాం! పీడ! పీడ మనుషులు!" అన్నది నర్సు.

ఇంకొంచెం సేపుంది. "అందరూ నీకేసి ఎట్లా చూశారో గమనించావా?"

"సర్కసు జంతువును చూసినట్టు చూశారు.

"నేనుకూడా ఏమీ తక్కువ తినలేదులే. ఎవరు నీకేసి నోరుతెరుచుకు చూసినా, నేనుకూడా నీకేసి ఇంకోసారి చూసు కుంటూనే ఉన్నాను."

నర్సు బండిలోనే చేతినగలు తీయ ప్రయత్నించింది.

"ఇంటికివెళ్ళి తియ్యొచ్చు. ఈ చీకట్లో బండిలో ఏదన్నా పడిపోయిందంటే దక్కదు." అని నర్సును వారించాను.

మొత్తంమీద ముసలాయన ప్రవర్తన నా కర్థంకాలేదు. ఆయన తన భార్యనగలూ చీరెలూ అవీ వెంటతెచ్చి ఉండాలి. వాటిని తన మనవరాలి కివ్వటానికి ముందుగానే నిశ్చయించి ఉండాలి. ఆయన ఆపని ఏ విధంగా చేద్దామనుకున్నాడు? నేను తటస్థ పడటం కేవలమూ దైవికం. అంతకంటే ముఖ్యమైన ప్రశ్న ఈ వయసులో ఆయనకు మనవరాలిపైన ఎందుకు మనసు మళ్ళింది? ఇంత కాలమూ ఏం చేస్తున్నాడు? మనవ రాలు పుట్టిందని తెలియగానే కొడుకుతో ఏదో విధంగా రాజీపడక పోయాడా? ఆయన ప్రవర్తన నాకు అయోమయంగానే కనబడింది.

బండిడాక్టరుగారింటి వాకిలిదాటి ముందుకు పోతూండగా నర్సు, "ఆపు, ఆపు!" అని అరిచింది. బండివా డాపాడు.

వాడికి డబ్బు లిచ్చి తల వాకిలి తట్టాను. సుందరమ్మగారు వచ్చి, లోపలి నుంచి పడే లైటులో కూతురికేసి చూసి విభ్రాంత పోయింది.

[సశేషం]



పానుగంటివారి సాక్షి

కామఋషి సత్యనారాయణ వర్మ

20వ శతాబ్ది ప్రారంభ కాలమున వర్ధమానులైన గద్యరచయితలలో శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారొకరు. అంతకు పూర్వము చిన్నయసూరి, కందుకూరి వీరేశలింగము పంతులుగారు, మొదలగువారు ఈ గద్య రచనకూ పూనుకొన్నారు. పానుగంటి వారి సమకాలిక గద్యరచయితలలో శ్రీ చిలకమర్తివారూ, వేంకట పార్వతీశ్వరకవులు వచన రచనలో చక్కని శైలిని పర్చరచినారు. ఈ రచనలలో పానుగంటి 'సాక్షి' ఉపన్యాసములు విశేష ప్రఖ్యాతిని గడియించుకొన్నవి. కవి రచనలకు గద్యము నికషమని పెద్దల యభిప్రాయము. గద్యమైనను పద్యమైనను కావ్యరచనకు విశ్వశ్రేయమే ప్రయోజనముగదా! సంఘమునందలి దురాచారములను ఖండించుటలోను, సదాచారములకూ ప్రోత్సాహము కలుగజేయుటంలోనూ శ్రీ వీరేశలింగము గారు ముందుగా వ్యంగరచనలు హాస్య ధోరణిలో విమర్శనాత్మక రచనల కంకుశార్పణ గావించినారు. దోషినిగాక, దోషములను ఖండించి విమర్శించుటలో పానుగంటిగారి లేఖిని వేటగాని శరసంధానము, ఆ హావరంగమునందలి యోధుని ఖడ్గచాలనమునకూ మించిన తీవ్రతతో నడచినదనుట అతిశయోక్తి గానేరదు. అవి జాతియోద్యమము, సంఘ సంస్కరణోద్యమము, సాహితీ సముద్ధరణము ముమ్మరముగా సాగుచున్న రోజులు. భారతీయ భాషలపై, భావములపై పాశ్చాత్య నాగరికతా ప్రభావము పలుకుబడి విశేషముగా ప్రసరించి నాటుకొన్నదినములు. వివేకానందుడు అనీబిసెంటు మొదలగువారూ భారతీయ సంస్కృతీ వైభవమును, సాత్విక భావములనూ పునరుద్ధరించి పాశ్చాత్య వ్యామోహమున కొట్టుకుపోవుచున్న యువకులను మరల్చి ఆర్ష విద్యలపట్ల అనురక్తులను గావించిన సంఘటనలు గూడ తటస్థించినవి. ఇట్టి వివిధోద్యమ ఝంఝూ మారుతములలో నూత్న చైతన్యమును సంతరించుకొన్న తరుణమున శ్రీ పానుగంటి రచనలు బహుళ ప్రచారమునకు వచ్చి ప్రజాదరణము పొందుటలో నాశ్చర్యములేదు. ఆంధ్ర పత్రిక సారస్వతానుబంధములో 'సాక్షి' ఉపన్యాసములకై పఠితలు ఎదురుచూచి, పదిమందికలిసి చదువుకొని అందలి వ్యంగ్యమును, చమత్కారమును, హాస్యమును మరలమరల చెప్పుకొని ఆనందపడిన రోజులుగలవు. 'సాక్షి' ఉపన్యాసములలో కోడిపందెములు మొదలు గోవిందనామ స్మరణమువరకు, తోలు బొమ్మలు మొదలు తత్వోపన్యాసముల వరకు, రాజకీయములు మొదలు సాహితీ చర్చలవరకు, అసంఖ్యాక సమస్యలపై జంఘాలశాస్త్రి కంఠోక్తిగా నుపన్యసించినాడు. అతని విమర్శకు గురికాని అంశములేదు. అతని ఎత్తిపొడుపులకు తప్పించుకొని పోయిన విషయము లేదు.

సువిశాలమగు ప్రకృతి రంగమున, నిరవధికమైన కాల ప్రవాహంలో, అనంతకోటి విశేషములు నిరంతరము జరుగుచున్నవి. ఒక పరిశోధకుని దృష్టితో, వైజ్ఞానికుని దీక్షతో, శాస్త్రీయ దృక్పథముతో, లోక వ్యవహారములను పరిశీలించి అందలి బాగోగులను నిర్ణయించి లోకమునకు చూపుట 'సాక్షి' ప్రధాన కర్తవ్యము – 'నిష్కారణ నింద' అను శీర్షికలో సాక్షి ఉద్దేశ్యములను ఆశయములనిట్లు వివరింపబడినవి.

"మా సంఘము సత్యపురమున స్థాపించిన నాటినుండియు నిష్పక్షపాత బుద్ధితో మృదులముగా నొకప్పుడు, తీవ్రముగా నొకప్పుడు, పుష్పవ్రేటుగా నొకప్పుడు, పిడుగుపాటుగా నొకప్పుడు, జారుజారుగా నొకప్పుడు, నెదురెత్తుగా నొకప్పుడు, హాస్యరస సేచనమున నొకప్పుడు, వీరరస మేళముతో నొకప్పుడు అనేకోపన్యాసముల నిచ్చియుంటిమి. సంఘములోని దోషములను, మత సంబంధమగువానిని, ఆచార సంబంధమగు వానిని, వాణిజ్య సంబంధ మగు వానిని, సంస్కార సంబంధములగువానిని, ఇంకను సంఘముతో సంబంధమున్న మరి కొన్నింటిని మీ కన్నులకు బాగుగా స్వస్వరూపముతోవలె గానబడునట్లు, వర్ణించి వానిలోని యసహ్యతను బట్టబయలుచేసి, వానివలన లోకమునకు కలుగు నష్టములను వెల్లడించి, వానిని వదలుకొనినందువలన సంఘమునకు కలుగు లాభములను స్పష్టీకరించి దోషములందూ మీకు రోతపుట్ట జేయుటకై శక్తివంచన లేకుండ మేము పాటుపడుచున్నాము. సంఘదోషములతోడనే మాకు బనికాని దోషముల నొనర్చుచున్న మనుజులతో మాకెంతమాత్రము బనిలేదు. దోషములనేనిందిం

తుముగాని, దోషములను మేమేమియు నిందింపము. దోషులెవరో, నిర్దోషులెవరో యను చింత మాకులేదు. అక్కఱలేదు. దోషములను నిందింపవలయును గాని దోషయుతులను దూషింపగూడదని మేము సంఘ నిర్మాణ కాలమున జేసికొన్న శపథమున్నది"

కవుల రచనలలో తమ సమకాలిక సమాజ పరిస్థితులు, సంఘటనలు ప్రతిఫలించుట సహజము. గ్రామ్య గ్రాంధిక భాషా వివాదములు — నన్నయాది కవులకు నియోగి, వైదిక శాఖాభేదములకు ప్రాముఖ్యము కల్పించుట, శైవ వైష్ణవ మతాచారముల మూఢ నమ్మకములు — కోడి రామమూర్తి, తారాబాయి సర్కసు ప్రదర్శనములు, సంగీత నాటక ప్రదర్శనములు, అవధానములు, ఆసు కవితలు స్వదేశీ అభిమానము, స్వరాజ్య సంరంభము, ఎన్నికల కోలాహలము మొదలుగా గల 1900 వ సంవత్సరమునకు పూర్వార్ధము, ఉత్తరార్ధములకు సంబంధించిన సుమారు, అర్ధ శతాబ్ది కాలమునందలి సాంఘిక, రాజకీయ, సారస్వత, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక రంగములందలి సంఘటనల నెన్నింటినో ఆయన ఇతివృత్తములుగా గ్రహించి అందలి మంచి చెడులను నిశితముగా, నిష్పాక్షికముగా, నిర్దయతో కొన్ని, సకరుణముగా కొన్ని విమర్శించినవారి అసాధారణ మేధాసంపన్నత పఠితల నాశ్చర్య చకితులను గావించును. సమస్యను గాని, సందేహమును గాని ప్రతిపాదించుటలో ఒక చమత్కారము. సిద్ధాంతీకరించుటలో నేర్పు, తర్కమునందొక నైపుణి, దురాచార ఖండనములో చూపిన నిశిత వైఖరి పాఠకులను మైమరపించును. భావ ప్రకటనమునకు భాష ముఖ్య సాధనము— చిన్నయసూరి, కందుకూరి, చిలకమర్తి మొదలగువారు వచనములందు ఒక్కొక్క రీతి శైలి గోచరించును. పానుగంటి వారు ఉపన్యాస ధోరణిలో యమకము, సమాస గుంఫనములో ధారావాహికత, ఒక్కొక్క పట్టున జలపాత వైఖరి మున్నగు లక్షణములతో గద్యమున కొక నూత్న చైతన్యమును గూర్చినారు. గిడుగువారి వ్యవహారిక భాషావాదమునకు గ్రాంధిక వాదుల పక్షమున వీరొక ఒడ్డు గాచినవారే. వీరి విమర్శాదర్శ విమర్శాదర్శము గ్రాంధిక భాషావాదుల కొక దివ్యాస్త్రముగా పనిచేసినది. అయినను వీరి గద్యశైలి నాతికఠినమై వ్యవహారికమునకు చేరువై నాటి గ్రాంధికము యొక్క కాఠిన్యముగాని, భావక్లిష్టత గాని లేక, సుబోధకమై, సరళమై యొప్పారినది. వీరి గద్యము చదువుచున్నంత సేపూ వ్యవహారికమా, గ్రాంధికమా యను సంశయము స్ఫురణకు రాక అందలి విషయమే పఠితను తనతో నాకర్షించుకొనిపోవును. ఎంతటి కఠిన సమాసమైనను పఠితకు క్లిష్టత గోచరింపక చెప్పదలచుకొన్న అంశము అనేక రీతులలో, అనేక ఉపమానములతో మరల మరల నొక్కి వక్కాణించుటలో అందలి భావము అరచేతి యుసిరిక వలెను, ఒలిచిన అరటిపండు వలెను సుబోధక మగుననుట సత్యదూరము గాదు. సిద్ధాంతము, పూర్వపక్షము, విమర్శనము, ప్రతివిమర్శనము ఒకే లేఖినినుండి ప్రకటించుటలో వీరి రచనలకు వీరేసాటి. వారి కుమారులు రమణప్ప నొకవంకనూ రాఘవు నొకవంకను నిడుకొని వారింట పచారు చేయుచూ చెప్పిన ఉపన్యాసము లని ఒకప్పుడు వారే నుడివియున్నారు.

'సాక్షి' ఒక మహాసాగరము వంటిది. అందలి లోతులను పరిశీలించినకొలది అనేకమైన ఆణిముత్యములు లభించును. అర్ధ శతాబ్దమునకు పైబడి గావించిన వారి అమూల్య సారస్వతమునకు నేటి యువ రచయితలు దూరమైపోవుట శోచనీయము. మహామేరువులై భాషను మథియించిన వారిని, వారి రచనలనీ విస్మరించుట దురదృష్టమేగాదు ఒక రీతిగా అపరాధమేమో. ఈ తరమువారి రచనలను చదివి ఆకళింపు గావించుకొనిన గాని ఈ యువ రచయితల సాహితీ కృషి సంపూర్ణము గాదు. సాహిత్యమునందు ఎవరెట్టి ప్రక్రియల ననుసరించి చేపట్టి రచనలు సాగించుచున్ననూ, గద్యమైననూ, పద్యమైననూ 20వ శతాబ్దారంభ దశయందు మేరువులై నిలచి భాషాసేవ చేసినవారి రచనలను అందలి విజ్ఞాన భాండారమును అవగాహన మొనర్చుకొనుట ఒక పవిత్రమైన ధర్మముగా గుర్తింతురుగాక! ఈ తరమునందే వివిధ సాహిత్యోద్యమములకు అంకురార్పణ గావింపబడినది. నవ్య సాహిత్య రీతులు పుట్టుకకు, నూతన వ్యావహారిక శైలి ఉద్భవమునకు, కారణములైన ఉద్యమ రీతుల నవగాహన మొనర్చుకొన్నగాని నేటి రచయితల రచనలకు పుష్టి, ఓజస్సు కలుగనేరదు. ఆంగ్ల సాహిత్యమునందలి 'స్పెక్టేటరు' రచనా విధానమును ఛాయామాత్రముగనే గ్రహించి తెలుగుతనమునకు, సంప్రదాయములకు భంగము కలుగని రీతిని వీరు గావించిన గద్య రచనలలో 'సాక్షి' ఒక పెన్నిధి వంటిది. అందలి భాషా, శైలీ, ఈనాటివారి కించుక నారికేళపాకముగా దోచినను అందలి విషయ విజ్ఞాన భాండారము— అందలి లోకజ్ఞాన— విమర్శనా పద్ధతులు అవశ్యము గ్రహింపదగిన వనుట నిశ్చయము.

వారి ఆంధ్ర, ఆంగ్ల, సంస్కృత పాండిత్య వైభవము నిరుపమానమైనది. వైద్య, వేదాంత, జ్యోతిషాది శాస్త్ర మర్యాదలే గాక, నూతన ప్రకృతి సిద్ధాంతములు, అర్వాచీన శాస్త్ర పరిశోధనలు, మనస్తత్వ శాస్త్ర పరిజ్ఞానము, ఎంతటి మహోదాత్తములైనవో వారి రచనలను బట్టి తెలియగలదు. జాతీయా

భిమానము. స్వమతాభిమానము, భారతీయ సంప్రదాయములపట్ల గౌరవము — దేశభక్తి. విమర్శక విధానములందలి వింతపోకడలను దూర్వారబట్టి, అందలి ఉత్తమ విధానములను సూచించుటలో, వ్యాఖ్యానములను వక్రీకరించుటలో, ద్వంద్వముల పరామర్శించుటలో వారికే మునకు ఇదియే సాటి.

సాక్షి సంఘమున నైదుగురు సభ్యులు గలరు — మొదటివాడు కాలాచార్యులు — ఇతడు బ్రహ్మచారి. శ్రీవైష్ణవుడు. నరులలో Bull dog జాతిలోనివాడు — అఖండ ధారణాశక్తి గలవాడు. యథార్థవాది—ప్రవేశరుసు మీయలేవెట్టిసభ్యుడు రెండవవాడు జంఘాలశాస్త్రి. ఈతడు కాలినడకనే ఆసేతుహిమాచల పర్యంతము దిరిగినవాడు. అనేక సంస్థానములను జూచినవాడు — సంస్థానముల పూర్వచరిత్ర—ఆయాప్రభువుల లోపముల నెఱింగినవాడు. వాచాలుడు. వాదములలో కట్టుజాఱిపోయిన కలియబడగలిగినవాడు. అన్ని అంశముల నంతయో నింతయో తెలిసినవాడు — మూడవవాడు వాణీదాసుడు. ఇతడు కవి — అసూయాపరుడు, నన్నయ కట్టు మొదలు నానా సాహెబు వరకందరును దూషించును — నువ్వుగింజమీద నూరు పద్యములు చెప్పినవాడు. మూడేండ్లనుండి శంకణబంధమొకటి వ్రాయుచున్నాడు — ఇతడు శూద్రుడు. నాలుగవవాడు కోమటి — వాణిజ్యరహస్యము లెఱింగినవాడు- పేరు బొఱ్ఱయ్య. గుమ్మము పట్టనంత స్థూలకాయము. మహైశ్వర్య దినములలో నున్నప్పుడు బయలుదేరిన ఆమరతప్పయిపుడీతనికి వెనుకటి ధనమేమియు మిగుల్చుకొననివాడు. అయిదవవాడు 'సాక్షి' — ఈతనిసంగతి వ్రాతలబట్టి తెలిసికోదగినవాడు. ఆరామద్రావిడుడు. వారు ప్రచురించు పత్రికకాతనిపేరే యుంచినాడు — ఈ సంఘము పరీధావి సంవత్సర మాఘబహుళ చతుర్దశి శివరాత్రి గురువారమునాడు లింగోద్భవ కాలమున బుట్టినది, ఇది సాక్షి సంఘ నిర్మాణము యొక్క సంక్షిప్తచరిత్ర. ఒక కవిని—ఒక ఉపన్యాసకుని — ఒక వణిజుని — బ్రహ్మచారియైన శ్రీవైష్ణవుని లోకవృత్తమున కంతకూ సాక్షీభూతుడైన 'సాక్షి', ఈ ఐదుగురను చేర్చి మానవులందలి అరిషడ్వర్గముల కల్లోలములన్నింటిని కన్నులకు కట్టినట్లుగ చిత్రించి అందలి 18 దోషములనూ వివరించిన ఈ ఉపన్యాసములందలి కొన్ని భాగములనిట మచ్చునకుదహరింతును — స్వకీయ విషయమును నుపన్యాసమునందు కవిత్వముగురించి — జంఘాలశాస్త్రి ఇట్లుపన్యసించెను.

"కవిత్వమైనతం వాత బంటిక్రింది కాగవలయునా? అంగిటి నొక్కునకు నిలువవలయునా? కొండనాలుకకైన నడ్డుపడవలయునా? లడ్డుంగున మంచినీరులాగున — గొంతుకలోనికి బోయిన యెడల నింక గవిత్వపు గారమేమి? గాటేమి? కమ్మదన మేమి? గడుసుదనమేమి? నాలుకపై నాగినదేది? అంగిటికి దగిలినదేది? రసమూరినదేది? రుచిపుట్టినదేది? ఉత్తమ కవిత్వములు ముఖ్యముగా మూడు జాతు లున్నవి.

గుంటుపోకచెక్క వలె గటుక్కన కొఱుకవలసిన కవిత్వమొక్కటి — వేపుడు సెనగలు నమలినట్లు నమలవలసిన కవిత్వమొక్కటి — తాంబ్రవలె జప్పరించవలసిన కవిత్వమొక్కటి. ఇప్పటి గీతకవిత్వములు దేనిలోగూడ జేరవయ్యేను. ఎందుల కా కవిత్వములు. అదిగాక మన పూర్వులు భారతము వ్రాసినారు. భాగవత రామాయణాద్యద్గ్రంధములు వ్రాసినారు. వారి తరువాతివారు కూడ నేవేవో పెద్ద పెద్ద గ్రంథములు చేతికి బట్టుదొరకునవి. చంకక్రింద బెట్టుటకు సరిపోయినవి, తప్పనిసరియగునెడల నప్పుడు తలక్రింద కక్కుఱకు వచ్చునవి — అట్టివి ఆమాత్రపు బోడుగువెడల్పు బలిమి గలగ్రంథములనే వ్రాసినారు. కాని యిట్టి నల్లపూస కవిత్వములు — ఇట్టి దమ్మిడీయెత్తు కవిత్వములు ఇట్టి అంగుళ ప్రమాణకవిత్వములు — ఎన్నడు చెప్పియుండలేదు. కవికాల మహిమచే మనవారిట్టి ఎందుకుజిల్లేడుకాయ కవిత్వములు చెప్పుచున్నారు. మనుష్యుల యొడ్డు పొడవులు తగ్గినవిగదా! బుద్ధులు తగ్గినవి కదా! అదృష్టాలంతకంటె తగ్గినవికదా! పాడి — పంట — బట్ట — పై జన్మకేమోయన్నట్లున్నవి కదా! ఈగతియే కవిత్వమునకు గూడ బట్టినది. పాలాస్త్రి పట్టియంతటి కాగితముమీద — రెండు మోహగీతములు — మూడు యుద్ధగీతములు వ్రాయవచ్చును."

'పాచక మహాజన సభ' యను శీర్షికలో లలితకళ లన్నింటిలో పాకకళ పరమోత్కృష్టమైనదని ప్రతిపాదింపబడినది 'గాన ప్రపంచమున భైరవిరాగము లేకపోయినయెడల ప్రాణోపద్రవమేమియును లేదు. కాని మహాజన ప్రపంచమున ఉప్పులేకపోయినయెడల నెంత ప్రాణసంకటమో యోజింపుడు 'క్రొత్త చింతకాయ పచ్చడి కున్న 'మజా' గుహాంతర్దేవాలయముల కెక్కడిది? సోమనాథేశ్వరుని యాలయమును గజినీ మామూదు కూలద్రోసినాడు. భారతమాత కొక్క తలవెంట్రుక యూడినట్లయిన లేదు. కాని బనసకాయను బచనకళా ప్రపంచమునుండి బహిష్కరింపుడు. ఆర్యావర్తమల్లల్లాడి యల్లలాడి యంబుధిలో బడిపోవదా! చెవులుగోసిన గొఱ్ఱెలవలె బేరుమని బిత్రుదేవతలు నెత్తిగోరు గొట్టుకొని యేడువరా?' 'పాకకళకు రసము లారు. కవితకు రసములు తొమ్మిది. ఆఱైనను మనవి ప్రత్యక్షరసములు-తొమ్మిదియైన నవిపరోక్షములు. మన రసము లాఱునుగూడ మన కళకు ప్రాణములు కాని శృంగార వీర కరుణము

లను మూడు రసములే కవిత్వమునకు ప్రధాన రసములు. మిగిలిన మూడు రసములను కవితా ప్రపంచమునుండి తీసివైచినను నష్టములేదు. ఏదీ మన యారు రసములలో నొక్కదానిని దీసివేయుడు, చూతము. తీసివేయుటవరకెందులకు, రవంత తగ్గిపుడు. ఎంత లోపముగానుండునో? 'శాకుంతలము'లో కొంత శృంగారరసము తగ్గినను చలామణి యగునుగాని చిత్రాన్నములో చేరెడు ఉప్పెక్కువ కానీ, కుక్కయైన మూర్కొనునేమో? ఇదిగాక కవితా రసములలో రసముల అన్యోన్య విరుద్ధ భావమున్నది మన కళలో నట్టిదిలేదు కదా! 'వంకాయపచ్చడిలో' నుప్పు పులుసు కారము మూడు రసములున్నవి. కాకరకాయ పచ్చడిలో నుప్పు పులుసు కారము తీపి చేదు అయిదు రసములున్నవి. ఆరు రసములను గూడ నొక్కచో నవ్యాహతముగా ననుసంధింపవచ్చును. ఆ వస్తువేదియో యెఱుగుదురా? ఆవకాయ యని ఆనందవాచకములో చెప్పబడినది. (బెల్లపావకాయ కాబోలు — అని ఒక వితంతువు నగుకొనుచున్నది.) కవితలో వీరరసమునకూ శృంగారరసము చుక్కయెదురు" నలుడు వంటవాడై స్వారాజ్యమును సంపాదించుకొనెను. భీముడు వంటవాడై స్వరాజ్యము సంపాదించుకొనెను. అటులే కవులెల్లరు పాచకులగునెడల స్వరాజ్యము మన కవలీలగ రాగలదు. (స్వరాజ్య సంరంభము సాగుచున్న రోజులవి)

స్వభాష : యను శీర్షికలో మాతృభాషలో నుపన్యసించజాల నని చెప్పిన యధ్యక్షుని గురించి జంఘాలశాస్త్రి యన్నమాటలు "హరహరా! మహాదేవ శంభో! ఎంతమాట వినబడెను — ఎంత మాట వినబడెను...అధ్యక్ష భగవానుని యాలాపకలాప మేది? వారు సాయించిన శ్రీసూక్తి యేది? చెప్పనా? చెప్పక తప్పునా! మన యగ్రాసనాధిపతిదేవుని కాంధ్రభాష రాదట. ఆంగ్లేయభాషా పండితాగ్రగణ్యులే? బర్కు, సిసిరో, డెమాస్తనీసు, గ్లాడ్స్టన్ ఇత్యాది మహావక్తృవావదూకతా వైభవమును కబళించి నమిలి, చప్పరించి, మ్రింగి జీర్ణించుకొని రక్తమాంసముల గలుపుకొనినవారగే — వీరాంధ్రమున మాటలాడకపోవుట యేమి? మ్యావుమని కూయలేని పిల్లి యెచ్చటనైన నుండునా? కిచకిచ లాడలేని కోతిని మీరెచ్చటైన జూచితిరా? ఈత రాని కప్ప యేదేశమందైన నుండునా? ... తెలుగుతో మాటలాడుట సిగ్గిసిగ్గు! అంత సిగ్గుపడదియేమి యకార్య కారణము-రిఫ్రెషు రూములో గొడ్డుమాంసము తినుటయా! విస్కీ త్రాగుటయా? సభలో తూలిపడిపోవుటయా? అట్టి యభిప్రాయము మన యధ్యక్షశార్దూలమునకు దేశీయుల దౌర్భాగ్యమువలన దాపురించినది. ... అందఱును తెలుగున మాటలాడవలసిన యిందరలో నీ వొక్క డింగ్లీషులో మాటలాడితివి. కావు కావు మనవలసిన కాకులన్నిటిలో నొక్క కాకి కొక్కొరోకో యని యఱచిన మిగిలిన కాకులు దానిని ముక్కుతో బొడిచివేయక మానునా?... ముష్టి బాపణ్ణాడు నీ యింటికి వచ్చి యాయవారపు బ్రాహ్మణుడనయ్యా యని యఱవక బోయ్ రూమ్లో నున్న పాట్లో రైస్ యేమైన నున్నదేమో. కైండ్లీ గెటిట్ హియర్; థాంకు యూ ఇన్ ఆంటిసిపేషన్" అని నీతో సంభాషింపగ నీవాతనికి ముష్టి వేయుదువా?

కొన్ని విచిత్ర సమానములు :—

తెలివితక్కువ నిర్భాగ్యపు టొల్లిగిచిల్లర యవకతవక యాసమ్మమోసమ్మయారిగ చొప్పయలుగుగుడ్డ కవిత్వము పేడపుపిండి మట్టిగడ్డి కల్లబొల్లి కాకిబూత కవిత్వము.

విమర్శకుడు — కవుల గ్రంథముల కగ్గిపుల్ల. కవుల ముంగిటి మొండిచెయ్యార కవుల పాలిటి తుపాకీ పిక్క.

పండితుల పరస్పర దూషణములు :—

జంఘాల జలద ఝంఝా మారుతము —
వాణీదాస వల్లకాడేయము.
వాణీదాస వదన ధూధూకార.

కాల్చిన కుండలో బడవేసిన సీమటపాకాయ పేలునటుల టపటప ధమధమాంతర్గత చురచుర తుసుతుసు వీరావాగ్ఝటీ సాంప్రదాయము.

దేహబలము — మనోబల మను శీర్షికలోని ఉపమాన సూక్తులు (కోడి రామమూర్తి బలప్రదర్శనము లిచ్చు రోజులలో)

దయ్యపు గొబ్బరలో నీళ్ళుండునా?

సీమ మిరపకాయ కన్న కారము బుట్టమిరపకాయ కున్నదా?

సన్నయావాల కున్న గాటు పెద్ద యావాల కున్నదా?

చిన్నజాజులకు గల సౌరభము పెద్ద జాజుల కేది?

పందిరిమల్లె కున్న వాసన తుటము మల్లె కెక్కడనుండి వచ్చును?

సన్నచెఱకు కున్న తీపి బొంత చెఱకునకు వచ్చునా?

కొండెవరపు వంకాయ పొయ్యిలో బెట్టగ వెన్నయగును. తాడేపల్లి గూడెము వంకాయ పొయ్యిలో బెట్టగ పొయ్యి యాఱిపోవును.

అంతశ్శౌర్యము ప్రధానము గాని యంగబలముతో బని యేమున్నది?

తాటియాకంత దళసరిగల కత్తి ప్రధానమా? తాంబ్ర బెత్తెంత దళసరి గల యొర ప్రధానమా?

బలాఢ్యునకు దిండి తినుటలో నున్న యోపిక దెబ్బ తినుటలో నుండదు —

ఈ కాలపు యుద్ధములో వెట్టిదేహబలముతో బని యేమున్నది. కోటిమందికి హతాన్మరణ మీయగల సామాగ్రి గోళీకాయలో బెట్టి ప్రకృతిశాస్త్రము విసరివైచుచుండ బలమో బలమో దేవులాడుము రేల? శౌర్యమునకే పనిగానబడని

దినములలో చచ్చుబలముతో బనియే మున్నది ?

ఏడు శబ్దము :

ఏడు బహు పవిత్రమగు సంఖ్య — మన కేడ్గురు ఋషులు - ఏడు ద్వీపములు— ఏడు స్వరములు — ఏడు తాళములు — ఇంద్ర ధనుస్సులో నేడు రంగులు — వారమున కేడు దినములు — సప్త ధాతువులు — సప్త సంతానములు — ఈవిధముగా ఏడుయొక్క ప్రాశస్త్యమున్న వివరించును. ఇట్లు మూడుసంఖ్య గురించి యొక ఉపన్యాసము గలదు.

కొన్ని సూక్తులు :

'బండ్ల కోలది కాగితములను పాలక ప్రధానుడు చూచియే సంతకముపెట్టు చున్నాడా ?'

'కందిపప్పు నియమము దాటినవానికి నంది మాంస మైననేమి పందిమాంస మైన నేమి —'

ఒక్కని Typhoid జ్వరమునకు బెట్టిన పథ్యయముతో ననేకుల సన్నిపాతములను దీర్చవచ్చును.

'శాంతి యుక్కరియం దెంత నియో cream of malt ది అంతని. కాని మూడు దమ్మిడీలు విలువగలవానియందు విశ్వాసము తక్కువ. మూడు రూపాయిల బుడ్డి యందు విశ్వాస మెక్కువ.'

ముంజేతి గడియారము :

'పెండ్లాము మెడలో బుస్తెలు కన బడవుగాని మగనికి ముంజేతి గడియారము తప్పదు. కాలము పరమాత్మకువలె హస్తగతమై యుండక తప్పదు.'

స్త్రీల స్వభావవర్ణనము :

పూచిన తంగేడు వనము — పండిన దోసతోట — బంగారు తునుకలగని.

నాటి సంగీత నాటక ప్రదర్శనములో పాత్రల సంబోధనా సరళి — రాజరాజన రేంద్రుడు — సరే! లావణ్యవతీ సముంచిన సద్గుణ సంతతీ ! సద్ధర్మాచరణ రతీ ! సరసవచో రచనా చమత్కృతీ— భారతీ !— ఆమె పలుకలేదు. మరల చిత్రాంగీ— మనోహరాంగీ !— అతి సౌభాగ్య నిర్జిత కురంగీ! మాననీయ యనాదరీకృత మద సారంగీ! నాపై పూలబంతుల బారుపెట్టు జోడు నాద ముల ఫిరంగీ ! సూక్తి — సంసార విజయ నాటకమునకు సత్కర్మమే బీజము. ఇట్టి సూక్తులెన్ని యేని గలవు.

కొన్ని బిరుదులు :

'మహా మహోపాధ్యాయ బిరుదమును దీసివైచి పండితుడు 'మధు పాన విదగ్ధ' యను బిరుదు వ్రాసికొనుట లేదు. సన్యాసి 'పరమ హంస' యను బిరుదమును ధరించుచున్నాడు గాని. 'ప్రత్యక్ష ప్రాచీన సువాసినీ స్త్రీగళిత శిరమూర్ఖ సాహితీ సనాథా' యను బిరుదమున కుత్సాహ పడుటలేదు.

M. R. A. S. బిరుదమును విసర్జించి 'మండపాక మాణిక్యవేశ్యా ద్వితీయ పుత్రికా తృతీయ పరిపాలకా' యనిపించు కొని యుబ్బిగు చుండుటలేదు.

'పండిత బిషగ్వరా' యనిపించుకొని సంతసింప వచ్చును గాని 'ప్రత్యక్ష యమకింకరా' యని బిరుదమును బతిం పించుకొని యానందింప వచ్చునా ? దివాన్ బహద్దరను బిరుదు నాడికాని 'దేశద్రోహి' యను బిరుద మున్నదా ? జమిందార్ అని హెచ్చరిక చేయ వచ్చునుగాని 'ముండల మజుందార్' హెచ్చరిక చేయవచ్చునా ? ఈ విమర్శన మంతయు ఇంద్రలోకమున 'అహల్యా మెజారా ! జయా !' అను హెచ్చరికను విని ఇంద్రుడు పరమానందం పడుట వలన వచ్చిన ప్రసంగమిది.—

ఇవిగాక సనాతనాధునాతన నాగరికతలలో గల వ్యత్యాసములను స్త్రీల హక్కుల గురించీ. ఎన్నికల గురించీ. భూత వైద్యముల గురించీ. ఆయుర్వేద వైద్య ప్రాశస్త్యము — ఆంగ్లేయ వైద్య వ్యామోహము గురించి నిశితముగా విమర్శించినారు. కష్టాంత నాటకములు భారతధర్మమునకూ — ఆధ్యాత్మికచింతనములకు విరుద్ధమైన వని వివరించినారు. టాజ్ మహల్ లోని సౌందర్యమును — పురుషుని సౌందర్యము గొప్పదని కొన్ని శీర్షికలలో వర్ణించియున్నారు. ఇంద్ర ధనుస్సు నందలి రంగుల వలె వారి లేఖిని నుండి నవరసము లొలికించినారు. ఇట్లు జంఘాల శాస్త్రి మొత్తము నూట నలుబదికి పైబడి యుపన్యాసముల నిచ్చెను. అందు మశక మత్కుణ మూషిక మహాసభలు — పశువుల సంతలో పశువుల సభలలో, ఆయా జంతువుల సహజ స్వరాదులను చిత్రించి అందు మానవ స్వభావరీతులను విమర్శించి శాస్త్ర పురోభివృద్ధిలోగల యవకతవకలను వివ రించును. ప్రతిమతమునందలి ఆధిక్యతను నిరూపించి ఆయా మతాచార్యుల విరుద్ధాచార సరళిని వెక్కిరించును. సంఘములందలి దురాచార ఖండనములో కాంతా సమ్మితముగా సున్నితముగా నున్నవో అందలి తప్పును సుస్పష్టము కాను. అందుకై వీరి లేఖిని ఇంచుక తీక్షణ — చురుకుదనము పట్టి — కొన్నిపట్ల నిర్దాక్షిణ్యముగ నిరాఘాటముగ మోమోటమి లేకండా ఆయా దుర్నతల లోని దురాగ్రతను తూర్పారబట్టినారు. ఇట్టిరచనలు చదువవలసినదే గాని ఎన్ని చెప్పుకొన్నను తనివి తీరదు. ఆంగ్ల సాహిత్యమునందలి గ్రంథములలో ముఖ్యముగా మెకాలే, రస్కిన్, కారలైల్ మొదలగువారి రచనలలో గల శైలి పఠిత లను సమ్మోహితులను గావించును. అట్టి శైలిగల గద్యములు మనకు అరుదుగా గోచరించును. ఆ లోపము పంతులుగారు తీర్చినారు. మనోహరమను శైలిని గూర్చుకొను నభిలాషగల విద్యార్థికిది తక్కన్నా ఉత్తమ గ్రంథము లుండవు. జంఘాల శాస్త్రి యుపన్యాసధోరణి, వాణీదాసు బంధుర ప్రబంధ రచనాసక్తి, కాలాచార్యుల రచనానైపుణి, సాక్షి విషయ నివేదనా వైఖరి అభిప్రాయ సమంజసత ఆంధ్రభాషలో ఒక ప్రత్యేక స్థానము నార్జించుకొన్నవి — ఒకచోట సంభాషణాచాతురి — ఇంకొకచోట పాత్ర విలక్షనవైఖరి—మరియొకపట్టున అపూర్వ వర్ణనా గాంభీర్యము పఠితల కానంద మును గూర్చుటలో 'సాక్షి' ఉపన్యాస ముల కవియేసాటి — అట్టి మహనీయుని సంస్మరించుటలో ఆంధ్రులు ధన్యులు — వారి రచనలు ఆంధ్ర శారదకు అమూల్యాలంకారములు. —

మిహిరకులుడు

సీరియల్ నవల:

ఎనిమిదవ అధ్యాయము

విశ్వనాథ సత్యనారాయణ

పుష్కలావతిలో మామయు నల్లుఁడును గూతురును మంత్రి సేనాపతులును. పురోహితుఁడును గూర్చుండిరి. మూఁడునాల్గుదినముల యాలోచన యయినతరువాత మిహిరకులుఁడు నిస్సంశయముగా విస్పష్టముగాఁ దనకు గాంధారరాజ్యము వలదని చెప్పెను. అప్పు డేమి చేయవలయును ? ఈరాజ్య మెవనికో యీయవలయును. వాఁ డెవఁడో? రాజునకు నీలాంబరునికంటె సమీపబంధువు కలఁడు. పూర్వము దర్పమల్లుఁడు వానిని గూడ నొక దుర్గాధ్యక్షుని జేసెను. ఈ నాలుగేండ్లలో నతఁడు విపరీతముగాఁ బ్రవర్తించినది లేదు. ఈ పదిమంది రాజకుమారుల తండ్రులకుఁ దమ కొడుకే రాజు కావలయునని యుండెను. అట్టి యాశగాని, యట్టి ప్రయత్నముగాని లేనివాఁడును జేయనివాఁడును నీలాంకుని తండ్రి యొక్కఁడే. మొదటినుండియు దర్పమల్లునకు నీలాంకుని రాజు చేయవలయు నని యుండెను. ఆయన చెప్పఁడు. అడిగినను జెప్పలేదు. 'ఇది ప్రభుకార్యము; ఇద్దఱు రాజులును గాంధారదేశ మంత్రి పురోహితులును నిర్ణయింపవలసిన పని. మీ సేనను దిద్దిపెట్టుమన్నచో దిద్దిపెట్టెదను. నాకు బాగుగాఁ దెలిసిన విషయమది, 'నీకు రాజనీతిమాత్రము దెలియదా ? ధర్మశాస్త్రము తెలియదా ? మఱి యేమి తెలియ' దనిన నతఁ డిట్లనెను: 'మహారాజా ! అన్నియు నందఱకుఁ దెలిసినట్లే యుండును. చదివిన విద్య వేఱు. అనుభవములో నున్న, శ్రుతమైన విద్య వేఱు. ఒక గాయకుఁడు పాడుచుండగా వేయిమంది విందురు. సంతోషింతురు. కాని వారా విద్య నెంతవఱకుఁ దెలిసి, సంతోషించిరని ప్రశ్న. దానిని జక్కఁగా ననుభవించుటకు నీవు కొంత గాయకుఁడవు కావలయును. ఆ శాస్త్రము నెఱిఁగియుండవలయును. పలుమందిని వినియుండవలయును. గుణదోషముల పరిజ్ఞానము చక్కఁగా నుండవలయును. అప్పుడు భగవంతుఁ డిచ్చిన శక్తి పనిచేయును; నాకీ మూఁడును గలవన్నచో సేనావిషయమునందు గలవేమో! ఇది ధర్మశాస్త్రవిషయము. రాజకుటుంబవిషయము. మహారాజ్య పాలనావిషయము. దానికి దేశపరిస్థితు లన్నియు రాజకుటుంబస్వభావమును జనుల భాగధేయమును సర్వమును బరిశీలింపఁగలిగిన మహాశక్తిమంతుఁడు కావలయును. ఒక్కొకప్పుడు మన మేదో పని చేయుదుము. దైవము కలిసివచ్చును. దానిని పౌరుష మనుకొందుము. కలిసివచ్చినచో నష్టము లేదు. దాని నమ్మకము లేదు. అందుచేత నిది సంశయగ్రస్తమైన విషయము.'

ఎవ్వరును మాటాడలేదు. నాల్గవదినమున మిహిరకులుఁడు మామగారి నడిగెను. 'మీరు దత్తత చేసికొనుట కంగీకరింతురేని



మేము నిర్ణయింతు' మని. తండ్రియుఁ గల్యాణవతియు నంగీకరించిరి. మిహిరకులుఁడు రాజ్యమందలి ప్రసిద్ధులైన పదిమంది రాజనీతివేత్తలైన వృద్ధక్షత్రియులను బ్రాహ్మణులను బిలిపించెను. ఈ రాజకుమారుల నందఱను బిలిపించెను. "మీరు ప్రశ్నలు వేసి పరీక్షించి వీరిలో నెవఁడుత్తమరాజనీతివేత్తయో నిర్ణయించి పెట్టవలయు" నని చెప్పెను.

వారు పదిదినములతరువాత నీలాంకుఁ డుత్తముఁ డని చెప్పిరి. మిహిరకులుఁడు మామగారితోఁ జెప్పెను. మంత్రి పురోహిత సేనాపతులతోఁ జెప్పెను. వా రందఱు విచారించిరి. అయ్యో! ఈ నిర్ణయము నీలాంబరునివిషయములో జరిగినచోఁ బ్రశ్న యుండెడిదికాదు. ఇబ్బంది యుండెడిదికాదు. నీలాంకుఁడు రాజవంశీయుఁడే కాని సన్నిహితబంధువు కాదు. ఇతనికి రాజ్య మర్పించినచో లేని యాబ్దికమును గొనితెచ్చికొన్నట్లే. నీలాంబరునివలన రాజ్యమున కెక్కువ యెద్దడి కలుగును. అతఁడు గొప్పవీరుఁడు. ఇదివఱకే యిరువురినడుమ సంఘర్షణలు వచ్చినపుడు నీలాంకుఁ డొత్తిగిలిపోవుదిండెను. అందుచేత నీలాంకుని రాజ్యమును నీలాంబరుఁడు సాగనీయఁడు. ఇతఁడును తట్టుకొనలేడు.

ఇట్లుండగాఁ బశ్చిమరాజ్యములయందుఁ గొన్నిచోట్ల యలజడులు మొదలుపెట్టెను. నాలుగేండ్లక్రింద నిర్మూలింపఁబడిన మ్లేచ్ఛులకారణమునఁ బశ్చిమదేశముల యందలి మ్లేచ్ఛరాజ్యములయం దెంత భయము కలిగెనో యంతటి కోపమును గలిగెను. వారీసారి పూర్వముకంటె నెక్కువ కట్టుదిట్టములతో దోపిడికాండ్రు కాకుండ నొక సేనాధిపతియు వానిక్రింద సేనయుగా వచ్చిరి. కొన్ని ప్రదేశములను వశము చేసికొనిరి. అల్పములైన కొన్ని దుర్గముల నాక్రమించుకొనిరి. అవి స్థావరములుగాఁ జేసికొని పల్లెలమీఁదఁ బట్టణముల మీఁద దాడులు సలుపుచుండిరి. తత్రత్యులైన రాజులు మిహిరకులునిచేత మున్ను నియమింపఁబడినవారు. తమ సేనలలో యోద్ధలను నిర్మూలించుటకు వెళ్ళినచో వారు పలాయమాను లగుదురు. తమ బలమే యెక్కువని తెలిసినచో వీరిని గసిమసంగుదురు. ఇట్టిస్థలములు సింహపురీ రాష్ట్రమున నుత్తరజ్యోతిషమునఁ బడియున్నవి. మిహిరకులుఁడు రాజుతోఁ జెప్పెను. 'నీలాంకుని, నీలాంబరుని వారిని నిర్జించుటకుఁ బంపుదుము. నీలాంకుఁ డుత్తరజ్యోతిషమునకుఁ బోవలయును. నీలాంబరుఁడు సింహపురరాష్ట్రమునకుఁ బోవును. తమకు మిక్కిలి సన్నిహితుఁడును రక్తస్పర్శ కిలవాడును నయిన హిరణ్యాక్షుని నీలాంబరునకు సాయము పంపుదము. ఇట్లు చేసినచో వారి శక్తులు మనకుఁ దెలియగలవు. హిరణ్యాక్షుఁడు తన ప్రతాపముచేత నీలాంబరుని మించినచో హిరణ్యాక్షునే రాజును జేయగలము. మీ రాయననే దత్తత చేసికొనవచ్చును! అనఁగా రాజంగీకరించెను. నీలాంకునకుఁ బదివేల సైన్యము, నీలాంబరునకుఁ బదివేల సైన్యము హిరణ్యాక్షున కైదువేలసైన్యముగా మిహిరకులుఁడు విభజించెను. సింహపురీరాష్ట్రమునయందుకంటె నుత్తరజ్యోతిషమున మ్లేచ్ఛులు దృఢముగా నుండిరని వార్త వచ్చెను. అచ్చటికి నీలాంకుని బంపెను. ఎద్దడితక్కువైన సింహపురీరాష్ట్రమునకు నీలాంబర హిరణ్యాక్షుల నెక్కువ సైన్యముతోఁ బంపెను. రాజబంధువు లందఱును సంతోషించిరి. మిహిరకుఁలుడు బంధువుకదా! రాజవంశీయులయం దతని కెక్కువ ప్రేమ యుండును. నిస్సందేహముగా నీలాంబరుఁడు తన కార్యమును సాధించుకొనివచ్చును. హిరణ్యాక్షుఁ డెక్కువ పరాక్రమము నెరపినచో నీలాంబరుఁడే సంతోషించును. అతనిని రాజు చేయుటలో నీలాంబరునకుఁ గూడ నష్టముండదు. తనకంటె నతఁడు రాజునకు దగ్గరివాఁడైనపుడు నీలాంబరుఁడు మాటాడఁడు. అందఱును సంతోషించిరి. హిరణ్యాక్ష నీలాంబరులు కలిసి తమ పదునేనువేల సైన్యముతో సింహపురీ రాష్ట్రమునకుఁ బోయిరి. నీలాంకుఁ డుత్తరజ్యోతిషమునకుఁ బోయెను. నీలాంకునితో వాని బంధువులును స్నేహితులును జెప్పిరి. ఇది 'నిన్ను సంహరించుటకుఁ జేయుచున్న ప్రయత్నము. లేదా నీవు శక్తిహీనుఁడ వని నిరూపించుటకుఁ జేయుచున్న ప్రయత్నము. నీవు పోవల' దని చెప్పిరి. నీలాంకుఁ డిట్లనెను. "నాకు రాజ్యమునం దభిలాష లేదు. కావలె నని నేను వాంఛించి కూర్చుండలేదు. వారు నన్ను రాజును జేసినచో రాజవంశమునకు ద్రోహము చేయను. నా చేతనైనట్లు పరిపాలింతును. నే నిప్పు డొక కార్యముమీఁద నియమింపఁబడితిని. నేను పోననుట రాజద్రోహము. అచట వధింపఁబడినచోఁ బ్రశ్నలేదు. ఆ కార్యము నేను నిర్వహింపలేనిచో రాజ్యమునుమాత్ర మెట్లు నిర్వహించగలను. నాకిది చేతనగునా కాదాయన్న సమస్య యెందులకు? ఎవ రడిగిరి! వారిలో వారు నిర్ణయించికొనుటకుఁ జేసెడి ప్రయత్నములలో నిది యొకటి యైనచో నాకు దాని మూలమే తెలియదు. ఇది న్యాయము కాదని వాదించుట యెట్లు! నేను రాజకుమారుఁడను. నాలుగేండ్లనుండి దుర్గాధ్యక్షుఁడను. అనఁగా సేనానాయకులలో నొకఁడను. ఈపని మన రాజ్యములోనిది కాదు. రాజ్యములో నొనచోట పితూరీ జరిగెను. దాని నణచిరమ్మనుట కాదు. పూర్వమువలెనే మ్లేచ్ఛులు మరల దండెత్తిరావచ్చును. అందుచేత మ్లేచ్ఛుల ప్రయత్నము మూలమునందే ఛేదించుట దూరపురాజనీతి. పూర్వము గాంధారదేశ మిట్టిపనులు చేయలేదు; ఇది మిహిరకులుఁడు చేసెను; ఇది యాయన పని. అందుచేత గూడ గాదనవచ్చును. ఇప్పుడు మన రాజునకు నాయనకు భేదము లేదు. మిహిరకులుఁడు తానే యీ రాజ్యమును దీసికొని యొక ప్రతినిధిని నియమించినచోఁ గాదనెడివాఁడు లేడు. నే నితనిని రాజుగా నియమించుచున్నా నని చెప్పినచో

నెదురుతిరిగెడివాఁడు లేఁడు. బకాసురున కెదురుతిరిగెడివాఁడు భీముఁ డొక్కఁడే! ఆ భీముఁడను నేను కానుగదా. పీలాంబరుఁడును గాఁడు."

రెండుమూఁడు దినములలో మువ్వురును వారివారి నియమితదేశములకుఁ బోయిరి. నీలాంకుఁడు తన పదివేలసైన్యముతో నుత్తరజ్యోతిషమునకు బోయెను. ఆ రాజునొద్దకుఁ బోయెను. అతనిని గలిసికొనెను. మ్లేచ్ఛు లాక్రమించిన స్థలములను దెలిసికొనెను. ఆ రాజుయొక్క సైన్యమును మఱి పదివేలమందిని సాయమును దీసికొనెను. ఉత్తరజ్యోతిషాధిపతి తొట్టతొలుత తన కిందుఁ బ్రసక్తి లేదన్నట్లు మాటాడగా నీలాంకుఁడు వానితో నిట్లనెను: 'నన్ను బంపినది గాంధారరాజు కాఁడు. మిహిరకులుఁడు. నీవు హృదయపూర్వకముగా నాకు సాయపడనిచో మిహిరకులుఁడే తన సేనతో వచ్చును. పూర్వము నిన్ను తొలగింపలేదు. ఇప్పు డాపని చేయును. నిన్ను ఖండించును. రాజా! నీ కా సంగతి తెలియదు. అతనికి రహస్యవధాగార మున్నది. ఆ రహస్యవధాగారములో నెవరి నెట్టిహింసలు చేయునో యెవ్వరికిని దెలియదు. అతని కిష్టమైనవి మూఁడుకార్యము లున్నవి. మొదటిది భోజనము. రెండవది మహారాణి యైన కల్యాణవతి. మూఁడవది హింస." అని నీలాంబరుఁడు తా నూహించి మిహిరకులుని ఘోరకృత్యములను వర్ణించెను. అపుడు మిహిరకులుఁ డచ్చట లేఁడు; గాని యున్నచో నితఁ డెవ్వఁడో ఋషి, యంతర్దృష్టి యనుకొనియుండును. ఉత్తరజ్యోతిషాధిపతి భయపడిపోయెను. నీలాంకుఁడెట్లు చెప్పిన నట్లు వినెను. మ్లేచ్ఛులు స్థావరము లేర్పఱచుకొన్న దుర్గప్రాయము లైన పర్వతప్రాంతములయం దున్న సర్వగ్రామములయందు గ్రామీణులను సిద్ధముచేసి యందఱకుఁ గటారు లిచ్చి, యందరకు తాళ్ళిచ్చి రాత్రులం దెవ్వరును నిదురపోరా దని చెప్పి వంతులు వంతులుగా నిదురపోవుట యేర్పాటు చేసి ప్రతి గ్రామమునందు వారికి దోడుగాఁ దన కొంతసైన్యము నుంచి చుట్టుపట్టుల నున్న యైదువందలగ్రామములు మ్లేచ్ఛులు దండెత్తుటకు వీలులేకుండఁ జేసెను. ఏగ్రామమున కేవైపుననుండి వత్తురో వారికిఁ దెలియును. వీరందఱు కాగడాలు వెలిగించుకొని తెల్లవారులు కూర్చుందురు. వారి జాడ కనిపించినచోఁ దఱిమితఱిమి చంపుదురు. మ్లేచ్ఛులు రాత్రులందుఁ బల్లెలమీఁదఁ బడుదురు. అప్పుడు వారి దుర్గములు నిర్జనములుగా నుండును. నీలాంకుఁడు రాత్రులందు వారి దుర్గములను బోయి ముట్టడించును. అచట స్త్రీలును శిశువులుమాత్రమే యున్నచో వారిని బంధించి తీసికొనివచ్చును. దోపిడికాండ్రే యున్నచో వారిని వధించును. వారు దండెత్తిపోక జనమందఱు నున్నచో యుద్ధము చేయును. వారును వీరును జత్తురు. ఒక్కొక్కప్పుడు వారే గెల్తురు. ఒక్కొక్కప్పుడు వీరేగెల్తురు. ఇట్లాఱు నెలలు నీలాంకుఁడు వారితో బోరాడెను.

తా నొకటి చేసెను. మ్లేచ్ఛులమీఁదకుఁ దాను బోయినపుడు తన వెంటఁ దీసికొనిపోయిన సేన తనసేన కాదు. ఉత్తరజ్యోతిషాధిపతి సేన. అందుచేత వారు కొందఱు సుశిక్షితులుకారు. వారిలోఁ గొందఱు మ్లేచ్ఛాభిమానులు. అందుచేత నతని ముట్టడులు కొన్ని వ్యర్థములు కాఁజొచ్చెను. నీలాంకుఁ డూహించెను. 'నేను లోభము పోయితిని. గాంధారపతిసేన పదివేలమందిని చెక్కుచెదరకుండ రాజున కప్పఁజెప్పఁదలఁచితిని. ఇరుగుపొరుగురాజ్యము లుండును. ఎంత కాదన్నను నా సరిహద్దులలోని ప్రజలకు స్నేహము లుండును. చుట్టరికము లుండును. ఒకరియం దొకరువిశ్వసింతురు. ఇది మా రాజ్యము కాదు. అన్ని ప్రబలమైన విశ్వాసమును. భక్తియుఁ బరిశుద్ధమైన భావము కలవారే యిట్టి సమయములయందు వ్యవహరింపవలయును. వారిసంఖ్య మానవజాతిలో స్వల్పముగా నుండును. ఈ రాజ్యములోని కొందఱకుఁ బొరుగురాజ్యములో నాస్తి యుండును. ఆ గ్రామములవారితో వియ్యములు కలిపికొందురు. అట్టివారు రాజులకు రాజులకుఁ బడనపుడు తమయొక్క విశ్వాస మంతయుఁ దమ రాజునెడలఁ జూపింతురా? తమ యాస్తి యెచ్చటనున్నదో తమ ప్రేమ యెచ్చట నున్నదో యచ్చట చూపింతురు. ఇచ్చటి మతము వేఱు. ఎవని కేమతము నచ్చునో తెలియదు. కొందరు సంప్రదాయబద్ధులు. కొందరు సంప్రదాయమునకు విరోధులు. భారతీయమతము వేదమతము, సర్వోత్కృష్టమైనదని యెవరికిఁ దెలియును? మహర్షులవలె నూహింపగలవారికిఁ దెలియును. కృష్ణుఁడు భగవంతుఁ డని తెలిసినవారికిఁ దెలియును. ఇది యొకనిగూఢతరరహస్యము. సంభరితమైన మతము. కొన్ని యాచారములుసులభముగా మానవుల నాకర్షించును. చలిదేశములలోఁ దెలవారుకడ మేల్కొని శీతోదకస్నానము చేయుటకు నెంతమంది యంగీకరింతురు. అట్లు చేసినచో దినముదినము మిక్కిలి యారోగ్యముగా నుండు నని, సర్వకార్యకరణమునం దధికోత్సాహము కలిగియుండు నని చెప్పినను వినరు. కొన్ని దినములయందు దానిని దా మనుభవించినను మఱునాఁడు విశ్లథచిత్తు లందురు. తీవ్రములైన నియమములు కలిగిన మత మెవ్వరికి నక్కఱలేదు. యధేచ్ఛముగా నుండవచ్చునని చెప్పిన మతము సర్వజనులకు నిష్టము:"

"నీలాంకుఁ డిట్లూహించి మ్లేచ్ఛుల దుర్గములను ముట్టడించుటకుఁ బోవువేళ ప్రతిసైనికునియొక్కయుఁ బ్రతి సేనానియొక్కయుఁ బుట్టుపూర్వోత్తరములు తెలిసికొని వారిలో నీషత్తైనను మ్లేచ్ఛాభిమానము లేదని గుర్తించి వారితోడనే యుద్ధములకుఁ బోవుచుండెను. ఆఱునెల లగుసరికి దేశమంతయు నిర్మ్లేచ్ఛ మయ్యెను. నిష్కంటక మయ్యెను. నీలాంకుఁడు పొలిమేర గ్రామములయందు జనులకు 'మ్లేచ్ఛులతో సంబంధము పెట్టుకొనవలదు. వారు వేద

మతదూషకులు. వారు దోచికొనెడివారే కాని వచ్చి యిచట నిండ్లు కట్టుకొని సంసారములు చేసెడివారుకారు. వారి దేశములలో మీరు కొంతయాస్తిని సంపాదింపవలదు. చుట్టరికములుపెట్టుకొనవలదు. ఇట్టిరాజవిప్లవములు వచ్చినపుడు మీరు నష్టపడుదురు'— ఇట్లు బహుప్రచారములు చేసెను.

వృద్ధులైన క్షత్రియులను బ్రాహ్మణులను వేదపురాణేతిహాసములయందు శ్రద్ధ కలిగిన తదితరజాతులలోని న్యాయస్థు లని ప్రసిద్ధి పొందినవారిని, వయసుమీరిన వారిని సమకూర్చి వారి నొక పరిషత్తుగా నేర్పఱచి ప్రతిగ్రామమునందు యువకులను ప్రోగుచేసి వారి కాయుధములనిచ్చి కట్టుదిట్టములు చేసి తన సేనతోఁ బుష్కలావతీ పురాభిముఖముగా నడచు చుండెను.

హిరణ్యాక్షుడును నీలాంబరుడును తమ సైన్యములతో సింహపురీ రాష్ట్రములకు బయలుదేరిరి. నాలుగేండ్లనుండి రాజ్యమున కర్త లెవరన్న విచారణలో హిరణ్యాక్షునిపేరే లేదు. నేడుక్రొత్తగాహిరణ్యాక్షుడువచ్చెను. రాజునకు తమ్ముని కుమారుడు; ఆ తమ్ము డెప్పుడో చనిపోయెను. కాని హిరణ్యాక్షుని మేనమామలు పెంచుచుండిరి. కాని తొలుత హిరణ్యాక్షుని రాజు తనవద్దనే యుంచుకొన నెంచినాడు. ఇది పదునెన్మిదేండ్ల క్రిందటి మాట. తమ్ముడు బ్రతికియుండగా రాజునకు తమ్మునకు బడెడిదికాదు. అందుచేత మేనమామలు హిరణ్యాక్షుని రాజువద్ద నుండ నీయలేదు. తరువాతతరువాత రాజునకు హిరణ్యాక్షునిమీద ప్రేమ పెరిగినను, హిరణ్యాక్షునకు పెదతండ్రిమీదకంటె మేనమామలమీదనే యెక్కువ ప్రేమ యున్నది. పుష్కలావతీపురమున రాజప్రాసాదమునకు రాజబంధువుల గృహములకు మిక్కిలి దవ్వు. అది యొకయూరు, ఇది యొకయూరనవచ్చును. పండుగలు పబ్బములు ఉత్సవములు వివాహములు మొదలైన వేళలయందు రాకపోకలు జరుగునుగాని తక్కిన వేళలయందు వారికి వీరికి సంబంధము లేవి యట్లే యుండును. వారును వీరును గలసి కొన్నప్పుడు బంధుత్వమర్యాదవిజృంభమాణముగా నుండును. అన్నగారు తమ్ముడుగారు బావగారు మొదలైన పిలుపులలోను స్వల్పములైన వ్యవహారములలోను క్రీడాదులయందును వారి బంధుత్వ మెంత చిక్కనయో వ్యవహారములయం దంత పలుచన. అన్ని రాజబంధుకుటుంబము లున్నవి. ఒకదాని కొకటి మనస్సులలో పొసగదు. ఒక రాజబంధువుకుమారుడు సేనాపతి యైనచో తమ బిడ్డలను రాజు సేనాపతిని చేయలేదని తక్కినవారికి కడుపుమంట. అది గొబ్బు. ఇట్టి చిన్నిచిన్ని మనసులలోని విరక్తముల తోడనే వారి బంధుత్వములు వివాహాదులయందు పైనుండి చూచువారికి పరమ సౌహార్దభూమిగా కన్పించును. ఇట్టి పరిస్థితిలో హిరణ్యాక్షు నెందు కెన్నికొనిరో తెలియదు. నీలాంబరుడు పాతికయేండ్లవాడు. ఈ రాజకుమారు లందఱు వయసుకలవారే. ఎవ్వరికిని వివాహము కాలేదు. తండ్రులు చేయలేదు. పెండ్లికుమార్తెలు సిద్ధముగా నేయున్నారు. వారికి పెండిండ్లైనచో సంతానము కలిగినచో రాజు దత్తత చేసికొనదేమో యని భయము. ఆ దత్తత యెవనిని జేసికొననో చూచి తరువాత వివాహము చేసికొనవచ్చు నని యందరు నాగిరి. హిరణ్యాక్షుడు నీలాంబరునకు చిన్నవాడు. వారును వారు బంధువులే. హిరణ్యాక్షునితో తమ్మునితోవలెనే మాటాడును. తన నీలాంకుల నడుమ నున్న ముడి చాలక వీడు వచ్చినాడు. నీలాంకు డన్నచో నీలాంబరునకు భయములేదు. అతడు తనముందు నిలువలేడు. ఎవరి నెన్నుకొనవలయు నన్న ప్రశ్నలో నీలాంకుడు లేడనియే నీలాంబరుడు నిశ్చయించుకొనెను. సింహపురీరాష్ట్రమున మ్లేచ్ఛుల వత్తిడి తక్కువ. రాజు తన్నిచ్చటికి బంపించెను. మరియైదువేల సైన్యము నెక్కువ యిచ్చెను. ఎక్కువ యొత్తిడి కలిగిన ఉత్తరజ్యోతిషమునకు తక్కువసైన్యముతో నీలాంకుని పంపెను. జరిగినచో నీలాంకునికి పరాభవము. లేనిచో మృత్యువు. ఇందులో దేనినో వాంఛించియే రాజును మిహిరకులుడును నిట్లుచేసిరి. ఇప్పు డెన్నిక తనమధ్య హిరణ్యాక్షుని మధ్య నున్నది. హిరణ్యాక్షుడు తమ్మునికుమారుడు గనుక తాను తన తమ్మునికొడుకునకు నన్యాయము చేయలేదని చూపించుటకు వీనిని తనతోగూడ బంపించెను. "అతనికి గూడ నవకాశమిచ్చితిమి. అతడుసరిగానిర్వహించుకొనలేకపోయెను. అట్టివానికి రాజ్యమిచ్చుట యెట్లు? మొదలైనమాటలతో తనయందలి దోసమును తొలగించుకొనుటకు రాజిట్లు చేసెను." ఇట్లూహించుచు నీలాంబరుడు సింహపురీరాష్ట్రమునకు బోయెను. హిరణ్యాక్షుని తన క్రిందివానినిగా జూచుచుండెను. నీలాంబరు డుత్తరజ్యోతిషములకు బోయి మ్లేచ్ఛు లేర్పరచుకొన్న దుర్గములను తెలిసికొనెను. ఆ దుర్గము లుత్తరజ్యోతిషదుర్గములకంటే బలిష్ఠములు. ఇచ్చటి మ్లేచ్ఛసేనలు గడుసుమీరిన సేనలు. వారు మిక్కిలి క్రూరులు. సింహపురీరాష్ట్రము గాంధారము నంటుకొని యుండును. ఉత్తరజ్యోతిషము కొంచె మెడముగా నుండును. మ్లేచ్ఛులు భారతదేశమునకు బ్రవేశించెడి పర్వతమార్గములు సూటిగా కటకసింహపురరాష్ట్రములోవి కున్నవి; ఇట్లు వచ్చినవా రుత్తరజ్యోతిషము బోదురు. సింహపురీరాష్ట్రాధిపతి నాలుగేండ్లక్రింద మిహిరకులుని పరాక్రమమునకు తట్టుకోలేక వాని నియమముల కంగీకరించినవాడే కాని సహజముగా మ్లేచ్ఛాభిమాని. అప్పటి ప్రజల యాచారవిశ్వాసములు మ్లేచ్ఛజనుల యాచారవిశ్వాసములకు చాల సన్నిహితత్వము కలదు. నీలాంబరుడు పోయి రాజుతో మాటాడలేదు. ప్రజలను పరామర్శించలేదు. సింహపురీరాష్ట్రసైన్యమును సాయ మడగలేదు. పోయి కొండలయందు గుడారముల నేర్పరచుకొనెను. మ్లేచ్ఛులతో యుద్ధము చేయ నారంభించెను. మిహిరకులుడు నీలాంబరుని

బంపునపుడు తనవెంట దెచ్చిన వేయిమంది కాశ్మీరధానుష్కులను బంపెను. ఆ విలుకాండ్రు లేనిచో నీలాంబరుడుతన సర్వప్రయత్నమువ్యర్థమైనదని తిరిగియింటికి బోవలసియుండెడిది. వారు తమ యమ్ములతో దూరమునుండి దుర్గముమీద నున్నవారిని రాలు పడద్రోయువారిని, కత్తులు విసరువారిని యధేచ్ఛముగా సంహరింపసాగిరి. మ్లేచ్ఛులు విలుకాండ్ర యొత్తిడికి విచ్చిపోయిరి. వా రున్నచో దుర్గములలో నుండవలయును. లేనిచో గత్తులు పూని విడియుద్ధములకు రావలెను. ఆ కొండలమీదివి పేరునకు దుర్గములు కాని వానికి పెద్ద ద్వారములు లేవు. కందకములు లేవు. ప్రాకారములుగూడ పేర్చినరాళ్ళు. సింహపురీరాష్ట్రాధిపతి తనకు పట్టన ట్లూరకుండెను. ఆరునెలలు యుద్ధములు జరిగెను. మ్లేచ్ఛుల కాహారపదార్థములు పోకుండజేయుటకు వీలు లేకుండబోయెను. సింహపురీరాష్ట్రప్రజలే వారికి వలసినన్ని సదుపాయములు కలిగించుచుండిరి. నీలాంబరుని పదివేలసేన నాశనమయ్యెను. హిరణ్యాక్షుడు యుద్ధములో మరణించెను. మ్లేచ్ఛులను యుద్ధమునందు వేలమంది మడసిరి. ఇరుపక్షములకు దుఃఖమయ్యెను. నీలాంబరుని పరాక్రమము ముందు మ్లేచ్ఛులు నిలువలేకపోయిరి. అతడు గుఱ్ఱ మెక్కి ఖడ్గమును బూని, డాలునుకూడ పూని నాలుగువేలమంది మ్లేచ్ఛులలో జొరబడినను వానిని మ్లేచ్ఛులేమియు జేయలేకపోవుచుండిరి. చివర కిరుపక్షములును సంధి జేసికొనిరి. మ్లేచ్ఛులు దుర్గములను వదలిరారాదు. తత్ప్రాంతములయందలి గ్రామ గ్రామటికాప్రజలు దీని కొప్పుకొనిరి. అప్పుడు నీలాంబరుడు తన మిగిలిన సేనతో పుష్కలావతీనగరమునకు వచ్చెను. సన్నసన్నగా నీలాంకుడు దుత్తరజ్యోతిషమున నెరవేర్చిన కార్యసాఫల్యము తనకు దెలియుచున్నను దా నింటికి వచ్చువేళకు నీలాంకు డుత్తరజ్యోతిషములందు భద్రత నెలగొల్పి సుఖముగా సురక్షితముగా తనసేన చెక్కుచెదరకుండ నింటికి వచ్చినాడన్న నిశ్చయమైన వార్త నీలాంబరున కెంతయైన నీర్ష్యను కలిగించెను. అతడు తనవారితో నిట్లనుచుండెను: "ఉత్తరజ్యోతిషమునందలి కార్యము సులభమైనది. అచటిమ్లేచ్ఛులు క్రూరులుకారు. సానబెట్టిన కత్తులుకారు. అచటి కోటలు కోటలుకావు. ఆడుదానిని పంపించిననైన నచట గెలిచివచ్చును. నేను పలుసార్లు వందలకొలది మ్లేచ్ఛవీరులచేత చుట్టికొనబడితిని. మరి యింకొకడైనచో నెట్టుకొనలేడు. వారు సంధి చేసికొని రనగా నా కత్తియొక్క తీవ్రత కాగుకొన లేక చేసిరి. అందాకనెందులకు ఇప్పుడు నేను సంధిచేసికొనివచ్చితినికదా! ఇప్పుడైనను సరే నీలాంకుని బోయిరమ్మనుము. బ్రతికివచ్చినచో జాలును."

హిరణ్యాక్షుడు చనిపోయెను. రాజున కొకప్రశ్న తీరినట్లుండెను. అతడు నిజముగా రాజ్యమునకు వారసుడు. అతడుండగా రాజు మరియొకనికి రాజ్య మిచ్చిన ప్రజలకు తృప్తిగా నుండదు. ఇప్పుడు మిగిలిన దిద్దరు. మరల రాజ మంత్రి పురోహిత సేనాపతి కళ్యాణవతీ మిహిరకుల దర్పమల్లుల సమావేశము జరిగెను. నీలాంకుడు నిస్సందేహముగా రాజకీయవేత్త. వ్యవహారదక్షుడు. కార్యసాధకుడు. నీలాంబరుడు వట్టి పరాక్రమవంతుడు. మహావీరుడు. నీలాంకునికంటే నీలాంబరుడు దగ్గరి బంధువు. కనుక రాజ్యము నీలాంబరున కిచ్చుటయే న్యాయము. ఇట్లునిర్ణయింపబడగా మిహిరకులు డిట్లనెను. "వట్టి శౌర్యపరాక్రమములు కాలిబంటునం దుండవలెను. సేనాపతులయం దుండవలెను. రాజునం దుండవలసినది ప్రధానముగా రాజనీతి. రాజు యుద్ధము చేయనక్కరలేదు. తన సైన్యమును బంపి తాను పైనుండి తన నీతిచేత నెచట నెప్పుడు యుద్ధములు సాగించవలెనో ఎచట శత్రువునదుమవలెనో వాని నెట్లదుమవలెనో తెలిసినవాడు రాజును మహాసేనాధిపతియు నైయుండవలెను. నీలాంకుడు ప్రధానముగా నీతివాది. అతని పరాక్రమము మనకు తెలియదు. అతని పరాక్రమమును గూడ మనము పరీక్షించి రాజ్యమతని యధీనమం దున్నచో రాజ్యము సుభిక్ష మగును. ప్రజలు సుఖపడుదురు. శత్రువులు రాజ్యము వంక తేరిపారిజూడరు."

మిహిరకులు డిట్లనగా దర్పమల్లుడు తల యూపెను. అతని యూహయు నిట్టిదే. అపుడు గాంధారరాజ్యమహాసేనాపతి యిట్లనెను: "నిజమే.అయినను ప్రజలకుపరాక్రమము తెలియునుగాని రాజనీతి తెలియదు. వారు నీలాంకుని గోరరు. నీలాంబరుని గోరరు. ప్రజల చిత్తవృత్తి యట్టిది. తమకనవసరముగ నుద్వేగము కలిగించువిషయములయం దుత్సాహము చూపింతురు. శాంతిని నెరపువానియందు ప్రజలు రమించరు. చిత్తానందము కూర్చి యంతఃకరణమునందు జొచ్చి తత్కాలమున నింద్రియముల నుపసంహరింపజేయు మహాసంగీతమును ప్రజలు వినలేరు. తమ కుద్రేకము కలిగించు సామాన్యస్వరములసంపుటితో కూడి సులభమైన లయ కలదై యసభ్యమైన శృంగారవాస లీను ఫణతులయందు పాటలయందు జను లధికముగా రమింతురు. అందుచేత నీలాంబరుని రాజు చేయుటయే ప్రజల కిష్టముగా నుండును." మంత్రి యిట్లనెను: "నీలాంకుడు పరాక్రమవంతుడో కాదో మనకు తెలియదు. అతనిని మనమొకకార్యముమీద బంపితిమి. అతడు దానిని నీతిశక్తిచేత సాధించుకొని వచ్చినాడు. వాని పరాక్రమ మిట్టిదని మనకు తెలియదు. దానిని పరీక్షింపుడు. అతడు పరాక్రమవంతుడనిగూడ తెలిసినచో సుఖముగా నతనిని మహారాజు దత్తుడుగా స్వీకరింపవచ్చును." అనగా పరీక్షచేయుట యెట్లన్న ప్రశ్న వచ్చెను. కళ్యాణవతి యిట్లనెను : "ఇద్దఱి నడుమ తులాయుద్ధ మేర్పరచినచో నెవ డధిక పరాక్రమవంతుడో తెలియును." రాజు: "నీలాంబరుడు నీలాంకుని వధిం

చును." దర్పమల్లుడు : "కావచ్చునుగాని నిశ్చయముగా చెప్పలేముకదా!" మంత్రి : "నీలాంకు డంగీకరింపనిచో నేమి కావలెను?" సేనాపతి : "అప్పుడు ప్రశ్న లేదు. నీలాంబరుడు రాజగును— నీలాంకునితో నీసంగతి చెప్పవలెను. రాజ్యమునం దిది తెలియవలెను. సర్వమంత్రులకు సర్వసేనానులకు నిది విదితము కావలెను."

మరునాడు రాజు పెద్దసభ చేసెను. ఈ సంగతి సర్వజనులకు విదితము జేసెను. మంత్రి యిట్లు చెప్పెను : "మనరాజుగారికి పురుషసంతానము లేదు. కళ్యాణవతీదేవిగారి యొక్క భర్తకు రాజ్య మీయవలయు నవి రాజుగారు కోరిరి. మన యల్లుడుగారైన కాశ్మీరాధిపతులు తమ కీరాజ్యము వల దనిరి. మొన్న సింహపురీరాష్ట్రమునకు మ్లేచ్ఛుల యొత్తిడి నదుముటకు నీలాంబరునితో హిరణ్యాక్షుడు పంపబడెను. హిరణ్యాక్షుడు రాజుగారికి తమ్మునికొడుకు. ఆయన యచట తన బల పరాక్రమములు నెఱపి ప్రసిద్ధుడై వచ్చినచో మహారాజుగా రతనిని దత్తుడుగా స్వీకరింపనెంచిరి. దైవదుర్విపాకమున నన్యథా జరిగెను. ఇప్పుడు నీలాంక నీలాంబరు లిద్ద రున్నారు. నీలాంకుడు రాజనీతివేత్త. నీతివేత్తలైన మహాపండితు లీ నిర్ణయము చేసిరి. దానికి సాక్ష్యముగా నీలాంకు డుత్తరజ్యోతిషరాజ్యములందు నీతిని ప్రదర్శించి కార్యము సానుకూల పరచికొని వచ్చెను. నీలాంబరుడు పరాక్రమశాలి, శౌర్యవంతుడు. వేయుమంది శత్రుసైన్యమునందైన యప్రతిహతముగా సంచరింపగలవాడు. ఇద్దరు సమానస్కంధములో నున్నారు. నీలాంకునంతటి రాజనీతివేత్త యుద్ధనీతివేత్త నీలాంబరుడు కాడు. నీలాంబరునియంతటి పరాక్రమవంతుడు నీలాంకు డగునో కాదో తెలియదు. మహారాజుగారు దత్తుడుగా స్వీకరించుట యీ సమస్యమీద నిలచియున్నది. వా రిద్దరు కత్తియుద్ధము చేసినచో నెవరో యొక రధిక పరాక్రమవంతులని నిర్ణయింపబడినచో వారు రా జగుదురు. ఈసమస్యాపరిష్కారము జరుగవలెను. వా రిద్దరు దీని కంగీకరించినచో రాజ్యమునకు పెద్దసమస్య తీరిపోవును. అనగా నీలాంబరుడు లేచి: "నేను దానికి సిద్ధముగా నున్నా" ననెను. నీలాంకుడు లేవలేదు. బంధువు లతనిని ప్రోత్సహించిరి. అతడు లేచినిలుచుండి యిట్లనెను: "రాజసభాకర్తలకు నమస్కారము! నాకు రాజ్య మక్కరలేదు. మీ రిచ్చినచో వల దనుటకాదు. నాకంటె నీలాంబరుడు రాజుగారికి దగ్గఱి బంధువు. ఈప్రశ్న లేకుండ హిరణ్యాక్షుని దత్తత చేసికొన్నచో బాగుగా నుండెడిది. అది న్యాయము. హిరణ్యాక్షుడు కుఱ్ఱవాడు. కాలక్రమమున నతడు పరాక్రమవంతుడును నీతిమంతుడును నయ్యెడివాడు. నీలాంబరుడు రాజైనచో నే నాతనిని సేవింతును. రాజద్రోహము చేయను. న న్నడిగినచో రాజునకు కలిగెడి సర్వక్లిష్ట సమస్యలందు నాకు దెలిసిన హిత ముపదేశింతును." అనగా నీలాంబరు డిట్లనెను; "నాకు నీ నీతి యక్కర లేదు. చేతనైనచో నాతో యుద్ధము చేయుము. నీ కీ రాజ్యమక్కరలే దన్నావు. ఆమాట బాగుగా నున్నది. తక్కిన దంతయు నప్రస్తుత ప్రసంగము." నీలాంకుడు: "నేను బంధుత్వమును పురస్కరించుకొని రాజవంశమును పురస్కరించుకొని రాజ్యపాలనా భద్రతను పురస్కరించుకొని చెప్పితిని కాని యహంకారముచేత కాదు." నీలాంబరుడు : "నేను నీలాంబరునిముందు నిలువలేను; నేను యుద్ధమాడను; అని యొక్కమాట చెప్పినచో సరిపోయెడిది." నీలాంకుడు : "నేను నీతో నొకసారియైన యుద్ధమాడి యోడిపోయినకదా అట్లు చెప్పవలెను. ఇద్దరము రాజవంశీయులము, ఇద్దఱము యుద్ధవిద్య నేర్చినవారమే. ఒకవిద్య యిద్దరు నేర్వవచ్చును. ఎవడు నేర్చినవిద్య యెట్లు ప్రకాశించునో ప్రయోగము చేత కాని తెలియదు—" ఆనాటి సభ దానితో నయిపోయెను.

సమస్య సమస్యగానే యున్నది. మరల మూడుదినము లైనతర్వాత నంతటిసభయు సమావేశపెట్టబడెను. సభలో సేనాధిపతి నీలాంకునితో నిట్లనెను: "అయ్యా! నీలాంకా! ఆనాడు మహారాజు సభ నాపివేసెను. మీకు నాల్గుదినముల వ్యవధి నిచ్చుట కట్లు చేసెను. ప్రభువులు దత్తత చేసికొనుటకు పరాక్రమవంతుడు నీతిమంతుడునైనవా డైనచో నిష్టపడుచున్నారు. అట్లు కుదురనిచో వానినో వీనినో స్వీకరింతురు. వావిడిచి చెప్పినచో నీలాంబరుడు మీవంటి నీతిమంతుడు కాడని రాజసభయొక్క యభిప్రాయముగా నున్నది. తమరు నీలాంబరునివంటి పరాక్రమవంతులుకూడ నైనచో—చాటు లేకుండ చెప్పుట కాజ్ఞ యైనది— రాజ్యము యొక్క భద్రతకొరకు మిమ్ము స్వీకరింపవలెనని యున్నది. రాజుగారికి రాజు కాబోవువాడు ముఖ్యముగా పరాక్రమవంతుడు కావలెను. అతడు నీతివేత్త యగుట మిక్కిలి యిష్టము. మీరు మృగాంకునితో ద్వంద్వయుద్ధము చేయుట కంగీకరించినచో దానివలన విషయము నిర్ణయించికొనవచ్చును. అంగీకరింపవలయు నని రాజసభ నా ముఖముగా మి మ్మభ్యర్థించుచున్నది." అపుడు నీలాంకుడు లేచినిలుచుండి యిట్లనెను: "ఆర్యా! సుక్షత్రియుని పరాక్రమము రెండు విధములుగా నుండును. ద్వంద్వయుద్ధములోని నేర్పు వేరు. వేయిమంది శత్రువులు చుట్టుముట్టినప్పటి పరాక్రమ ప్రదర్శనలక్షణము వేరు. రెండవదానియందు నీలాంబరుడు నిష్ణాత యన్నవిషయము సింహపురిలో తేలినది. నేను దొమ్మియుద్ధము చేయలేను. ఇప్పు డొకవేళ నీలాంబరునితో యుద్ధము చేసినచో గెలిచినచో ద్వంద్వయుద్ధవిశారదుడ నగుదును. ఈ యెన్నిక యిప్పటికే చాల యాలశ్య మైనది. మహాయోధుడైన కాశ్మీరరాజ్యాధిపతి మామగారి నేలయందలి మర్యాదచేత నిన్నాళ్ళచట నుండిరి. నే నొకటి మనవిచేయుచున్నాను. నాకు గొంత సైన్య మిచ్చి సింహపురీ రాష్ట్రిమునకు బంపుడు. మ్లేచ్ఛులతోడి సంధి మాని వారల కొండలయాత్రలకు ద్రోలి నీతి నుపయోగించకుండ దొమ్మియుద్ధములలో

నీలాంబరునివలెనే వందలాది వీరసైనికుల నడుమ వీరవిహారము చేయగలిగినచో నీ రెండుశక్తులలో నాయనకు గల యొకశక్తి నాయందుకూడ గలదని స్థిరపడినతరవాత ద్వంద్వయుద్ధము చేయవలెను. ఈ రెంటి యందు నేనుత్తీర్ణుడ నైనచో నపు డతని వంటి పరాక్రమవంతుడ నగుదును. నే నభ్యర్థించెడిదానిలో నొక క్లేశ మున్నది. సింహపురీ రాష్ట్రగత మ్లేచ్ఛవ్యవహారము నీతిచేత ఖడ్గముచేత రెంటిచేత పరిపాలింప బడవలసినది. ఆ రాష్ట్రపతి మ్లేచ్ఛాభిమాని. కొండల నంటుకొనియున్న యూళ్ళన్నియు మేచ్ఛాభిమానము కలవి. ఐదేండ్లక్రింద కాశ్మీరాధిపతి చేసిన నియమము లక్కడ చెదరిపోయియున్నవి. నేను పోయి దుర్గస్థులైన మ్లేచ్ఛులను దాకుదును. వెనుకనుండి రాష్ట్రపతి రహస్యముగా వారికి సాయము చేయుచుండును. ప్రజ లందరు వారికి సాయపడుదురు. నేనీ కట్టుదిట్టము చేయకుండ నే నచటికి వట్టియుద్ధమునకు బోవుచుంటి నని మీతో చెప్పుచుంటి ననగా కొరవితో తల గోకికొనుచుంటి నని యర్థము. నన్ను మీరు పంపినచో నేను నిశ్చయముగా తిరిగి రాను. ఆ పరీక్ష లేకుండ నీ పరీక్ష కర్థము లేదు."

మిహిరకులుడు: "ఓయి! నీలాంకా, ఎవడు రాజగునో పొరుగురాష్ట్రమందలి భద్రత వాడు చూచుకొనవలెను. రాజు బొమ్మియుద్ధములో సిద్ధహస్తుడై యుండ నక్కరలేదు. తమ రాజును వారి సేన లెప్పుడును రక్షించుచునేయుండును. ఎప్పుడైన నేకాకిగా తీవ్రలక్షణములు గలిగిన శత్రు వీరునితో నొంటరిగా దలపడవలసిన యవసరము వచ్చినచో రాజు తన యాత్మరక్షణము దాను చేసికొనగలవాడై యుండవలెను. మాకు గావలసినది నీవు నీలాంబరునితో ద్వంద్వయుద్ధ మాడవలయుట. నీ వంగీకరింతువా?" నీలాంకుడు: "నా కభ్యంతరము లేదు. ఇది నాకు రాజ్యమునందలి యాన కాదు. నేను వీరుడను కానన్న యపప్రథకు నే నంగీకరింపవలసివచ్చుచున్నది." నీలాంబరుడు: "ఆ యపప్రథ నీ కెట్లును దప్పదు." నీలాంకుడు: "ఒకయపప్రథ వచ్చినతరువాత బ్రతుకుట యెందుకు?" నీలాంబరుడు: "నేను నీతిమంతుడను కానన్న యపప్రథ కలిగికూడా బ్రతికియున్నా నని యాక్షేపించుచుంటివా?" నీలాంకుడు: "నావిషయము నేను చెప్పికొంటిని." నీలాంబరుడు: "నిన్ను దృటిలో సంహరింతును." నీలాంకుడు: "నేను నట్లే యనుకొనుచున్నాను." నీలాంబరుడు: "అయినచో చచ్చుటకు సిద్ధముగా నున్నా వన్నమాట."

నీలాంకుడు నవ్వెను. సగముమంది కతని నవ్వుయొక్క యర్థము తెలిసెను. రాజసభలోనివా రందరకు నీలాంబరుడు నీతి నెఱుగనివాడేకాడు, వాక్యార్థసమన్వయము కూడ చేసికొనలేనివా డని తెలిసెను. కొంత సేపటికి మిహిరకులుడు లేచి కత్తియుద్ధము మరునాటిసాయంత్రమున జరుగునని యిద్దఱిని సిద్ధముగా నుండు డని చెప్పెను.

మరునాడు ప్రొద్దువాటారుటోవువేళ మహాసైన్య మంతయు నొకవైపున రాజాధికారులు రాజబంధువులు నొకవైపున ప్రజలందరు నొకవైపున మువ్వైపులను మూగియుండగా కొందరాసనముల మీద గూర్చుండి వెనుకటివారు మరికొన్నియాసనములమీద నిలుచుండి జనులువృక్షములనెక్కి, ఎచట యెత్తుగా నున్న నచట జనులు మూగి, ప్రాఙ్ముఖముగా రాజాసనము తీర్చబడి యా యాసనపు కెలంకుల రాజసభాసభ్యులు కూర్చుండగా వందగజముల చతురశ్రమైన నడిమి స్థలము ద్వంద్వయుద్ధమున కేర్పాటు చేయబడియున్నదానిలో రెండువైపులనుండి నీలాంక నీలాంబరులు ప్రవేశించిరి. ఇద్దరు గుఱ్ఱములపై నుండిరి. ఇద్దఱికి డాళ్ళు కలవు. ఇద్దరివద్ద ఖడ్గము లున్నవి. కటారు లున్నవి. ఇద్దరును ధనుష్పాణులైయున్నారు. ఇద్దరి గుఱ్ఱములు రెండు మెఱపు లొరసికొన్నట్లు కలిసికొనెను. కత్తులతో డాలుతో పొడిచికొనిరి. దెబ్బల నాపికొనిరి. పదినిమిషము లైనతరువాత మధ్యవర్తియొక్క ఘంటానినాదమువలన విడివడవలయును. నీలాంకుడు కత్తి విసరుట నాపి వెనుకకు తగ్గుచుండగా నీలాంబరు డతనిమీదికి దూకెను. మధ్యవర్తి ఘంటానినాదమును తీవ్రముగా చేసెను.

అప్పుడు నీలాంబరుడు వెనుకకు తగ్గెను. కొంతసేపటికి నిద్దరును మరల గలిసికొనిరి. నీలాంకుడు మధ్యవర్తితో నీలోపుగా మాటాడెను. ఎవరి గెలుపో యొకరి గెలుపు నిర్ణయింపబడెడిదాకా ఘంటానినాదము చేయవల దనెను. అతడు పోయి రాజసభతో నివేదించెను. సభ యంగీకరించెను. వీరు లిద్దరు మరల గలిసికొనిరి. ఆ యుద్ధ మెంతసేపు జరిగినదో తెలియదు. ఎవ్వరికిని కాలము గడుచుచున్నట్లులేదు. కొంత సేపటికి నీలాంకుని డాలు ఛిన్నభిన్నమై నేలబడిపోయెను. అతనిచేతి కింకొక్కడాలిచ్చుటకు తక్షణీయు డొక్కడు పోవుచుండగా నీలాంబరుని పక్షమువా రభ్యంతరము పెట్టిరి. ఆ యుద్ధములో నొక్క సంగతి యందరకుగూడ తెలిసెను. నీలాంకునకుగూడ దెలిసెను. నీలాంబరుడు సర్వదా తనను సంహరించుటకే ప్రయత్నించుచున్నాడు. తాను తన్ను రక్షించుకొనుటకున్ను నీలాంబరుని నిరాయుధుని చేయుటకున్ను ప్రయత్నించుచున్నాడు. అందుచేత తన డాలు తునిగిపోయినది. తాను నీలాంబరుని వధించినచో సన్నిహితరాజబంధువులలో చాలామంది తనకు విరోధు లగుదురు. నీలాంబరుని గెలిచినచో నతడు తనను రాజ్యమునం దుండనీయడు. నీలాంకుడు విచిత్రముగా నీలాంబరుని గుఱ్ఱపుముట్టెను నఱికెను. అది పడిపోయెను. నీలాంబరుడు నేల వ్రాలెను. అతడు లేచెను. వేఱొక గుఱ్ఱము వచ్చెను. నీలాంకుడు కాదనలేదు. నీలాంబరుడు గుఱ్ఱము నెక్కలేదు. నీలాంకుని గుఱ్ఱమును దిగమనెను. నీలాంకుడు గుఱ్ఱమును దిగెను. మరల యుద్ధ మారంభించిరి. గడియలో నీలాంబరుని డాలు ముక్కలుముక్కలై పోయెను. నీలాంబరుని కవచము ఎక్కడిదక్కడ తెగిపోయెను. ధనుస్సు విరిగిపోయెను. ఖడ్గము పిడిదాక విరిగిపోయెను. అత డొక్కచురకత్తితో నీలాంకు నెదిరించెను. నీలాంకు డెడమెట్లు చూచెనో, ఎప్పుడు ధనుస్సు మోకాట వంచెనో ఎప్పు డమ్ము పరగించెనో నీలాంబరుని దక్షిణ బాహువు తెగిపోయెను. నీలాంబరు డెడమచేతితో చురకత్తి పూని బయలుదేరెను. ఘంటా నినాదమునతడు లెక్కచేయలేదు. రెండువందల మంది రాజపుత్రులునీలాంకునిమీదకు దూకిరి. అతడు గుఱ్ఱము నెక్కి వారి నందరను చెల్లాచెదరు చేసెను. సైన్యములు వచ్చెను. శాంతిని నెలకొల్పెను.

(సశేషం)

మృగతుని శిఖరారోహణ-తొలిమహిళాబృందం

కుమారి రాణి భగవాన్ దాస్

(గత సంచిక తరువాయి)

పర్వత శిఖరాన్ని చేరుకోవడం ఎంత కష్టమో బరువులు మోసే కూలీలను సంపాదించడంకూడా అంతే కష్టమని మాకు చెప్పారు. ఇది ఎంతవాస్తవమైన విషయమో మాకు త్వరలోనే తెలిసివచ్చింది. మా కూలీలు కాలులో ముల్లు మాదిరివారు. వారు దారిపొడుగునా మాకు అదికావాలి ఇదికావాలి అంటూ ముందుకు వెళ్ళడానికి నిరాకరిస్తూ వచ్చేవారు. అటువంటివారి బెడద తప్పుకోవడానికి వారిని వెళ్ళగొట్టేవారము. ఆ విధంగా మాకు విమోచనం లభించేది.

మరుసటి రోజు అనుకున్న విధంగానే సూర్యరశ్మి బాగా ఉంది. అప్పటికి మా సామానంతా చేరింది. అయితే మా వస్తువుల నన్నింటినీ ఆరబెట్టడానికి గానూ మరొక రోజు ఎండ ఉండడం ఎంతో అవసరం. అందుకే మా ఉపయోగార్థమై మేము ఉన్న ప్రాంతాలలో వాతావరణం గూర్చి ఆలిండియా రేడియో ఏమి వార్తలు ప్రసారం చేస్తుందోనని మేము ఆత్రంగా ఎదురు చూడసాగాము. వారు మాకు ముందుగానే హెచ్చరికాయుతమైన సూచనలు యిస్తున్నందుకు వారికి మా కృతజ్ఞతలు తెల్పాలి. ఆలిండియా రేడియోవారికి, వారి వాతావరణ శాస్త్రజ్ఞులకు మా వందనాలు.

ఇక మా ముందుకార్యక్రమం గూర్చి ఆలోచించుకోవాలి. కూలీలు, వారి క్రొత్త కోరికలు ప్రతిబంధకంగా నిల్చాయి. మేము ఏంతో నిస్సహాయస్థితిలో ఉన్నాము. కూలీల కోరికలుకూడా పెరిగాయి. ఇచ్చిన దానికన్నా అదనంగా ఆహారం అడిగేవారు. విశ్రాంతి తీసుకున్న రోజుకుకూడా అదనంగా జీతం అడిగేవారు. వారికి ప్రత్యేక గుడారాలు కోరేవారు. వారి భాషలో మాట్లాడగలిగే దుర్గ వారికి నచ్చచెప్పుతుండేది. యీ విధంగా వారి కోరికలు ఎంత నహేతుకమైనవి కావో వారిలో చాలామంది అర్థంచేసుకునేవిధంగానచ్చ చెప్పగలిగాము. శిఖరారోహణ చేయలేనివారిని, అయిష్టంగా ఉన్నవారిని కొంతమందిని వదిలేశాము.

మావద్ద ఉన్న ఆహారం కోటాను సరిశీలించడం, మావెంట తీసుకెళ్ళకుండా వదిలెయ్యాల్సిన వస్తువులను నిశ్చయించుకోవడం, ప్యాకింగ్ వగైరాలను తిరిగి పునర్విభజించడం వంటి విషయాలను ఆ రోజు చూచుకుని చివరకు 28వ తేదీ ఉదయం ధరంసి వెళ్ళడానికి సిద్ధమైనాము. ఉన్న కూలీలలో కొంతమందిని వెళ్ళకొట్టిన కారణంగా మా మొత్తం సరంజామాను మేము తీసుకెళ్ళలేమని గుర్తించాము. కూలీలకు సంబంధించిన ఆహారపదార్థాలను షేర్పాలు మోసుకురావడానికి అంటగట్టాము. ఆహారం వాడకంవల్ల కూలీల బరువు కొంత తగ్గిన వెంటనే షేర్పాలనుండి వారు సామాను సేకరించేవారు. దీనికై ద్విబుగేట నుంచి కూలీలను వెనక్కు పంపగలిగేవారము.

ఈసారి మేము శిఖరాన్ని అధిరోహించడం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. దీనికి కారణం సూర్యరశ్మి బాగా ఉండడమే. వంకర టింకరగాఉన్న మార్గంలో కూలీలు కూడా ఉత్సాహంగా యీలలు వేస్తూ నడక సాగించారు. కొన్ని సమయాలలో దారిలేని చోట్ల కొండకోనలు ఎక్కుతూ వెళ్ళేవాళ్ళము. ఆరాతిగుట్టలు అంత ఎక్కువ ఎత్తుఉండకపోవటంవల్ల, వాటినిఎక్కడానికి "కెటిల్ క్లైంబింగ్" అని నామకరణం చేశాము. పట్టుకోవడానికి అనువైన విధంగా ఉండి కెటిల్‌కు ఉండే చేతులమాదిరిగా ఉండటంవల్ల దీనికి యీపేరు పెట్టాము.

దట్టమైన అడవులు, నీలివర్ణం పర్వతాలను దేవదారు వృక్షాలను దాటి చివరికి ధరంసీకోనకు వెళ్ళాము. మంచుతో నిండిన కొండలు, ఎడారి భూములు మా ముందు కనిపించాయి. ధరంసీవద్ద నదీతీరంలో క్యాంపు వేశాము.

రాత్రి చలిగా ఉంది. అయినా మా స్లీపింగ్ బ్యాగులలో వెచ్చగా ముడుచుకున్నాము. గుడారం పైకప్పులు మంచుతో తడిసిపోయిన కారణంగా తిరిగి సూర్యరశ్మి వచ్చినప్పుడు వాటిని ఆరవేయాల్సి ఉన్నందువ మరుసటిరోజు ఉదయాన్నే వెళ్ళాల్సిన ప్రయాణం కొంత ఆలస్యమయింది. తడిసి ఉన్న గుడారాలను ప్యాక్ చేస్తే వాటి బరువు రెండింతలు అవుతుంది. మా బృందంలోని కొంతమంది సభ్యులు, సామానులు మోసే కూలీలు ముందుగానే వెళ్ళారు.

ఈసారి కొండ దిగడం కాబట్టి అంతా సుఖవుగానే ఉంటుందని ఆశించడం సహజమే కాని ఏటవాలుగా, దాదాపు నిలువుగా ఉన్న కారణంగా మేము చాలా వరకు మోకాళ్ళపై ఎక్కువభారం వేయాల్సి వచ్చింది. ఎంత బాధ కల్గిందో చెప్పలేము. యీ విధంగా ద్విబుగేట చేరుకున్నాము. ఇక్కడ దృశ్యాలు కన్నుల పండువుగా ఉన్నాయి. యీ సుందర ప్రదేశాలను చూచి, మా బాధలను మరచిపోయాము. మంచుతో కప్పబడిన కొండలు, నిటారైనపచ్చని దేవదారువృక్షాలు ఎంతో అందంగాఉండి అక్కడే

ఉండి పోదామనిపించింది. ఉధృతమైన అలలతో ప్రవహించే నదిపై ఉన్న పెద్ద వంతెనపైనుండి వెళ్ళాల్సి ఉంది. వర్షం తుంపర ప్రారంభమైంది. మరో వంతెన గూడా జారుడుగా వుంది. అయితేనేమి. దూరదృష్టిగల తార్షీ ముందుగా నే తాడును అమర్చినందున దాని సహాయంతో వంతెన దాటగలిగాము, అదృష్టవశాత్తు యెవరికీ మైకం కమ్మలేదు.

మేము క్యాంపు చేసిన ప్రదేశం చాలా మనోహరంగా ఉంది. 1957 లో శ్రీ గురుదయాల్‌సింగ్ నాయకత్వాన మృగతుని శిఖరారోహణకై యిక్కడికి వచ్చిన బృందంలోని ఒక సభ్యుడు నిమోనియోతో యీ ప్రదేశంలో మృత్యువు వాత పడినాడని. దానితో ఆ బృందం తమ ప్రయత్నాన్ని విరమించుకుని తిరిగి వెళ్ళిపోయారని అయితేమరుసటి సంవత్సరం విజయం సాధించారని — అమీర్ అలీ రిపోర్టువల్ల తెలిసింది.

కెప్టెన్ కుమార్ నాయకత్వంలో ఒక బృందం వచ్చినప్పుడు తన సన్నిహిత స్నేహితుడు షేర్పా ఒక్కడు ఇక్కడే మరణించాడని మాతో వచ్చిన షేర్పా గ్యాల్‌బు మాతో అన్నాడు.

మేము యిటువంటి ప్రదేశంలో క్యాంపు వేసిన తర్వాత మా వదనాలపై చెరిపివేయలేని విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. ఇదొక దుష్టకరమైన ప్రదేశమని షేర్పాల భావం. ఇక్కడి దుష్టశక్తుల వారణకై వారు ప్రార్థనలు ప్రారంభించారు.

షేర్పాలుకూడా ప్రత్యేకంగా పెద్ద ఎత్తున చలిమంటలు వేసుకున్నారు (ఇక్కడ సమృద్ధిగా కలప దొరుకుతుంది) మా యాత్ర ప్రారంభించిన తర్వాత యింత పెద్ద ఎత్తున చలిమంటలు వేసుకోవడం యిదే ప్రథమం. అన్ని విషయాలను మరిచిపోయి గాఢనిద్రకులోనయ్యాము. తెల్లవారి సేదదీరి ఉత్సాహంగా ఉన్నాము. ఎప్పుడూ లేనంత చురుకుదనంతో యిక్కడి క్యాంపు సామాగ్రిని ప్యాక్‌చేశాము. ప్రతి షేర్పా, పోర్టరు సాధ్యమైనంత త్వరలో యీ ప్రదేశాన్ని విడిచి వెళ్ళడానికి ఆత్రత పడ నారంభించారు. తిరిగి మా యాత్రను ఆరంభించాము.

దట్టమైన అడవుల మార్గంగా మా నడక సాగింది. కుక్కగొడుగుల గుత్తులు దారిలో కొల్లలుగా ఉన్నాయి. కొంతసేపాగి చేతులనిండుగా వాటిని సేకరించాము. వాటిని తినడానికి నో రూరుతున్నది. అయితే ప్రత్యేక రకానికి చెందినవాటిని తినకూడదని. విషపూరితమై ఉంటాయని మా వంటవాడు చెప్పగా అప్పటి మా పరిస్థితిని మీరు వూహించుకోండి. ఈ మాట విని మాలో ప్రతి ఒక్కరూ నిరుత్సాహ పడసాగారు. అక్కడ వంతెన క్రాస్‌చేసి అవలివైపు తీరంలో క్యాంపు వేశాము. దీనిని యిద్దరు జర్మన్ సోదరులు నిర్మించారు. ఇక్కడే ఉత్తరాలు తెచ్చే రన్నరు మమ్ముల కలిశాడు. ఈ పర్వతాలలో ఉత్తరాలను అందుకోవడం ఆశ్చర్యకరంగానే ఉంది. ఉత్తరాలను తెచ్చేవాడిని కలుసుకోవడం ఇదే ప్రథమం, ఆఖరు కూడా. అతనికి వి. ఐ. పి.కి యిచ్చేటంత గౌరవాన్ని యిచ్చాము. తినుబండారాలు, టీ యిచ్చాము.

మా సామానులలోని చాలా భాగాన్ని కొండ గుహలలో పేర్చి లాతాకారక్‌లో విడిచివచ్చిన సామాను తేవడానికి కూలీలను వెనక్కు పంపి మేము దౌడి బయలుదేరాము. దౌడి చేరేవరకు ఆగకుండానే నడక సాగించాము. ఇక్కడ దారి దొంకయేమీ లేదు. అన్నీ పొదలు, ముండ్ల కంపలు. వీటిని తప్పుకుని మార్గాన్ని ఏర్పరచుకుంటూ నడచినాము. ఆ తర్వాత కొంతసేపటికే నేనూ ఖుర్షీద్ మా బృందానికి వేరై ముందుగానే వెళ్ళాము. అయితే తప్పుదోవన వెళ్తున్నామని కూలీలు కేకలు వేసేవరకు, ఆశ్చర్యపోయి ఆగిపోయాము. తిరిగి వెనక్కు వెళ్ళి బృందాన్ని కలుసుకోవడానికి అడ్డదారిన వెళ్ళి వారిని కలిశాము. దగ్గరగా కనిపించే మార్గం కష్టాలను కొనితెచ్చుకునేదే అవుతుందని అప్పుడే తెలుసుకోగలిగాము. మా బృందంతో కలిసి తిరిగి ప్రయాణం ప్రారంభించాము. ఆకాశాన్ని అంటే ఉన్నత శిఖరాలతో చిన్నచిన్న కొండల పరిసరాలతో నందాదేవి శిఖరం కనిపించసాగింది. మృగతుని శిఖర మేదో ఊహించుకో నారంభించాము

అంతదూరంలో సవాలు చేస్తున్నట్టుగా ఉన్న ఎత్తైన శిఖరాన్ని తిలకించేవరకు మా వదనాలు ముకుళించక పోయాయేమో నేను చెప్పలేను. కాని "నిరుత్సాహ పడకండి ! దీదీ ! యిప్పటివరకు అన్నికష్టాలను సంతోషంగా ఎదుర్కొని ముందుకు వచ్చిన మీ రందరూ నిశ్చయంగా యీ శిఖరాన్ని అధిరోహిస్తా"రని మా పేర్పాలో ఒకరు గంభీరంగా అన్న యీ కొద్దిమాటలు మా కెంతో ధైర్యాన్ని యిచ్చాయి.

షేర్పాలు ఎంతో ఉత్సాహవంతులు; సహాయం చేయడానికి సర్వ వేళలా సంసిద్ధంగాఉంటారు. వారు మానుంచియెప్పుడూ యేమీ కోరలెదు. దేశంలో మొత్తం ప్రపంచంలో యిలాంటివారి సంఖ్య అత్యధికంగా ఉంటే మన యీ ప్రపంచం ఎంతో బాగుపడేది అనే ఆలోచన మాకు కలిగింది. ఈ పర్వతాలు మనిషిలో మంచినీ. చెడునూ కలిగిస్తాయి. షేర్పాలకు సంబంధించినంతవరకు వారితో మాకు ఉత్తమత్వమే కనిపించింది. షేర్పాలకు మా కృతజ్ఞతలు. వారిసహాయం, ప్రోత్సాహం. విధేయతలే మా విజయానికి చాలావరకు తోడ్పడ్డాయి.

నదీతీరంలో క్యాంపు వేయడానికి అనువైన ప్రదేశాన్ని ఎంపికచేశాము. ఆ నదికి చుట్టూ చిన్న చిన్న పాయలు ప్రవహిస్తున్నాయి. అప్పటికే నదీతీరానికి చేరుకున్న దుర్గ, ఉష యిద్దరు నదిలో తమ కేశాలను పరిశుభ్రం చేసుకుంటున్నారు. మేముకూడా వారితో చేరినాము? అప్పుడు మా వస్త్రాలను చూస్తే "జలకన్యలు"గా కనిపిస్తాము. రాత్రి చాలా చలిగా ఉంది. మంచు కొండలకు అతి సమీపంలో ఉన్న కారణంగా మేము దాదాపు మంచుతో పేరుకొని

పోయాము. మరుసటిరోజు బేస్‌క్యాంపు నెలకొల్పుదామని భావించినాము. అయితే తానొకటి తలిస్తే దైవం ఒకటి తల్చిందనే సామెత ఉందికదా! తీరా మా మ్యాపులను తీసి పరిశీలించగా మేము వేరే మరో మార్గంలో వచ్చినట్టుగా కనుగొన్నాము. నదీతీరం మార్గంగా రావడానికిబదులు మరికొంతముందు, పైకివెళ్ళి మంచుకొండల పంక్తులను చేరాము. ఇసుకగుట్టల కారణంగా ఆ పర్వతశ్రేణులను అధిరోహించడం చాలాకష్టం. గత్యంతరం లేక వచ్చినదోవ తిరిగి వెళ్ళాల్సివచ్చింది.

ఎంతటి నిరాశాజనకమైన పరిస్థితి! ప్రయత్నం వ్యర్థమైనదనికాదు. ఒకరోజు కాలహరణమైనదనేదే మా దుగ్ధ. మధ్యాహ్నం కావచ్చినప్పటికీ మేము తిరిగివెళ్ళి బేస్‌క్యాంపు నెలకొల్పే అవకాశం లేకుండా పోయింది. ఇటువంటి పొరపాటు తిరిగి జరగకుండా చూచుకోవాల్సిఉంది. దిగువకు వెళ్ళి క్యాంపు వేసుకుంటామని కూలీలు నిశ్చయించుకున్నారు. అక్కడ కలప బాగా దొరుకుతుందికాబట్టి చలిమంటలు వేసుకుంటామని మరుసటిరోజువచ్చి కలుస్తామని వారు అన్నారు. తార్షీ, గ్యాల్‌బూ, ఖుర్షీదు శ్రీమతి ధన్‌షేత్, నేనూ యితరులకన్నా ముందుగా గుట్టలు ఎక్కివెళ్ళడం ప్రారంభించాము. బేస్‌క్యాంపుకు అనువైన ప్రదేశాన్ని ముందుగానే ఎంపిక చేయాలనుకున్నాము. అక్కడి ప్రదేశాన్ని దృశ్యాలను నేను వర్ణించలేను. అది ప్రపంచంలోని భాగమేననికూడా చెప్పడం కష్టం. అది స్వర్గధామం అనవచ్చు. పొడుచుకొచ్చిన నల్లని బండరాళ్ళ తలలమీద జారుతున్న మంచుపైపడి ప్రతిఫలించిన సూర్యకిరణాలు వదలిన. యింద్రధనస్సు రంగుల్లో ఆ ప్రదేశం దేవతాలోకమేమో ననుపిస్తుంది! సృష్టిసౌందర్యాన్ని తిలకిస్తూ గంటలతరబడి మంచుకొండల శ్రేణులపై నడిచాము.

ఏటవాలుగా వున్న పర్వతాగ్రానికి ఎక్కుతూఉండగా ఆ ప్రదేశాన్ని ఆవరించిన నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఖుర్షీదు సంతోషములో వేసిన పొలికేక ప్రతిధ్వనించింది. మేమూ హర్షాతిరేకలతో ఆమెతో జత అయ్యాము. సవాలు చేస్తూ మమ్ముల ఆహ్వానిస్తూ గంభీరంగా నిల్చిఉన్న మృగతుని శిఖరం మాకు కనిపించింది. మా సంతోషానికి అదేకారణం. ఆ శిఖరాగ్రాన్ని మేము అధిరోహిస్తామా? "మేము కృతకృత్యులం అవుతామనే భగవంతుని అభీష్టం." మా మనస్సులో దృఢసంకల్పం చేసుకున్నాము. మా యీ ప్రయత్నంలో తోడ్పడమని దైవాన్ని ప్రార్థించాము. మా ధ్యేయం కనుచూపుమేరలో ఉంది. అయినా యింకా ఎంతోదూరమే కనపడే శిఖరాగ్రం మాకు వెయ్యిఏనుగుల బలాన్ని యిచ్చి మా కృషిని ప్రోత్సహిస్తోంది.

మేము మరీ లోతట్టుప్రదేశానికి వచ్చామనీ, నీరు, కలప లభ్యంకాదనీ క్యాంపు వేయడానికి అవి దొరకడానికి వీలుగా తిరిగి వెనక్కు వెళ్ళాలని మా నాయకుడు అభిప్రాయం వెలిబుచ్చాడు. అందువల్ల నీరు బాగా ప్రవహించే నదీతీరానికి బయలుదేరాము. అంతకు క్రితంరాత్రే అక్కడ ఎవరో క్యాంపు వేసినట్టుగా ఉంది ఆ ప్రదేశం. ఇక్కడ బహుశా మేకలగుంపు ఉండివెళ్ళడంవల్ల ఆ ప్రదేశం చిందరవందరగా అయ్యిఉండవచ్చునని షేర్పాలు అన్నారు. 15F00 అడుగులవద్ద మా బేస్ క్యాంపును నెలకొల్పాలని నిశ్చయించాము.


మాకన్నా అతివేగంగా వెళ్ళే మావంటవాడు చుంగీ ఆ ప్రదేశానికి అప్పుడే చేరి క్యాంపువేసి విడిరాళ్ళను సేకరించి పొయ్యి తయారుచేయడం ప్రారంభించాడు. ఆ ప్రదేశమంతా మంచుతో కప్పబడిఉంది.

అప్పుడే మధ్యాహ్నం దాటింది. ఆకాశం నిర్మలంగా ఉంది. సూర్యరశ్మి బాగా ఉంది. మా బూట్లను మేజోళ్ళను విప్పి ఆరవేశాము. ఘనీభవించిన మంచుప్రదేశంలో ఉన్నాకూడా ఎండ మమ్ముల అంతవేడెక్కేలా చేస్తుందని బహుశా మీరు ఊహించలేరేమో. కూలీలు వంటచెరుకు తేగానే చుంగీ ఆనందంతో మంటచేసి కెటిల్ దానిపై ఉంచాడు. ఆఖరుకు ఉష, దుర్గలుకూడా ఉస్సురంటూ మమ్ముల చేరుకుని తడసినవారిబూట్లు, మేజోళ్ళు విప్పి వేశారు. మేమంతా ఆరోజు విశేషాలు నెమరువేసుకుంటూ కూర్చున్నాము.

అప్పటికి చుంగీ టీ తయారుచేయడం పూర్తి అయింది. వలయాకారంగా కూర్చున్న మాకు చిరునవ్వుతో టీకప్పులు అందించాడు. బిస్కెట్లు తింటూ టీ చప్పరిస్తూ అంతవరకూ అనుభవించిన కష్టాలను మరచిపోయాము.

అక్కడ చలిగా ఉంది. దిగువభాగానికి వెళ్ళి క్యాంపువేస్తామని కూలీలు అనడం ప్రారంభించారు. శ్రీమతి ధనేశ్, నేనూ వారికి డబ్బు యిచ్చి వారి వేలిముద్రలు తీసుకోవడంలో నిమగ్నమయ్యాము. దుర్గ, ఉష ఆహారకోటాను యిస్తున్నారు. మాకు నీరు, వంటచెరుకు అందివ్వడానికి నలుగురు కూలీలుమాత్రమే మాతో ఉండిపోయారు. ఈ విధంగా ఆరోజు గడిచింది.

(సశేషం)



ఆదిలాబాదుజిల్లా

సహకారసదస్సు :

మే 12 న జిల్లా సహకార సదస్సుకు కలెక్టరు ప్రారంభోత్సవం చేశారు. రెండు రోజులపాటు జరిగే యీ సదస్సుకు జిల్లా అన్నిచోట్ల నుండి 200 మందికి మించి ప్రతినిధులు విచ్చేశారు.

గ్రామీణ విద్యుదీకరణ :

ఉట్నూరు తాలూకా, తోర్థన్ గ్రామంలో మే 9 వ తేదీన విద్యుచ్ఛక్తి ప్రసారానికి ప్రారంభోత్సవం జరిగింది.

చిత్తూరుజిల్లా

పాఠశాలా భవనం :

తిరుపతిలో మే 6 వ తేదీన మ్యునిసిపల్ వ్యవహారాల శాఖామంత్రి నెహ్రూ పురపాలక సంఘోన్నత పాఠశాలాభవనానికి ప్రారంభోత్సవం చేశారు.

కడపజిల్లా

పాఠశాలా భవనం :

ప్రొద్దుటూరు పంచాయతీ సమితిలోని దొరసానిపల్లి గ్రామంలో పాఠశాలా భవనానికి పంచాయతీరాజ్ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

హైదరాబాదుజిల్లా

పంచాయతీరాజ్ సమావేశం :

హైదరాబాదుజిల్లా పంచాయతీరాజ్‌కు సంబంధించిన మూడు రోజుల సమావేశానికి మేడ్చల్‌లో ఏప్రెలు 25 వ తేదీన పంచాయతీరాజ్ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

శిక్షణ శిబిరం :

పరిగి పంచాయతీ సమితిలోని నరసింగపూర్‌లో మే 6 వ తేదీన మూడు రోజులపాటు జరిగే గ్రామసహాయకుల శిక్షణ శిబిరానికి ప్రారంభోత్సవం జరిగింది.

గ్రామీణ విద్యుదీకరణ :

బోన్‌పల్లి, సుల్తానాపూర్ గ్రామాలలో విద్యుచ్ఛక్తి సౌకర్యానికి మే 11 వ తేదీన ఆర్థికశాఖా మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

కరీంనగర్ జిల్లా

జిల్లా సమ్మేళనం :

కరీంనగర్ జిల్లా పంచాయతీరాజ్ సమ్మేళనానికి పంచాయతీరాజ్ మంత్రి ఏప్రెలు 30 వ తేదీన కరీంనగర్‌లో ప్రారంభోత్సవం చేశారు.

కృష్ణాజిల్లా

సహకార బియ్యంమిల్లు :

ప్రసాదంపాడు గ్రామంలో మే 7న సహకార బియ్యం మిల్లుకు రాష్ట్ర సహకార శాఖా మంత్రి శంకుస్థాపన చేశారు.

పశుగణాభివృద్ధి :

గోగినేని పాలెంలో మే 4 వ తేదీన ప్రాంతీయ పశుగణాభివృద్ధి యూనిటు, మొవ్వకు చెందిన సబ్‌యూనిటు భవనానికి శంకుస్థాపన జరిగింది.

ఏనుగులకొండుతూము :

కంకిపాడు సమితిలోని ఏనుగులకొండు తూముకు మే 5 వ తేదీన పెనమకూరులో కేంద్ర విద్యుచ్ఛక్తి, నీటిపారుదల శాఖా మంత్రి శంకుస్థాపన చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా

శిక్షణ శిబిరం :

అచ్చంపేట పంచాయతీ సమితిలోని ఉప్పునూతల గ్రామంలో ఏప్రెలు 29 నుండి మూడు రోజులపాటు గ్రామసహాయకుల శిక్షణ శిబిరం నిర్వహించబడింది.

మెదక్ జిల్లా

పాఠశాలా భవనం :

దుబ్బాక పంచాయతీ సమితిలోని ధూంపల్లిలో క్రొత్తగా కట్టిన భవనానికి ఏప్రెలు 21 న ప్రారంభోత్సవం జరిగింది.

నల్గొండజిల్లా

వసెక్టమీ ఆపరేషన్లు :

మునిపంపుల గ్రామంలో ఏప్రెలు 15 న ఏర్పాటు చేసిన ఒక శిబిరంలోనల్గురు డాక్టర్లుగల బృందం ముప్పై ఎనిమిది వసెక్టమీ ఆపరేషన్లను నిర్వహించింది.

లుడుంవాగుపై వంతెన :

కాటిపర్తి దగ్గర లుడుంవాగుపై వంతెనకు మే 14 వ తేదీన పబ్లిక్ వర్క్సు శాఖామంత్రి శంకుస్థాపన చేశారు.

పిల్లల ఆరోగ్యం :

ఇందుకూరుపేట పంచాయతీ సమితిలోని పెదచెరుకూరులో పిల్లల ఆరోగ్య కార్యక్రమానికి మే 6 వ తేదీన కలెక్టరు ప్రారంభోత్సం చేశారు.

నిజామాబాదుజిల్లా

విద్యుచ్ఛక్తి సౌకర్యం :

పద్మాశివాడి గ్రామంలో ఏప్రెలు 26 వ తేదీన కలెక్టరు విద్యుచ్ఛక్తి ప్రసారానికి ప్రారంభోత్సవం చేశారు.

హెడ్‌మాస్టర్ల సమ్మేళనం :

జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ల సమ్మేళనం ఒకటి ఏప్రెలు 25, 26 లలో నిజామాబాదులో నిర్వహించబడింది.

విశాఖపట్టణం జిల్లా

పంచాయతీరాజ్ సమ్మేళనం :

ఎలమంచిలిలో ఏప్రెలు 21 వ తేదీన జిల్లా కలెక్టరు పంచాయతీరాజ్ సమ్మేళనానికి ప్రారంభోత్సవం చేశారు.

పారిశ్రామిక ప్రదర్శనం :

మూడవ విశాఖ పారిశ్రామిక, వాణిజ్య ప్రదర్శనకు మే 2 వ తేదీన విశాఖపట్టణంలో హోంమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

పశ్చిమ గోదావరిజిల్లా

ముఖ్యసేవికల సమావేశం :

జిల్లా ముఖ్యసేవికల సమావేశం మే 12 వ తేదీన కొవ్వూరులో జరిగింది.

రెసిడెన్షియల్ పాఠశాల :

గెడ్డపల్లిలో ఏప్రెలు 9 వ తేదీన ఒక రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రారంభోత్సవం జరిగింది.

ప్రగతి పథంలో

Edited and Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-3
Printed at YUVA Press, Public Garden Road, Hyderabad.



Regd. No. H. 133

